అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 18-2 -2018

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 51 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు + సోపతి వెల : 6.00

కంది కష్టాలు

ఉత్పత్తి 3.50 లక్షల టన్నులు..కొన్నది 2 లక్షల టన్నులే

కంది పంట కొనుగోలులో కిరికిరి కొనసాగుతున్నది. ఈ విషయంలో తప్పు నాది కాదంటే నాది కాదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాదించుకుంటున్నాయి. దీంతో రైతులను గాలికి వదిలేసి చోద్యం చూస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అడిగినంత కొనుగోలు చేయబోమని, మొదట తమ వద్దకు వచ్చిన అంచనాల ఆధారంగానే నిర్ణయం తీసుకుంటామని, రాష్ట్రాల వారీగా నిర్ణయాలను మార్చబోమని కేంద్రప్రభుత్వం తెలిపింది. పంట దిగుబడి ఆధారంగానే కేంద్రానికి లేఖ రాశాం తప్ప తామెక్కడ తప్పుదారి పట్టించలేదని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. నిబంధనల పేరుతో ఇంతకు మించి కొనుగోలు చేయబోమంటే, వచ్చిన దిగుబడి ఏమి కావాలని ప్రభుత్వ అధికారులు ప్రశ్నిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ వాదన సరికాదని అభిప్రాయపడ్డారు. అయితే పంట దిగుబడి అంచనా లేకుంటే ఎలా అని కేంద్రప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వమే వెనక్కుతగ్గి మొత్తం పంట దిగుబడిని కొనుగోలు చేయాలని ఇటీవల జరిగిన మార్కెటింగ్ శాఖ సమావేశంలో నిర్ణయం తీసుకున్నది. అటు కేంద్రం ఇటు రాష్ట్రం సకాలంలో నిర్ణయాలు అమలు కాకపోవడంతో కంది రైతు కన్నీరు పెడుతున్నారు.

- తప్పుమాది కాదంటే..మాదికాదు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం
- దిక్కుతోచనిస్థితిలో అన్నదాత



వికారాబాద్ జిల్లా తాండూర్ మార్కెట్‌లో...

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కంది మద్దతు ధర క్వింటాలుకు రూ.5,450 కాగా మార్కెట్‌లో రూ.4వేల లోపే ఉంది. ఖరీఫ్ సీజన్‌లో 6.20 లక్షల ఎకరాల్లో కంది సాగైంది. 1.34 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేసి కేంద్రానికి పంపించారు. ఈ లెక్కల ఆధారంగా పిఎస్ఎస్(పంట దిగుబడి)లో 40 శాతం ప్రకారం 53,600 టన్నులు కొనడానికి నాఫెడ్‌కు కేంద్రం ప్రభుత్వం అనుమతించింది. అయితే కంది పంట వేసుకోవాలని వ్యవసాయ శాఖ విస్తృత ప్రచారం చేయడంతో సాగు విస్తీర్ణం 7.21 లక్షల ఎకరాలకు పెరిగింది. దీంతో 2.84 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. దీంతో కనీసం రెండు లక్షల టన్నులైనా కొనుగోలు చేయాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్ సింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. దీనిపై కేంద్రం స్పందించపోవడంతో లక్షా 50 వేల టన్నులైన కొనుగోలు చేయాలని మరోసారి మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు లేఖ రాశారు. అయినా కేంద్రం పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి కేసీఆర్ లేఖ రాసినా పట్టించుకోలేదని తెలిసింది. అర్థ గణాంక శాఖ (డిఇఎస్) ముందస్తు అంచనాల ప్రకారం మద్దతు ధరకు కొనుగోలు పథకం(పిఎస్-ఎస్) కింద సేకరణకు అనుమతిస్తున్నట్టు కేంద్రం తెలిపింది. దీంతో ముందే చెప్పినట్టుగా 53,600 టన్నులను మాత్రమే 9లో

ఆహార నాణ్యత డొల్ల

ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆడిట్‌లో టాప్ విద్యాసంస్థలు ఫెయిల్

- లిస్టులో ఎయిమ్స్, ఐఐఎం, ఐఐటీలు



న్యూఢిల్లీ: పేరుకు పెద్ద విద్యా సంస్థలైనా.. ఆహార పదార్థాల నాణ్యతలో మాత్రం డొల్లతనం బయటపడింది. దేశంలోని ప్రముఖ ఇన్‌స్టిట్యూషన్లలో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ) నిర్వహించిన ఆడిట్‌లో కళ్లు బైర్లు కమ్మే వాస్తవాలు వెలుగులోకొచ్చాయి. హాస్టళ్ల కిచెన్లు, క్యాంటీన్ల నిర్వహణ దయనీయంగా ఉందని వెల్లడైంది. మొత్తం 12 విద్యా సంస్థల్లో ఆడిట్ నిర్వహించగా.. 2 మాత్రమే పాస్ అయ్యాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.. కేంద్రం ఆదేశాల మేరకు గతేడాది డిసెంబర్‌లో ఎఫ్ఎస్ఎస్ఏఐ.. బాంబే, గువహతి, ఢిల్లీ, చెన్నై, రూర్కీ, ఖరగ్‌పూర్ ఐఐటీలు, అహ్మదాబాద్, ఖాజీకోడ్ ఐఐఎంలు, జోథ్‌పూర్, ఢిల్లీలోని ఎయిమ్స్‌లు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ)-బెంగళూరు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్)-కోల్‌కతాలో ఆడిట్ నిర్వహించింది. ఆడిట్ కోసం ఆరు అంశాలను పరిగణనలోకి తీసుకున్నది. విద్యా సంస్థల్లోని హాస్టల్ కిచెన్లు, గెస్ట్ హౌస్ కిచెన్లు, ఫలహారశాలల్లో ఆడిట్ నిర్వహించింది. కాగా.. ఈ ఆడిట్‌లో ఐఐఎం-అహ్మదాబాద్, ఐఐటీ-రూర్కీ మాత్రమే పాస్ కాగా.. మిగిలినవన్నీ విఫలమయ్యాయి. విఫలమైన విద్యా సంస్థల్లోని కిచెన్‌లలో శుభ్రం చేసిన వంట పాత్రలపై కూడా ఆహారపు అవశేషాలుంటున్నట్టు తేలింది. అంతేకాక, ఆహార పదార్థాలను రీసైక్లింగ్ చేస్తున్నారని, వంట మాస్టర్లు శుభ్రత పాటించలేదని ఎఫ్ఎస్ఎస్ఏఐ తన ఆడిట్ రిపోర్టులో పేర్కొన్నది. కిచెన్‌లలో ఎలుకలు కూడా సంచరిస్తున్నట్టు గుర్తించింది.



ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, మోడీ, చంద్రబాబు



నాన్నతో సెల్ఫీ...

వివరాలు 3లో

పదవుల కోసమే పార్టీలు మారుతున్నరు

- బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యం : బీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్
- 20న సంగారెడ్డిలో బహిరంగ సభ



మాట్లాడుతున్న నల్లా సూర్యప్రకాశ్

నవతెలంగాణ-సంగారెడ్డి టౌన్

రాజకీయ నాయకులు పదవుల కోసమే పార్టీలు మారుతూ ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్ర చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్ అన్నారు. రాష్ట్రంలో బహుజనులకు రాజ్యాధికారం రావడమే లక్ష్యంగా బీఎల్ఎఫ్ పనిచేస్తుందన్నారు. ఈనెల 20న సంగారెడ్డి జిల్లా కేంద్రంలో బీఎల్ఎఫ్ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. శనివారం సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి లక్ష్యాలతోనే బీఎల్ఎఫ్ ఆవిర్భవించిందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అధికారం 9లో

కమ్యూనిస్టులు ఏకమవ్వాలి

- ఐక్య ఉద్యమాలు నిర్మించాలి : ఖమ్మం బహిరంగ సభలో సురవరం సుధాకర్‌రెడ్డి



వివరాలు 9లో

ఇంటర్ పరీక్షలు యథాతథం

వాయిదా వేసే ప్రసక్తే లేదు



- ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే వీలైనన్ని కేంద్రాలు
- ఇన్విజిలేటర్లుగా సర్కారు ఉపాధ్యాయులు
- యాజమాన్యాలు కావాలనే బహిష్కరిస్తున్నాయి : ఉప ముఖ్యమంత్రి కడియం

వివరాలు 9లో

భారత్-ఇరాన్ మధ్య 9 ఒప్పందాలు

- సవాల్‌గా మారినఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణ : రౌహానీతో మోడీ



వివరాలు 9లో

కాన్సెప్టే నాది.. నేను తీయలే : వర్మ

- జీఎస్‌టీపై వర్మను విచారించిన సీసీఎస్ పోలీసులు
- ల్యాప్‌టాప్ సీజ్..మళ్లీ విచారణకు హాజరవ్వాలని ఆదేశం
- కీరవాణికి త్వరలో నోటీసులు ?



నవతెలంగాణ - హైదరాబాద్ సిటీబ్యూరో

'జీఎస్టీ కాన్సెప్ట్ మాత్రమే నాది. నేను సినిమా తీయలేదు' అని దర్శకుడు రాంగోపాల్ వర్మ అన్నారు. "జీఎస్టీ" వెబ్ సిరీస్ సినిమా కేసులో ఆయన హైదరాబాద్ సీసీఎస్ పోలీసుల ముందు శనివారం విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం పోలీసులు ఆయన ల్యాప్‌టాప్ సీజ్ చేశారు. తదుపరి విచారణకు శుక్రవారం మళ్లీ హాజరుకావాలని ఆదేశించారు. అశ్లీలతతోపాటు మహిళలను కించపరుస్తూ సినిమా చిత్రీకరించడమే కాకుండా తనను పెట్టి సినిమా తీస్తాననడంపై సామాజిక కార్యకర్త దేవి సీసీఎస్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు వర్మపై 508, 509 ఐటీచట్టం కింద 9లో



అప్పు కావాలా..? నీ పేరు చివర్లో మోడీ అనిగానీ.. మాల్యా అనిగానీ లేకుండానే ఎలా అప్పు ఇస్తారనుకున్నావయ్యా..!!

ఏ దేశంలోనైనా స్త్రీ,పురుషులు సమానంగా ఉంటేనే ప్రకృతి సహజంగా ఉంటుంది. కానీ దేశంలో బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బాలురకంటే బాలికల సంఖ్య తగ్గిపోతున్నది.ఈ విషయాలను కేంద్రం నివేదికే తెలుపుతున్నది.గర్భస్థశిశువుగా మారకముందే లింగనిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నారు. పిండదశలో ఉన్నది బాలుడా.. బాలికో నిర్ధారించుకుంటున్నారు. బాలికని తేలగానే.. చిదిమేస్తున్న ఫలితమిది. ఓ వైపు బేటీ బచావో... బేటీకో పడావో అంటున్న బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే లింగనిష్పత్తిలో వ్యత్యాసం ఉండటం చర్చనీయాంశంగా మారింది.

చిదిమేస్తున్నారు

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తగ్గుతున్న బాలికల సంఖ్య

- గుజరాత్‌లో 1000మంది పురుషులకు 854మంది మహిళలు : నిటి ఆయోగ్ నివేదిక



న్యూఢిల్లీ: దేశంలోని 21 పెద్ద రాష్ట్రాల్లో జనన లింగ నిష్పత్తిని(ఎస్ఆర్‌బీ) పరిశీలిస్తే 17 రాష్ట్రాల్లో అసమానతలు(10 పాయింట్లు లేదా అంతకన్నా) అధికంగా ఉన్నట్టు నిటి ఆయోగ్ నివేదిక వెల్లడించింది. గుజరాత్‌లో ఈ అసమానత అత్యధికంగా ఉన్నట్టు తెలిపింది. నివేదిక ప్రకారం గుజరాత్‌లో 1000మంది పురుషులకు 854 మహిళలుగా 2013-15లో నమోదైంది. బేస్ ఇయర్(ఆధారిత సంవత్సరం) 2012-14లో ఈ రాష్ట్రంలో మహిళలు 907గా ఉన్నారు. దీంతో అత్యధికంగా 53 పాయింట్లకు దిగజారి లింగ నిష్పత్తి సమానత్వంలో గుజరాత్ అథమస్థానంలో ఉన్నది. అసమానత్వంలో తర్వాతి స్థానాల్లో 35 పాయింట్లతో హర్యానా, 32 పాయింట్లతో రాజస్థాన్, 27 పాయింట్లతో ఉత్తరాఖండ్, 18పాయింట్లతో మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్(14 పాయింట్లు), ఛత్తీస్‌గఢ్(12 పాయింట్లు),కర్నాటక 11 పాయింట్లతో ఉన్నాయి. కర్నాటక(కాంగ్రెస్) మినహా మిగతా రాష్ట్రాలన్నిటిలోనూ బీజేపీ అధికారంలో ఉండటం గమనార్హం. బాలికల జననాల పట్ల వివక్షను నిరోధించేందుకు 9లో

సమాధులు తవ్వుకొని రైతుల నిరసన

రాజస్థాన్‌లో భూసేకరణకు వ్యతిరేకంగా..



జైపూర్ : రాజస్థాన్‌లోని సికార్ జిల్లాలో భూ సేకరణకు వ్యతిరేకంగా రైతులు వినూత్న రీతిలో నిరసనకు దిగారు. సమాధులు తవ్వుకొని ఆందోళన చేపట్టారు. టోల్ రోడ్డు కోసం వ్యవసాయ భూములను గుంజుకున్నారని, పరిహారం మాత్రం చేతికందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని నిర్వాసితులు హెచ్చరిస్తున్నారు. సమాధిని రోజుకో అడుగు లోతు తవ్వుకోనున్నట్టు సంఘర్ష్ సమితి సభ్యుడు నరేంద్ర బతాడ్ శనివారం వెల్లడించారు. అంతేకాక సోమవారం భారీ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని జైపూర్‌కు సమీపంలో ఉన్న నిందార్ గ్రామ రైతులు కొద్ది నెలల క్రితం ఇదే రీతిలో నెల రోజుల పాటు ఆమరణ దీక్షలు చేసిన సంగతి తెలిసిందే. హౌసింగ్ ప్రాజెక్టు కోసం నిందార్ పరిధిలోని వ్యవసాయ భూముల సేకరణకు నిరసనగా నిర్వాసితులు దీక్షలు చేపట్టారు. దీంతో వెనక్కి తగ్గిన వసుంధర రాజే సర్కారు మరోసారి భూములను సర్వే చేస్తామని హామీ ఇచ్చింది.

కాంగ్రెస్ గూటికి అరవింద్ సింగ్ లవ్లీ

న్యూఢిల్లీ : మాజీ ఎమ్మెల్యే అరవింద్ సింగ్ లవ్లీ తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారని శనివారం ఢిల్లీ కాంగ్రెస్ పార్టీ చీఫ్ అజయ్ మాకెన్ తెలిపారు. ఏప్రిల్ 2017లో ఆయన కాంగ్రెస్ నుండి బీజేపీలో చేరారు. శనివారం తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. లవ్లీ కుటుంబం కూడా తొలి నుండి కాంగ్రెస్‌తోనే ఉంది. 20 నియోజకవర్గాలను లవ్లీ ప్రభావితం చేయగలరని తెలిపారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో లవ్లీ తిరిగి కాంగ్రెస్‌లో చేరికతో కాంగ్రెస్ బలోపేతం అవుతుందనే ఆశాభావాన్ని అజయ్‌మాకెన్ వ్యక్తం చేశారు. దీనిపై లవ్లీ స్పందిస్తూ తాను బీజేపీలో చేరే సమయంలో సరైన నిర్ణయం తీసుకోలేదని, మాకెన్‌తో చర్చించిన అనంతరం కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. దీనిపై ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ మాట్లాడుతూ లవ్లీ తిరిగి కాంగ్రెస్‌లో చేరడం మంచి పరిణామమన్నారు. కార్పొరేషన్‌లో టికెట్ల పంపిణీలో అవినీతి ఆరోపణలకు పాల్పడ్డారని విమర్శలు ఎదుర్కొనడంతో అప్పట్లో కాంగ్రెస్ అతన్ని బహిష్కరించింది. దీంతో అతడు గతేడాది ఏప్రిల్‌లో బీజేపీలో చేరారు. ప్రస్తుతం మరలా కాంగ్రెస్‌లో చేరడం ఆనందంగా ఉందని పేర్కొనడం గమనార్హం. కాగా, 1998లో ఆయన తొలిసారి ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో ఆయన ఓటమి చవి చూడలేదు. 2013లో గాంధీనగర్ నియోజకవర్గం నుండి నాల్గోసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు.

పెండ్లికి అంగీకరించలేదని...

బాలికపై పెట్రోల్ పోసి నిప్పంటించిన దుండగుడు

మధురైలో ఘాతుకం

చెన్నై: పెళ్లికి అంగీకరించలేదన్న కారణంలో బాలికపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన శుక్రవారం సాయంత్రం మధురైకు సమీపంలోని తిరుమంగళమ్‌లో చోటుచేసుకుంది. గాయపడిన బాలికను చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు. వివరాల్లోకెళ్తే 22 ఏండ్ల బాలమురుగన్ 14 ఏళ్ల బాలికను కొంతకాలంగా వేధిస్తున్నాడు. కొన్ని రోజుల కిందట ఆమె ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దీంతో ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అతనిపై లైంగిక వేధింపుల చట్టం 2012 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి, అరెస్టు చేశారు. అయితే బాలమురుగన్ శుక్రవారం బెయిల్‌పై తిరిగొచ్చాడు. సాయంత్రం స్కూలు నుంచి తిరిగి వస్తున్న బాలికను ఆపి ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. నిందితుడు పరారీలో ఉన్నాడని, అతడిని పట్టుకునేందుకు పోలీసు బృందాలు గాలిస్తున్నాయని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

బోగీలపై రిజర్వేషన్ చార్టులకు చెల్లు

న్యూఢిల్లీ : రైలు బోగీలపై ఇకనుంచి రిజర్వేషన్ల చార్టులను అంటించకూడదని భారత రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకున్నది. పైలట్ ప్రాజెక్టుగా ఆరు నెలల పాటు ఈ విధానాన్ని అమలు చేయనున్నట్టు శనివారం వెల్లడించింది. ఏ1, ఏ, బీ స్టేషన్ల పరిధిలోని రైళ్ల బోగీలన్నింటిపై మార్చి 1 నుంచి రిజర్వేషన్ చార్టులను అంటించబోమని స్పష్టం చేసింది. ఎలాగు రైల్వేస్టేషన్లలో ప్లాస్మా తెరలపై రిజర్వేషన్ చార్టులను ప్రదర్శిస్తున్నందున బోగీలపై ప్రత్యేకంగా పేపర్ చార్టులను అంటించాల్సిన అవసరం లేదని రైల్వే శాఖ భావిస్తున్నది. ఆదాయాన్ని ఆధారంగా చేసుకొని రైల్వేస్టేషన్లను ఏ1, ఏ, బీ, సీ, డీ, ఈ, ఎఫ్ కేటగిరీలుగా వర్గీకరించారు. తెలంగాణ, ఏపీలో ఏ1, ఏ, బీ కేటగిరీ కింద 34 రైల్వే స్టేషన్లు ఉన్నాయి.

అభివృద్ధి కవరేజీనే నిజమైన జర్నలిజం

ఎన్ఐఏ అధికారుల వింత వాదన

కాశ్మీరీ జర్నలిస్టును విడిచిపెట్టాలని సీపీజే డిమాండ్

న్యూఢిల్లీ : జర్నలిస్టు అన్న పదానికి నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) వింత నిర్వచనం ఇచ్చింది.. నిజమైన జర్నలిస్టులు అంటే.. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మాత్రమే కవర్ చేయాలని, అది వారి నైతిక బాధ్యత అని ఎన్ఐఏ అధికారులు చెప్పడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాశ్మీర్‌లో గతేడాది సెప్టెంబర్ 7న పోలీసులకు, నిరసనకారులకు మధ్య ఘర్షణను కవరేజీ చేస్తున్న ఫొటో జర్నలిస్టు కమ్రాన్ యూసఫ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. రాళ్లదాడి ఘటనల్లో, టెర్రర్ ఫండింగ్ వ్యవహారంలో అతడి ప్రమేయముందని పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాగా.. యూసఫ్ బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో గురువారం విచారణ జరిగింది. ఈ క్రమంలో.. కోర్టులో ఎన్ఐఏ అధికారులు తమ వాదనను వినిపిస్తూ.. యూసఫ్ నిజమైన జర్నలిస్టు కాదని అన్నారు. నిజమైన జర్నలిస్టు అంటే అభివృద్ధి కార్యక్రమాలు తప్ప మరే వాటినీ పట్టించుకోకూడదని తెలిపారు. బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణ సోమవారం(నేడు) జరగనున్నది. మరోవైపు.. జర్నలిస్టు యూసఫ్‌ను వెంటనే విడిచి పెట్టాలంటూ అంతర్జాతీయ సంస్థ కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్(సీపీజే).. భారతీయ అధికారులు, ఎన్ఐఏను డిమాండ్ చేసింది. ఎన్ఐఏ అధికారులు కోర్టులో తమ పరిధిని దాటి వ్యవహరించారని, జర్నలిస్టులు ఏం చేయాలో.. ఏం చేయకూడదో చెప్పేందుకు వారికి ఎలాంటి అధికారం లేదని సీపీజే ఆసియా ప్రొగ్రాం కో ఆర్డినేటర్ స్టీవెన్ బట్లర్ అన్నారు.

నో హంగ్.. మరోసారి అధికారం మాదే : కర్నాటక సీఎం

బెంగళూరు: కర్నాటకలో తమకు పూర్తి మెజారిటీ వస్తుందని, హంగ్ అసెంబ్లీకి అవకాశంలేదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య(కాంగ్రెస్) ధీమా వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఆ రాష్ట్ర అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో మాజీ ప్రధాని హెచ్‌డి దేవెగౌడ నేతృత్వంలోని జేడీ(ఎస్) కీలక పాత్ర వహించనున్నట్టు అంచనాలున్నాయి. హంగ్ ఏర్పడితే దేవెగౌడ మద్దతు తీసుకుంటారా అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ ఆ పరిస్థితే ఉత్పన్నం కాదని, ఎవరి సహకారమూ లేకుండా సొంతంగానే తాము తిరిగి అధికారంలోకి రాగలమని సిద్దరామయ్య అన్నారు. ఎన్‌సీపీ, బీఎస్పీతో కలిసి జేడీ(ఎస్) కూటమి ఏర్పాటు చేయనున్నట్టు తెలుస్తోంది. 10 శాతం కమీషన్ లేనిదే కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పనీ చేయదంటూ ప్రధాని మోడీ చేసిన విమర్శలను సిద్దరామయ్య తిప్పికొట్టారు. తన స్థానంలో బీజేపీ తరపున మాజీ ముఖ్యమంత్రి బిఎస్ యడ్యూరప్పను అధికారంలోకి తేవాలని ప్రధాని భావిస్తున్నారని, యడ్యూరప్పను మించిన అవినీతి సీఎం మరొకరు లేరని సిద్దరామయ్య అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ గౌరీలంకేశ్ హత్యపై సీబీఐ విచారణ అవసరంలేదని సిద్దరామయ్య అన్నారు. గౌరీ కుటుంబసభ్యులు తనకు సన్నిహితులని ఆయన తెలిపారు. ఆ రాష్ట్ర పోలీసులు గౌరీ హత్యపై దర్యాప్తు చేస్తున్నారు.

విద్వేష, మతోన్మాద రాజకీయాలను ప్రతిఘటించండి

విద్యార్థి లోకానికి ప్రకాశ్ రాజ్ పిలుపు



బెంగళూరు : విద్వేష, మతోన్మాద రాజకీయాలను ప్రతిఘటించాలని, వాటికి వ్యతిరేకంగా పోరు సల్పాలని విద్యార్థి లోకానికి ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్ రాజ్ పిలుపునిచ్చారు. మనం భయంతో వారు బలం పుంజుకునేందుకు అనుమతించకూడదని అన్నారు. ధైర్యంతో వినిపించే ప్రతి గొంతూ వారిని భయపెట్టాలి, ఆందోళనకు గురి చేయాలని అన్నారు. ఎవరైతే అసమ్మతి స్వరం వినిపిస్తారో, ఎవరైతే సంక్లిష్టమైన ప్రశ్నలను లేవదీస్తారో వారందరినీ జాతి వ్యతిరేక శక్తులుగా ముద్ర వేసేస్తున్నారు. ఇదే గనుక కొనసాగితే, త్వరలోనే దేశంలో మెజారిటీ జాతి వ్యతిరేకులుగా ఆవిర్భవిస్తారని ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యానించారు. ఇక్కడ భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) నిర్వహించిన మతోన్మాదంపై జాతీయ సదస్సును ఆయన ప్రారంభించిన అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సామరస్యతా ప్రకటన పేరుతో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ సదస్సును నిర్వహించారు. సుప్రీం కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి గోపాల్ గౌడ కీలకోపన్యాసం చేస్తూ, దేశంలో రాజ్యాంగ నిబంధనలు ఎలా దాడికి గురవుతున్నాయో వివరించారు. ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు మార్క్సిజం మాత్రమే సరైన పరిష్కార మార్గమని ఆయన ఉద్ఘాటించారు. సదస్సుకు ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వి.పి.సానూ అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి విక్రమ్‌సింగ్ మతోన్మాదంపై తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఎస్ఎఫ్ఐ కేంద్ర కార్యవర్గ సభ్యులు నితీష్ నారాయణన్, రేణుకా కహర్, మంజుశ్రీ, అంబరీష్, గురురాజ్‌లు కూడా సదస్సులో ప్రసంగించారు. దక్షిణ భారతదేశ రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాల ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారు.

జాతీయ ఆరోగ్య పథకానికి..

రెండేండ్లకు 25,000 కోట్లు

రాష్ట్రాల వాటా రూ.10,000 కోట్లు

- ఒక్కో కుటుంబానికి ప్రీమియం రూ.1082
- ఆగస్టు 15నుంచి అమలుకు కేంద్రం యోచన..?



న్యూఢిల్లీ: జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకం(ఎన్‌హెచ్‌పీఎస్) కోసం రెండేండ్ల కాలానికి(2018-19, 2019-20) రూ.25,000 కోట్లు ఖర్చు కానున్నట్టు కేంద్ర ఆరోగ్యశాఖ, నిటి ఆయోగ్ అంచనా వేశాయి. ఇందులో రాష్ట్రాల వాటాగా రూ.10,000 కోట్లు కాగా,మిగతా మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం భరించాలి. ఈ మేరకు ఆర్థిక అంచనాల కమిటీ(ఈఎఫ్‌సీ) ముందు ప్రతిపాదనలుంచినట్టు తెలుస్తోంది. ఈ పథకం రూపకల్పనలో నిటి ఆయోగ్ కీలక పాత్ర వహించిన విషయం తెలిసిందే..

ఈ పథకం కింద చేరే ప్రతి కుటుంబానికీ రూ.1082 ప్రీమియం కింద చెల్లించాలి. ఇందులో కేంద్రం రూ.650, రాష్ట్రాలు రూ.432 తమ వాటాల కింద సమకూర్చాలనేది ప్రాథమిక అంచనా. అయితే, ఇప్పటికే ఆరోగ్యబీమాను అనుసరిస్తున్న రాష్ట్రాల డేటా ఆధారంగా వాస్తవ అంచనాలను తయారు చేయాలని ఆరోగ్య మంత్రిత్వశాఖకు నిటి ఆయోగ్ సూచించింది. కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన పథకంలో కుటుంబానికి రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పించాలి. ప్రస్తుతం అమలవుతున్న బీమా పథకాల లెక్కన కుటుంబానికి రూ.5000కు పైగానే బీమా కింద ప్రీమియంగా చెల్లించాల్సి ఉంటుందని భావిస్తున్నారు. రాజస్థాన్ ప్రభుత్వం ఆ రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు భామాషా ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద రూ.3 లక్షల వరకూ బీమా సదుపాయం కల్పిస్తున్నారు. అందుకు కుటుంబానికి రూ.1250 చొప్పున ప్రీమియంగా చెల్లిస్తున్నారు.

కేంద్ర పథకాన్ని ఏవిధంగా అమలు చేయాలన్నదానిపై ఈఎఫ్‌సీ కార్యదర్శి అధ్యక్షతన గురువారం భేటీ అయిన అధికారులు ఇంకా ఓ అంచనాకు రాలేకపోయినట్టు తెలుస్తోంది. వారంరోజుల్లో మరోసారి భేటీ కానున్నారు. అయితే, ఈ పథకం అమలు కోసం జాతీయ ఆరోగ్య పరిరక్షణ మండలి(ఎన్‌హెచ్‌పీసీ), జాతీయ పరిపాలనా బోర్డు(ఎన్‌జీబీ), జాతీయ ఆరోగ్య ఏజెన్సీ(ఎన్‌హెచ్‌ఏ) పేరుతో కేంద్ర ప్రభుత్వం మూడు విభాగాలను ఏర్పాటు చేయనున్నది. ఆగస్టు 15న ఈ పథకాన్ని ప్రారంభించేందుకు కేంద్రం సిద్ధమవుతోంది.

ఈ పథకానికి విధానపరమైన మార్గదర్శకాలను ఎన్‌హెచ్‌పీసీ రూపొందిస్తుంది. దీనికి కేంద్ర ఆరోగ్యమంత్రి చైర్మన్‌గా, కోచైర్‌పర్సన్‌గా నిటి ఆయోగ్ వైస్‌చైర్మన్ వ్యవహరిస్తారు. రాష్ట్రాల ఆరోగ్యశాఖల మంత్రులు ఇందులో సభ్యులుగా ఉంటారు. మెంబర్ సెక్రటరీగా ఎన్‌జీబీ కోచైర్‌పర్సన్ వ్యవహరిస్తారు. నిటి ఆయోగ్‌లోని ఆరోగ్య విభాగం నుంచి ఓ సభ్యుడిని ఎన్‌జీబీకి చైర్‌పర్సన్‌గా, ఆరోగ్యశాఖ కార్యదర్శిని కో చైర్‌పర్సన్‌గా నియమిస్తారు. ఎన్‌జీబీలో నిటి ఆయోగ్ సీఈవో,నేషనల్ హెల్త్ ఏజెన్సీ(ఎన్‌హెచ్‌ఏ) సీఈవో సహా కేంద్రంలోని పలు మంత్రిత్వశాఖల కార్యదర్శులు, నాలుగు రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. ఈ పథకానికి ఎన్‌జీబీ నిర్ణాయక విభాగంగా పని చేయనున్నది. ఎన్‌హెచ్‌ఏ ఈ పథకాన్ని అమలు చేయనున్నది. ఎన్‌హెచ్‌ఏ సీఈవోకు అదనపు కార్యదర్శి లేదా సంయుక్త కార్యదర్శి హోదా ఇవ్వనున్నారు. ఈఎఫ్‌సీ ముందు దీనికి సంబంధించిన ప్రతిపాదన కూడా ఉంచారు. ఈ పథకం అమలు కోసం ఏర్పాటు చేయనున్న ఎన్‌హెచ్‌ఏ, ప్రాథమిక వసతులు, ఐటీ, పరిపాలనా విభాగం కోసం రూ.300 కోట్లు ఖర్చు కానున్నట్టు అంచనా.

రుణ ఉపశమన చట్టాలున్నప్పుడే...

- రైతుల రుణాల వడ్డీరేట్లపై కోర్టులకు పరిశీలనాధికారం : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: రైతుల రుణాల వడ్డీరేట్లను పరిశీలించే అధికారం కోర్టులకు ఉంటుందని సుప్రీంకోర్టు తెలిపింది. అయితే, రాష్ట్రాల్లో రైతుల రుణాలకు ఉపశమన చట్టాలు అమలులో ఉన్నపుడు మాత్రమే బ్యాంకుల వడ్డీ రేట్లపై సమీక్షించే అధికారం కోర్టులకు ఉంటుందని జస్టిస్ ఆర్‌ఎఫ్ నారిమన్, జస్టిస్ నవీన్‌సిన్హాతో కూడిన సుప్రీం ధర్మాసనం తన తీర్పులో పేర్కొన్నది.

బ్యాంకింగ్ నియంత్రణ చట్టం-1949లోని సెక్షన్ 21ఏను సవాల్ చేస్తూ వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. బ్యాంకులు అధిక వడ్డీరేట్లు వసూలు చేయడం వల్ల 1995 నుంచి 2010 వరకు 2,56,913మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్టు 2013లో ఈ వ్యాజ్యం వేసిన సామాజిక కార్యకర్త జయంత్‌వర్మ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. బ్యాంకింగ్ చట్టంలోని సెక్షన్ 21ఏ 1984, ఫిబ్రవరి 15 నుంచి అమలవుతోంది. ఈ సెక్షన్ ప్రకారం బ్యాంకుకూ-రుణగ్రహీతకూ మధ్య లావాదేవీలకు సంబంధించిన ఒప్పందంపై వడ్డీరేట్ అధికంగా ఉన్నదన్న కారణంతో ఏ కోర్టుగానీ పరిశీలన జరిపేందుకు వీలు లేదు. రైతులను రుణ విముక్తుల్ని చేయడం కోసం రాష్ట్రాల్లో ఉపశమన చట్టాలను అమలు చేస్తున్న సందర్భాల్లో మాత్రమే వడ్డీరేట్లపై పరిశీలనకు అవకాశముంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. లేనిపక్షంలో ఈ చట్టం చెల్లుబాటవుతుందని తెలిపింది. 102 పేజీల ఈ కీలక తీర్పులో రాజ్యాంగంలోని షెడ్యూల్ 7లో పొందుపరిచిన కేంద్ర, రాష్ట్రాల అధికారాలకు సంబంధించిన జాబితాల్లోని అంశాలను సుప్రీం ధర్మాసనం గుర్తు చేసింది. బ్యాంకింగ్ వ్యవస్థపై అధికారం కేంద్రం పరిధిలోనిది కాగా, వ్యవసాయానికి సంబంధించిన అంశాలు రాష్ట్ర జాబితాలోనివి. దీంతో, కేంద్ర జాబితాలోని అంశానికీ, రాష్ట్ర జాబితాలోని అంశానికీ సమన్వయం కుదరని పక్షంలో మాత్రమే కేంద్ర జాబితాలోని అంశానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని సుప్రీం ధర్మాసనం తెలిపింది. అందుకు సంబంధించిన 246వ రాజ్యాంగ అధికరణాన్ని ధర్మాసనం ఉటంకించింది.

త్రిపురకు ప్రత్యేక పరిశీలకుని నియామకంపై

సీపీఐ(ఎం) ఆందోళన

- ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు మెమోరాండం

న్యూఢిల్లీ : సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం ప్రధాన ఎన్నికల కమిషనర్ ఓ.పి.రావత్‌ను కలుసుకుని త్రిపురలో ప్రత్యేక పరిశీలకుడిని నియమించడంపై ఆందోళన వ్యక్తం చేసింది. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఎస్.రామచంద్రన్ పిళ్ళై, బృందాకరత్‌లతో కూడిన ఈ బృందం అనంతరం రావత్‌కు మెమోరాండం సమర్పించింది. ఐటీబీపీ డైరెక్టర్ జనరల్ ఆర్.కె.పంచానందను ఆదివారం జరగనున్న త్రిపుర అసెంబ్లీ ఎన్నికల పరిశీలకుడిగా నియమించడాన్ని అసాధారణ చర్యగా సీపీఐ(ఎం) ఆ వినతిపత్రంలో పేర్కొంది. పైగా పంచానంద ప్రధాన ఎన్నికల కమిషనర్ చాంబర్‌లోనే రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడితో రహస్యంగా సమావేశం కావడాన్ని త్రిపుర స్థానిక టివి చానెళ్ళు ప్రసారం చేశాయని, ఇది త్రిపుర ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించిందని ఆ మెమోరాండంలో పేర్కొన్నారు. ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకుని, ప్రజలకు వివరణ ఇవ్వాలని సీపీఐ(ఎం) కోరింది. దీనిపై ప్రధాన ఎన్నికల కమిషనర్ స్పందిస్తూ, కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయించిన విధంగా ప్రత్యేక పరిశీలకుని నియామకం, ఆయన కార్యకలాపాల పరిధి గురించి తెలియచేస్తూ అన్ని రాజకీయ పార్టీలకు రాతపూర్వకంగా సమాచారం అందిస్తామని ప్రతినిధి బృందానికి హామీ ఇచ్చారు.

మోడీ ఒత్తిడి మేరకే ఏఐఏడీఎంకే విలీనం

అమ్మ మరణం తర్వాత అనేక వేధింపులు

డిప్యూటీ సీఎం పన్నీరుసెల్వం వెల్లడి

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ ఒత్తిడి తెచ్చిన కారణంగానే ఏఐఏడీఎంకేలోని వర్గాల మధ్య విలీనం జరిగిందని తమిళనాడు ఉప ముఖ్యమంత్రి పన్నీరు సెల్వం వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే పళనిస్వామితో తాను చేతులు కలిపినట్టు ఆయన తేల్చి చెప్పారు. 'అన్నా డీఎంకేలోని వర్గాలు విలీనమై పార్టీని రక్షించుకోవాలని మోడీ సూచించారు. దీనికి అంగీకరించాను కానీ, మంత్రి పదవి చేపట్టడానికి ఇష్టపడలేదు. పార్టీ, పదవికే పరిమితం కావాలని, రాజకీయాల్లో కీలకంగా కొనసాగాలని చెప్పారు' అని తేని జిల్లా కేంద్రంలో జరిగిన ఏఐఏడీఎంకే పార్టీ సమావేశంలో పన్నీరు సెల్వం తెలిపారు. జయలలిత మరణం తర్వాత అనేక సమస్యలు, వేధింపులు ఎదుర్కొన్నానని, తన స్థానంలో మరొకరు ఉంటే ఆ వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకునేవారని చెప్పారు.

'అమ్మ' కారణంగానే వేధింపులు భరించానని అన్నారు. గతేడాది ప్రారంభంలో శశికళపై తిరుగుబాటు చేసిన పన్నీరు సెల్వం, పార్టీని చీల్చడానికి కూడా ప్రయత్నించారు. సుమారు ఆరు నెలల పాటు పోటీ శిబిరం నడిపిన అనంతరం పళని వర్గంతో విలీనానికి అంగీకరించారు. దీంతో పళనిస్వామి ముఖ్యమంత్రి కాగా, పన్నీరుసెల్వం డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. కాగా, పన్నీరు, పళని వర్గాల విలీనానికి సంబంధించి బీజేపీ ఆశీస్సులు ఉన్నాయని, అప్పట్లోనే వార్తలు వెలువడ్డాయి. తాజాగా పన్నీరు వ్యాఖ్యలతో అవి వాస్తవమని రుజువయ్యాయి.

జెండాలు మారినా.. అదే ఎజెండా..

2008లో కాంగ్రెస్...
2018లో బీజేపీ..

వాగ్దానాలు.. విమర్శల్లోనూ ఒకే రూటు

నేడు త్రిపుర అసెంబ్లీ ఎన్నికలు

నవతెలంగాణ - జనరల్ డెస్క్

అది 2008 ఫిబ్రవరి నెల. త్రిపురలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. కాంగ్రెస్ అప్పటి అధ్యక్షురాలు సోనియా గాంధీని తరుణ్‌దాస్ (80) మొదటిసారి చూశాడు. త్రిపుర రాజధాని అగర్తలలోని బర్జాలా ప్రాంతంలో దాస్ నివాసానికి సమీపంలో ఒక ఎన్నికల ర్యాలీలో సోనియా గాంధీ ప్రసంగించిన సందర్భమది.

సోనియా ఏం చెప్పారు?

మాణిక్ సర్కార్ నేతృత్వంలోని వామపక్ష ప్రభుత్వం కేంద్ర నిధులను 'తమ సొంత రాజకీయ ప్రయోజనాల' కోసం మళ్లించారని సోనియా గాంధీ ఆరోపించారు. రూ.500 కోట్ల కేంద్ర నిధులను ఉపయోగించుకోలేదనీ, మహిళలకు, పిల్లలకు భద్రత కల్పించడంలో, యువతకు ఉద్యోగ కల్పనలో విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు ఆరో పే కమిషన్ సిఫారసుల ప్రకారం జీతాలు చెల్లిస్తామని ఆమె ఉద్యోగులకు వాగ్దానం చేశారు. లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం అప్పుడు ఉద్యోగులకు నాలుగో వేతన కమిషన్ సిఫారసుల ప్రకారం జీతాలు చెల్లిస్తున్నది. 'ఎంతకాలం మీరు ఈ లెఫ్ట్ ప్రభుత్వాన్ని సహిస్తారు? ఓర్పుకు కూడా ఓ పరిమితి ఉంటుంది. రానున్న ఎన్నికల్లో లెఫ్ట్ ఫ్రంట్‌ను ఓడించడం ఒక్కటే ప్రత్యామ్నాయం' అని సోనియా తనదైన శైలిలో ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. 'ఢిల్లీ సమీకరణాలను' దృష్టిలో పెట్టుకొని వామపక్ష ప్రభుత్వంపై 'సరళమైన వైఖరి'ని ప్రదర్శిస్తుందంటూ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అధినాయకత్వంపై గుర్రుగా ఉన్న రాష్ట్ర నాయకులు, లెఫ్టేతర ఓటర్లకు సోనియాగాంధీ ఆ సందేశాన్ని ఇచ్చారు.

త్రిపురలోని 2008 శాసనసభ ఎన్నికల్లో సోనియా గాంధీ రెండు బహిరంగసభలతో పాటు (మరొకటి ధర్మానగర్), అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, రాహుల్ గాంధీ కూడా త్రిపురలో జరిగిన పలు సభల్లో ప్రసంగించారు. 1998 నుంచి రాష్ట్రంలో సీపీఐ(ఎం) బాగా బలపడి ఉంది. సుదీర్ఘకాలం తర్వాత అంటే 2008లో లెఫ్ట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు ఆ రాష్ట్రానికి క్యూ కట్టారు. విస్తృత ప్రచారం నిర్వహించారు.

2008 ఎన్నికల్లో కాంగ్రెస్ 47 మంది అభ్యర్థులను బరిలో దింపింది. తన భాగస్వామ్య పక్షాలు ఇండిజెనస్ నేషనలిస్టు పార్టీ ఆఫ్ త్రిపుర (ఐఎన్‌పీటీ)కి 11 స్థానాలు, పీపుల్స్ డెమొక్రటిక్ సోషియలిస్టు (పీడీఎస్)కు 2 స్థానాలను కాంగ్రెస్ కేటాయించింది. అప్పటికే ప్రత్యేక త్రిపుర ల్యాండ్ కోసం డిమాండ్ చేస్తున్న వేర్పాటువాద పార్టీ ఐఎన్‌పీటీతో పొత్తుపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ తీవ్ర విమర్శలు చేశారు. 'అపవిత్రమైన కూటమి'గా అభివర్ణించారు. 'నేటి ఎన్నికల ప్రచారం చూస్తే.. 2008 ఎన్నికల నాటి పరిస్థితులు నాకు గుర్తుకొచ్చాయి. అప్పుడు ఢిల్లీ నుంచి వచ్చిన ప్రతిపక్ష పెద్దలు లేవనెత్తిన దాదాపు అవే అంశాలను ఇప్పటి ఢిల్లీ పెద్దలూ లేవనెత్తారు. ఒకే ఒక్క తేడా ఉంది. లెఫ్ట్ ప్రభుత్వంపై అప్పుడు కాంగ్రెస్ విమర్శలు చేస్తే.., అదే గళాన్ని ఇప్పుడు బీజేపీ ఎత్తుకుంది. జెండాలు మారాయి.. నాయకులు మారారు... అంతే' నని దాస్ గుర్తు చేసుకున్నారు.





మోడీ, అమిత్‌షావీ అవే వాగ్దానాలు...

2008లో కాంగ్రెస్ 47 మంది అభ్యర్థులను బరిలోకి దింపితే.. 2018లో బీజేపీ 51 మందిని రంగంలోకి దింపింది. గత వారం రోజులుగా జరుగుతున్న ప్రచారంలో చాలా సారూప్యతలున్నాయి. సోనియా గాంధీ ఆరో పే కమిషన్ సిఫారసులను అమలుచేస్తానన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్నదనీ... తాము అధికారంలోకి వస్తే ఉద్యోగ కల్పనపై దృష్టిసారిస్తానని ఆమె చెప్పారు. మరి ఇప్పుడు.. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, బీజేపీ జాతీయ అధ్యక్షులు అమిత్ షా ఇద్దరూ ఏడో పే కమిషన్ సిఫారసులను అమలుచేస్తామని ఉద్యోగులకు హామీ ఇచ్చారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ త్రిపురలో విడుదల చేసిన విజన్ డాక్యుమెంటులో కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించారు. విమర్శల్లోనూ అదే సారూప్యత కనిపిస్తున్నది. లెఫ్ట్ పాలనలో నేరాలు పెరిగాయనీ, 'మహిళలపై అత్యధిక నేరాల రేటు, 'అత్యధిక నిరుద్యోగిత రేటు' త్రిపురలో నమోదైందని విమర్శలు చేశారు.

కాంగ్రెస్ జాతీయ నాయకత్వం 2008లో రాష్ట్ర నాయకత్వానికి పూర్తి మద్దతు ఇచ్చినప్పటికీ.. 2003 ఎన్నికలలో గెలిచిన స్థానాలను కూడా 2008లో కాంగ్రెస్ నిలబెట్టుకోలేకపోయింది. కాంగ్రెస్ బలం 13 నుంచి.. 10కి పడిపోయింది. ఐఎన్‌పీటీ 6 నుంచి 1 కి దిగజారింది. సీపీఐ(ఎం) బలం మరింత పెరిగింది. ఎర్రజెండాకు 38 స్థానాలుండగా.. అవి 46కు పెరిగాయి. లెఫ్ట్ భాగస్వామ్య పార్టీలైన సీపీఐ, ఆర్ఎస్‌పీ గెలుపొందిన స్థానాలతో కలిసి వామపక్ష కూటమి బలం 49కి చేరింది.



2008 రిపీట్ అవుతుందా?

'2008లో కాంగ్రెస్ ప్రచారానికీ, 2018లో బీజేపీ ప్రచారానికి మధ్య స్వల్ప తేడా ఉంది. 2008లోనూ కాంగ్రెస్ అగ్ర నాయకత్వం రంగంలోకి దిగినప్పటికీ.. సూక్ష్మ స్థాయిలో, ప్రణాళికాబద్ధంగా ప్రచారం నిర్వహించలేదు. కానీ, బీజేపీ ఇప్పుడు ఆ పని చేస్తున్నది. ఇప్పుడు జరుగుతున్నది ఒక సైద్ధాంతిక పోరాటం... అని మాత్రం మర్చిపోకూడదు' అని సీనియర్ జర్నలిస్ట్ జయంతి భట్టాచార్య అన్నారు. 'సీపీఐ(ఎం)ను ఓడించేందుకు... ఒకప్పుడు కాంగ్రెస్‌లో ఉన్నవారే... ఇప్పుడు బీజేపీతో ఉన్నారు' అని భట్టాచార్య చెప్పారు. చిన్న గిరిజన పార్టీలతోపాటు.. రాష్ట్రంలోని గిరిజన ఓట్లను పదిలపరుచుకున్న జాతీయ పార్టీ ఏదైనా ఉందీ.. అంటే అది సీపీఐ(ఎం) ఒక్కటే. 2013లో అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్టీలకు రిజర్వు చేసిన 20 స్థానాల్లో 19 స్థానాల్లో లెఫ్ట్ కూటమి ఘన విజయం సాధించింది.

'2013 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఒక్క స్థానంలో కూడా విజయం సాధించలేదు. టీటీఏడీసీ ప్రాంతాలు సహ రాష్ట్రంలో కింది స్థాయి నుంచి వేళ్లూనుకుని, స్థిరపడి వున్న లెఫ్ట్ పార్టీని తుడిచిపెట్టాలనుకోవడం భ్రమే. త్రిపుర గిరిజన ప్రాంతాల్లో వామపక్షాలు ఆవిర్భవించాయి. అక్కడి నాయకత్వం ఇప్పటికీ గిరిజనుల చేతుల్లోనే ఉంది. ఇది ఒక వైవిధ్యంతో కూడుకుని ఉన్నది' అన త్రిపుర విశ్వవిద్యాలయంలోని పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ ఒకరు చెప్పారు.

కాంగ్రెస్ ఓట్లన్నీ తమకే పడతాయని బీజేపీ ఆశిస్తున్నది. 2008లో కాంగ్రెస్ ప్రచారానికీ, 2018లో బీజేపీ ప్రచారంపై తేడాలున్నాయని, ఇప్పుడు తాము క్రింది స్థాయిలో బలం పెంచుకున్నామని బీజేపీ చెబుతున్నది. దీనిపై కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రయోత్ దేవ్ బర్మన్ మాట్లాడుతూ... '2008లో ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ చేస్తున్న ఐఎన్‌పీటీతో పొత్తు పెట్టుకోవడంవల్లే మేం ఓడిపాయం. బీజేపీ ఇప్పుడు అదే తప్పు చేసింది. వేర్పాటువాద పార్టీతో పొత్తు పెట్టుకుని ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌కు బీజేపీ మద్దతిచ్చింది. రాష్ట్ర విభజనకు ప్రజలు సిద్ధంగా లేరు. అంటే.. బీజేపీ విజయానికి దూరమైనట్టే..' అని ప్రయోత్ దేవ్ బర్మన్ అన్నారు.

బీజేపీ అవకాశవాద, అనైతిక పొత్తుపై సీపీఐ(ఎం) పదే పదే ఎండగడుతూనే ఉన్నది. గతేడాది జులైలో ప్రత్యేక రాష్ట్రం డిమాండ్ చేస్తూ ఐపీఎఫ్‌టీ చేసిన ఆందోళన రాష్ట్రంలో సాధారణ జీవితంపై తీవ్ర ప్రభావం చూపింది. ఈ సందర్భంగా బెంగాలీల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో ఐపీఎఫ్‌టీ హింసాత్మక చర్యలకు కూడా పాల్పడింది.

ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌ను ప్రస్తావించకుండానే బీజేపీ, ఏపీఎఫ్‌టీ సంయుక్తంగా డిక్లరేషన్‌ను విడుదల చేశాయి. దీనిపై ఐపీఎఫ్‌టీ అధ్యక్షులు ఎన్‌సి దేవ్ బర్మ మాట్లాడుతూ... 'దీనర్థం మేం మా డిమాండ్‌ను వదిలిపెట్టినట్టు కాదు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని... ఇది తాత్కాలిక ఏర్పాటు మాత్రమే'నని ఆయన చెప్పారు.

సీపీఐ(ఎం) అధికారంలోకి వచ్చాకే రాష్ట్రంలో శాంతి నెలకొంది. రాత్రివేళల్లో కూడా అగర్తల వీధుల్లో ప్రజలు భయం లేకుండా తిరగగలుతున్నారు. గిరిజనుల డిమాండ్లను, మెజార్టీ ప్రజల భావాలను బీజేపీ విస్మరిస్తుందన్న విషయం త్రిపుర ప్రజలకు తెలుసు. అందుకే ప్రజలు మరోసారి లెఫ్ట్‌కే పట్టం కడతారు' అని త్రిపురలో ఒక ప్రముఖ దినపత్రిక సీనియర్ జర్నలిస్టు ఒకరు చెప్పారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, మోడీ, బాబు

- జలవిహార్‌లో కేక్ కట్ చేసిన కవిత



కేక్ కట్ చేస్తున్న కవిత, చిత్రంలో టీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్ 65వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన అభిమానులు, గులాబీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా శనివారం వైభవంగా నిర్వహించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు టీఆర్ఎస్ పార్టీశ్రేణులు పెద్ద ఎత్తున భారీ కేకులు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు తదితరులు కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో నిండు జీవితం గడపాలని రాష్ట్రపతి ఫోన్ చేశారు. ప్రధాని ట్వీట్ చేశారు. ఇంకా గవర్నర్లు ఇఎస్ఎల్ నరసింహన్, విద్యాసాగరరావు, సత్యపాల్ మాలిక్, ఛత్తీస్‌గఢ్ సిఎం రమణ్‌సింగ్ సిఎల్‌పి నేత జానా రెడ్డి, ఎంపి జ్యోతిరాదిత్య సింధియా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వారందరికీ కేసీఆర్ హృదయపూర్వక కతజ్ఞతలు తెలిపినట్టు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రగతి భవన్‌లో మంత్రులు ఈటల రాజేందర్, తలసాని శ్రీనివాసయాదవ్, పోచారం శ్రీనివాసరెడ్డి, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎంపీలు కేశవరావు, బాల్క సుమన్, చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్, ప్రభుత్వ సలహాదారుడు రాజీవ్ శర్మ, మాజీ డీజీపీ అనురాగ్‌శర్మ, నటుడు ఆర్ నారాయణమూర్తి, సినీ నటుల సంఘం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

హైదరాబాద్‌లోని జలవిహార్‌లో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఎంపీ కవిత కట్ చేశారు. రక్తదాన శిబిరాన్ని కవితతో పాటు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, పద్మారావుగౌడ్, బొంతు రామ్మోహన్, అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్సీలు శంబీపూర్ రాజు, మైనంపల్లి హన్మంతరావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మెన్ డాక్టర్ ఆయాచితం శ్రీధర్, గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ రాజయ్య యాదవ్ పాల్గొన్నారు. కాచం సత్యనారాయణగుప్త ఆధ్వర్యంలో భారీగా వేడుకలు జరిపారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్–2018 సభ నిర్వహించిన అనంతరం మేయర్ బొంతు రామ్మోహన్ కేక్ కట్ చేశారు. తెలంగాణ భవన్‌లో టీఆర్ఎస్ విద్యార్థి, యువజన విభాగాలు సంయుక్తంగా జన్మదిన వేడుకలు నిర్వహించాయి. ఈ వేడుకలకు కవితతో పాటు శంబీపూర్ రాజు, ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, టిఆర్ఎస్‌వి అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజీవ్ సాగర్ పాల్గొన్నారు.

కేటీఆర్, కవిత ట్వీట్

హ్యాపీ బర్త్‌డే నాన్న అంటూ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. 'వీరాధి వీరుడు అతడు, విజయానికి బావుట అతడు, ఆవేశపు విప్లవతత్వ, ఆలోచన శిఖరంబతడు.' అంటూ ఓ చిన్న కవితను కేటీఆర్ తన ట్విట్టర్ ఖాతాలో పోస్టు చేశారు. హ్యాపీ బర్త్‌డే డియర్ ఫాదర్ అంటూ కవిత ట్వీట్ చేశారు. మీ అనుచరురాలిగా ఉండటం గర్వకారణమని, మీ కూతురుగా పుట్టడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రతి ఒక్కరూ ఆశీర్వదిస్తున్నారని కవిత అన్నారు. పేదల దీవెనల కారణంగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామన్నారు. వారి ముఖాల్లో చిరునవ్వు చూడాలన్నదే కేసీఆర్ ఆశయమన్నారు.



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు చెబుతున్న శంభీపూర్ రాజు

కేసీఆర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ–దుండిగల్

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల భారీ కేక్‌లను కట్ చేసి సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ భవన్‌లో నిజామాబాద్ ఎంపీ కవిత సమక్షంలో భారీ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎంపీపీ సన్న కవితలు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో శంభీపూర్ రాజు రక్తదానం చేశారు.

ముఖ్యమంత్రిని కలిసిన కృష్ణయాదవ్ దంపతులు



హైదరాబాద్: కేసీఆర్ జన్మదినం సందర్భంగా.. హైదరాబాద్ నగర గెజిటెడ్ ఆఫీసర్స్ అధ్యక్షుడు ఎం.బి.కృష్ణయాదవ్, ఆలిండియా యాదవ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు ఎం.బి.దుర్గాకృష్ణయాదవ్ కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలి: చాడ

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి.. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను డిమాండ్ చేశారు. అప్పుల్లో కూరుకుపోయిన రైతులను ఆదుకోవాలంటూ రెండేండ్ల క్రితమే శాసనసభ ఏకగ్రీవ తీర్మానం చేసిం దని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా వ్యవసాయ రుణ విమోచన కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఒకప్రకటనలో కోరారు. మద్దతు ధరల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రైతులు మరింతగా ఉద్యమిస్తారన్నారు.

ప్రయివేటు విద్యాసంస్థల సమస్యలు పరిష్కరించాలి

- ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మెన్‌కు పీడీఎస్‌యూ వినతి



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ప్రయివేటు విద్యాసంస్థల జేఏసీ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ప్రొగ్రెసివ్ డెమొక్రటివ్ స్టూడెంట్స్ యూనియన్ (పీడీఎస్‌యూ) డిమాండ్ చేసింది. శనివారం హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ ఆర్ లింబాద్రిని పీడీఎస్‌యూ అధ్యక్షులు ఎం పరశురాం, నాయకులు రియాజ్, నాగరాజు, నవీన్ కలిసి వినతిపత్రం సమర్పించారు. తెలంగాణలో పది లక్షల మంది విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రయివేటు విద్యాసంస్థలకు ఆస్తి పన్ను, విద్యుత్ చార్జీల్లో రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టింపులకు పోకుండా వెంటనే యాజమాన్యాలను చర్చలకు పిలిచి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. విద్యార్థులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎన్‌టీఎస్‌ఈ ఫలితాలలో శ్రీచైతన్య విజయకేతనం

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వాధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన 2017–ఎన్‌టీఎస్‌ఈ (నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్) స్టేజీ–1 పరీక్ష ఫలితాలలో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. స్టేట్ ఫస్ట్ ర్యాంకు నుంచి 10 వరకు మొత్తం 20 ర్యాంకులను కైవసం చేసుకున్నారని శ్రీ చైతన్య స్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ సీమ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడేండ్లుగా శ్రీచైతన్య విద్యార్థులు ఎన్‌టీఎస్‌ఈలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నారని తెలిపారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులకు, అధ్యాపక బృందానికి, తల్లిదండ్రులకు శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్. బి.యస్. రావు అభినందనలు తెలియజేశారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ, రీసెర్చ్ ఓరియంటెడ్ టీచింగ్ మెథడాలజీ, టెక్నో, సి–బ్యాచ్, సి–ఐపియల్, మెడికాన్, యంపిఎల్ వంటి పటిష్టమైన అకడమిక్ ప్రోగ్రామ్స్ వల్ల మాత్రమే ఈ విజయాలు సాధిస్తున్నామని ఆయన తెలిపారు.

ఎన్‌ఎండీసీకి మైనింగ్ టుడే 2018 అవార్డు

హైదరాబాద్: రెండో ప్రతిష్టాత్మక ఎగ్జిబిషన్ స్టాల్ పురస్కారమైన మైనింగ్ టుడే–2018 అవార్డును నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎండీసీ) కైవసం చేసుకున్నది. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జరిగిన ఇంటర్నేషనల్ మైనింగ్ కాన్ఫరెన్స్: విజన్ 2040 కార్యక్రమంలో ఈ అవార్డును రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి జగదీశ్ రెడ్డి చేతుల మీదుగా సంస్థ డైరెక్టర్(టెక్నికల్) డాక్టర్ నరేంద్ర కె నందా శుక్రవారం అందుకొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీశాఖ మంత్రి జోగు రామన్న పాల్గొన్నారు. మైనింగ్ రంగంలో చోటుచేసుకున్న అభివృద్ధిని, ఎదుర్కొన్న సమస్యలను మైనింగ్ టెక్నాలజీ పై జరిగిన టెక్నికల్ సెషన్‌లో నరేంద్ర కె నందా వివరించారు. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం మైనింగ్ రంగంలో మరిన్ని కొత్త ప్రయోగాలు, పరిశోధనలు చేయాల్సిన అవసరమున్నదని తెలిపారు. ఆగస్టులో ఎన్‌ఎండీసీ నిర్వహించే ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌కు సాంకేతిక నిపుణులు హాజరవ్వాలని కోరారు. ఈ కాన్ఫరెన్స్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు www.nmdcminmetal.comలో అందుబాటులో ఉంచామన్నారు.

'ఇందిరమ్మ' ఇండ్లకు సర్కారు కోత!

- యూనిట్ ధర ఎంతున్నా...రూ 70 వేలే

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిదంటూ వాటికి బకాయిలు చెల్లించకుండా టీఆర్ఎస్ ప్రభుత్వం కాలయాపన చేసింది. అక్కడక్కడ ఇండ్లు పూర్తి చేసుకున్న వారి బకాయిలలో సర్కారు ఇప్పుడేమో కోత పెట్టింది. ఇంటి నిర్మాణ దశలను బట్టి లబ్దిదారులకు బకాయిలు చెల్లిస్తారు. ప్రస్తుతానికి ఇందిరమ్మ ఇండ్లకు ఆన్‌లైన్లో పేమెంట్లు చేస్తోంది. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల్లో ఎస్సీలకు లక్ష రూపాయలు, ఎస్టీలకు లక్షా ఐదువేలు, ఇతరులకు రూ 70 వేలు ఉండేది. లబ్దిదారులు తమ ఆర్థిక స్థోమతను బట్టి ఇండ్లను నిర్మించుకునే వారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం యూనిట్ కాస్టుతో సంబంధం లేకుండా అందరికీ రూ 70 వేలు చెల్లించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం వల్ల ఎస్సీ, ఎస్టీలు నష్టపోతున్నారు. ప్రస్తుతం 2,8369 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు బకాయిలు చెల్లించాల్సి ఉందని అధికారులు తెలిపారు.

పాదయాత్ర వాయిదా : సీపీఎస్‌టీఈఏ

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభించబోయే పాదయాత్రను వాయిదా వేస్తున్నామని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం ప్రకటించింది. ఈ మేరకు సీపీఎస్‌టీఈఏ అధ్యక్షుడు దాముక కమలాకర్ శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు యాదగిరిగుట్ట నుంచి ప్రగతిభవన్ వరకు చేపట్టాల్సిన పాదయాత్రను వాయిదా వేస్తున్నామని చెప్పారు.

శనివారం నుంచి యాదగిరిగుట్టలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనందున భక్తులకు ఇబ్బందులు తలెత్తుతాయనే ఉద్దేశంతో పోలీసులు పాదయాత్రకు అనుమతిని నిరాకరించారని అన్నారు. అందుకే పాదయాత్రను వాయిదా వేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్‌టీఈఏ ప్రధాన కార్యదర్శి చీటి భూపతిరావు, నాయకులు గంగన్న, శ్రీనివాస్, వెంకట్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నింట్లోనూ రాష్ట్రం నెం.1

స్వచ్ఛతలో అగ్రస్థానంలో నిలపడానికి కృషి :

స్వచ్ఛసర్వేక్షణ్ అవగాహన సభలో హోంమంత్రి నాయిని

- కళాకారులతో కలిసి స్టెప్పులు



నవతెలంగాణ – హైదరాబాద్ సిటీబ్యూరో

రాష్ట్రం అన్నింటిలోనూ నెం.1గానే ఉందని, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగరాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్–2018లో భాగంగా హైదరాబాద్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఉప్పల్ అంతర్జాతీయ స్టేడియంలో మేయర్ బొంతు రామ్మోహన్ అధ్యక్షతన శనివారం చైతన్య కార్యక్రమం ఏర్పాటు చేశారు. 30 వేల మందికిపైగా మహిళలు, విద్యార్థులు, కాలనీ సంక్షేమ సంఘాల వారు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జబర్దస్త్ రచ్చ రవి హంగామా చేశారు. సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, సంగీత దర్శకులు ఆర్‌పీ పట్నాయక్, కవి, సీఎం ఓఎస్‌డీ దేశపతి శ్రీనివాస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా నాయిని, రచ్చ రవి, మేయర్ రామ్మోహన్ కళాకారులతో కలిసి స్టెప్పులేశారు. అనంతరం నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. నగరాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛ హైదరాబాద్‌లో భాగస్వాములు కావాలని కోరారు. 'మనం స్వచ్ఛంగా ఉంటేనే హైదరాబాద్ స్వచ్ఛంగా ఉంటుంది. పిల్లలంతా స్వచ్ఛతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి' అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యే ఎన్‌వీవీఎస్ ప్రభాకర్, ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, ఎంబీసీ చైర్మెన్ తాడూరు శ్రీనివాస్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఎంవీ.రెడ్డి పాల్గొన్నారు.

హోలిమేరికి బెస్ట్ ఎమర్జింగ్ ఇంజినీరింగ్ కాలేజీ అవార్డు



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

హోలిమేరీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌కు బెస్ట్ ఎమర్జింగ్ ఇంజినీరింగ్ కాలేజీ అవార్డు లభించింది. ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డును శనివారం కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి సత్యపాల్ చేతుల మీదుగా హోలిమేరీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ చైర్మెన్ అరిమండ వరప్రసాద్‌రెడ్డి స్వీకరించారు. ఉన్నత ప్రమాణాలతో వేలాది మంది విద్యార్థులను మేటి ఇంజినీర్లుగా తీర్చిదిద్దుతున్నామని వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. 2001లో ప్రారంభమైన ఈ కాలేజీ విద్యార్థులు దేశవిదేశాల్లో ప్రముఖ సంస్థల్లో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో వివిధ హోదాల్లో కొనసాగుతున్నారని తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అత్యాధునిక సౌకర్యాలు కాలేజీలో విద్యార్థులకు అందబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. న్యాక్ ఏ గ్రేడ్ సాధించామని, జేఎన్టీయూ హైదరాబాద్ పూర్తిస్థాయి అనుబంధ గుర్తింపుతో విద్యార్థులకు సేవలందిస్తున్నామని తెలిపారు.

ఫీజు సమస్యను పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎం నాగేశ్వరరావు, కార్యదర్శి కోట రమేష్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ వస్తే విద్యార్థుల సమస్యలు పరిష్కారమవుతాయని అందరూ ఆశించారని తెలిపారు. కానీ తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. రాష్ట్రంలో యాజమాన్యాలు ఎన్నిసార్లు పరీక్షలు బహిష్కరిస్తామని హెచ్చరిస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధుల జీతాలు పెంచడంపై చూపుతున్న శ్రద్ధ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన విద్యార్థుల భవిష్యత్‌పై ఎందుకు లేదని తెలిపారు.

ఫీజు చెల్లించడమే ప్రభుత్వానికి భారమా?అని పేర్కొన్నారు. పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదని తెలిపారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ఎందుకు విడుదల చేయడం లేదని పేర్కొన్నారు. గొప్పలు చెపుతున్న ప్రభుత్వం విద్యారంగాన్ని బాగు చేయకుండా బంగారు తెలంగాణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే ప్రయివేటు కాలేజీ యాజమాన్యాలను పిలిచి మాట్లాడాలని, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని వర్గాల వారినీ కలుపుకొని కేసీఆర్ ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఐసీడీఎస్ పరిరక్షణే ఎజెండాగా..

నేటి నుంచి అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ద్వితీయ మహాసభ

- నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాట్లు
- హాజరుకానున్న జాతీయ, రాష్ట్ర నాయకులు



నవతెలంగాణ–నిజామాబాద్ ప్రతినిధి

తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ద్వితీయ మహాసభకు నిజామాబాద్ నగరం ముస్తాబైంది. ఆదివారం నుంచి రెండు రోజులపాటు రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో మహాసభ జరగనుంది. అంగన్‌వాడీలకు అండగా.. ఐసీడీఎస్ పరిరక్షణే ఎజెండాగా సాగనున్న మహాసభకు తొలిరోజు అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆల్ ఇండియా సెక్రెటరీ సింధు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు, రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ హాజరు కానున్నారు. ఆదివాకం బహిరంగ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు భారీగా తరలిరావాలని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.జయలక్ష్మి పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలపై సీఐటీయూ అలుపెరగని పోరు సలుపుతోంది. రాబోయే రోజుల్లో ఇదే ఒరవడి కొనసాగించేలా అంగన్‌వాడీల హక్కులు సాధించుకునేలా మహాసభలో భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నారు.

ముస్తాబైన రాజీవ్‌గాంధీ ఆడిటోరియం..

మహాసభకు జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియం బహిరంగ సభకు ముస్తాబైంది. ఆదివారం నిజామాబాద్ కలెక్టరేట్ నుంచి భారీ ర్యాలీ ఉంటుంది. మరుసటి రోజు ప్రతినిధుల సభ అక్కడే కొనసాగనుంది. అందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు వివరించారు.

ఆర్టిజన్స్‌కు ఇంక్రిమెంట్ ఇవ్వకపోవడం అన్యాయం

- టీఎస్ యూఈఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.కిరణ్



నవతెలంగాణ–పాల్వంచ

రాష్ట్రంలో విద్యుత్ కాంతులు, రైతులకు 24 గంటలూ కరెంటు అందివ్వడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆర్టిజన్స్ కార్మికులకు ప్రభుత్వం స్పెషల్ ఇంక్రిమెంట్ ప్రకటించకపోవడం అన్యాయమని తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.కిరణ్ అన్నారు. భద్రాద్రి జిల్లా పాల్వంచలోని కేటీపీఎస్‌లోని యూఈఈయూ కార్యాలయంలో టీఎస్ ట్రాన్స్‌కో సెంట్రల్ బ్రేక్‌డౌన్ గ్యాంగ్ కార్మికులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కిరణ్‌మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో ఏండ్ల తరబడి ఆర్టిజన్స్ కార్మికులు పని చేస్తున్నారని చెప్పారు. 24 గంటలు కరెంటు ఇవ్వడంలో ఆ కార్మికుల కృషి ఎంతో ఉందన్నారు. కానీ ప్రభుత్వం, యాజమాన్యం ప్రకటించిన జీవో ఎంఎస్ 35లో విద్యుత్ సంస్థల్లో ఉద్యోగులుగా ఉన్నవారికే వర్తించే విధంగా స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి ఇచ్చిన జీవోను సవరించి విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న అందరికీ ఇంక్రిమెంట్ వర్తించేలా మళ్లీ జీవో ఇవ్వాలని, లేనిపక్షంలో తమ సంఘం ఆధ్వర్యంలో ఆర్టిజన్స్ అందరినీ ఐక్యం చేసి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి గూడేపూరి రాజు, ట్రాన్స్‌కో సీబీడీ గ్యాంగ్ కార్మికులు కొండల్, వెంకన్న, శ్రీను, నగేష్, వెంకటేశ్వర్లు, రామారావు, రాములు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఏదీ తనంతట తానే తమ దగ్గరకు రాదు.
శోధించి సాధించాలి - శ్రీశ్రీ

సంపాదకీయం


ఉత్తమకళ

కళాప్రియత్వం మనిషి జీవితంలో అంతర్భాగం. స్వయంగా సృష్టించలేకున్నా కళల్ని ఆరాధించడం, అభిమానించడం సహజలక్షణం. అనేకరకాల కళల మనుగడకు మనుషుల్లోని కళాభిరుచినే మూలం. వారిలో విభిన్న భావోద్వేగాలని తట్టిలేపడం కళల స్వభావం. మనిషి అంతరంగ ప్రపంచాన్ని కదిపి కుదపడం అరవైనాలుగు కళల నైజం. ఆదిమ కాలం నుంచి కళాసృజన, వికాసం కొత్తపుంతలు తొక్కుతూ వస్తోంది. అనేక కళల్ని తనలో ఇముడ్చుకున్న సినిమా ఒక్కటే జనాకర్షక కళగా ప్రసిద్ధి చెందినప్పటికీ ఇతర కళలు లుప్తం కాలేదు. నిజానికి అనేకానేక కళల సమాహారమే సినిమా. సాహిత్యం, చిత్రకళ, శిల్పకళ, సంగీతం, నాటకం వంటి ప్రక్రియల్లేకుండా సినిమా కళ వర్ధిల్లే అవకాశం లేదు.

మానవీయ భావనల్ని మేల్కొల్పుతూ సృజనాత్మక జీవితానికి ఆలంబనం కావడం కళల లక్ష్యం. ఈ దిశగా అనుపమాన కౌశలంతో ప్రదర్శితమయ్యేదే ఉత్తమకళ. అనుకరణ, అనుసరణ ఎప్పటికీ కళగా గుర్తింపునొందవు. కాపీ చేయడమే కళగా భావించే దుర్బలత్వం సృజన లేమికి తార్కాణం.

సినిమానే కాదు ఏ కళ అయినా మనిషి అంతర్లోకాల్ని ఉద్దీపింపజేయాలి. కళ కళ కోసం కాదు, ప్రజల కోసమన్న మాట అందరికీ ఆమోదనీయమైన సత్యం. అయినప్పటికీ లాభాపేక్ష కళని మింగేస్తున్న వైనం విభిన్న రంగాల్లో వికృత పోకడలకు దారితీస్తున్నది. ఈ కారణంగానే అత్యుత్తమ కళా ప్రదర్శన పరమ లక్ష్యం ఏమిటన్నది ప్రశ్నార్థకం. ఎవరికోసం? ఎందుకోసం? ఎవరి పక్షం? అనే ప్రశ్నలు కీలకం. ఈ నేపథ్యంలోనే ఏది ఉత్తమ కళ అన్న మాట నిరంతరం చర్చల్లో తారసిల్లుతున్నది.

బహుళ జనాదరణ ఒక్కటే ఉత్తమకళకు ప్రాతిపదిక కాదు. జనాలకు తమ కళ ద్వారా ఏం చెబుతున్నారన్నదే ప్రధానం. తక్షణ ఆనందమే కాదు, దీర్ఘకాలికంగా మనిషిపై ఆ కళ చూపే ప్రభావం చర్చానీయాంశం. అలాగే కళకీ, సాంకేతిక ప్రజ్ఞకీ మధ్యన గల సన్నటి విభజనరేఖల్ని గమనించాలి. కళాప్రదర్శనకి సాంకేతిక ప్రజ్ఞ తోడు కావచ్చేమోగానీ దానంతటదే కళ కాదు. గ్రాఫిక్స్‌తో ఎన్నో ప్రయోగాలు చేయొచ్చు. కానీ గ్రాఫిక్ టెక్నిక్స్‌ని కళగా అంగీకరించడం కుదరదు. కళాకారుని ఊహాశాలిత, భావ శబలత వ్యక్తీకరణకి గ్రాఫిక్స్ తోడ్పడుతాయి. అంతే తప్ప వాటంతటవే కళగా విరాజిల్లవు. దీన్ని దృష్టిలో పెట్టుకుంటే గ్రాఫిక్స్ మాయాజాలమే కళగా అపోహ పడరు.



కాలం గడుస్తున్న కొద్దీ కళావిష్కరణల సాధనాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. కళా వికాసానికి వాటిని ఉపయోగించుకోడం అవసరమే గానీ కళాధర్మం అవిస్మరణీయం. భావోద్వేగాల్ని నిర్దేశించే శక్తి గల కళ ప్రయోజనం మనిషిని మంచి వైపు నడిపించటం, చెడును ప్రతిఘటించే శక్తిని అందించటం. దీన్ని దృష్టిలో పెట్టుకున్నప్పుడే కళాకారుని కల్పనాశక్తి సవ్యమైన దిశలో ప్రయాణిస్తుంది. కనుకనే కళాకారులకు కళల పర్యవసానం, ప్రయోజనం పట్ల స్పష్టత అవసరం.

సాధారణంగా అత్యున్నత ప్రతిభను ప్రదర్శించడంపైనే కళాకారులు శ్రద్ధాసక్తులు చూపుతారు. కానీ దాని ప్రభావం, ప్రయోజనం గురించి అంతగా ఆలోచించరు. విలక్షణమైన కళాకౌశలం మాత్రమే ఉత్తమకళకు ప్రామాణికం కాదు. అది మానవుల్లో ఉదాత్తభావనల్ని మేల్కొలపాలి, హృదయ సంస్కారానికి తావుని ఇవ్వాలి. అప్పుడే అది ఉత్తమకళగా వర్ధిల్లుతుంది. పూర్వం ఆనందమే కళకు పరమావధి. ఆధ్యాత్మిక సాధనకు తోడ్పడటమే దాని పరమార్థం. వర్తమాన సమాజంలో కళల అర్థం, లక్ష్యం చెమటోడ్చే మనుషుల పక్షాన నిలబడటం. చిత్రకళ, సంగీతం, రంగస్థలం, సినిమా కళ ఏదైనా సరే శ్రమైక జీవన సౌందర్యం శిరోధార్యమవ్వాలి. శ్రమని గుర్తించి, గౌరవించి, సత్కరించే సంస్కారాన్ని ప్రదర్శించాలి. ఈ దిశగా ప్రయాణించే కళనే ఉత్తమకళగా రాణిస్తుంది. ఈ దృక్పథంతో సృజించిన కళనే నాలుగు కాలాలు నిలబడుతుంది. 'కళ కోసమే కళ కాదని, కళ బతుకును ప్రజలేనని' ప్రజానాట్యమండలి ఉద్యమకారుడు డాక్టర్ గరికపాటి రాజారావు చెప్పిన మాటలు ఎప్పటికీ చెరగని వాస్తవం. చిత్తప్రసాద్ బొమ్మలే ఇందుకు సాక్ష్యం. తెలంగాణ సాయుధపోరాట ఘట్టాలను తన చిత్రకళా ప్రతిభతో సృజించారాయన. ఆ బొమ్మల్ని చూస్తే గొప్ప ఉత్తేజం కలుగుతుంది. అలాగే పికాసో చిత్రించిన 'గుయెర్నికా'ని చూస్తే పెట్టుబడిదారీ వ్యవస్థని ప్రతిఘటించిన స్ఫూర్తి తలపుకొస్తుంది. ప్రపంచీకరణ క్రమాన చిత్రకళ వ్యాపారమైంది. అంతమాత్రాన ఖరీదైన చిత్రమే ఉత్తమ చిత్రరాజం కాజాలదు. ఈ కారణంగానే 'గుయెర్నికా'ని మించిన ఉదాత్త కళాఖండం మరొకటి ఇప్పటివరకు రాలేదు. సినిమాకళలో సాంకేతిక నైపుణ్యం ఎంతగా విస్తరించినా, చార్లీచాప్లిన్ 'మోడర్న్‌టైమ్స్' వంటి అత్యుత్తమ సందేశాత్మక సినిమాలు అరుదు.

మానవీయ భావనల్ని మేల్కొల్పుతూ సృజనాత్మక జీవితానికి ఆలంబనం కావడం కళల లక్ష్యం. ఈ దిశగా అనుపమాన కౌశలంతో ప్రదర్శితమయ్యేదే ఉత్తమకళ. అనుకరణ, అనుసరణ ఎప్పటికీ కళగా గుర్తింపునొందవు. కాపీ చేయడమే కళగా భావించే దుర్బలత్వం సృజన లేమికి తార్కాణం. ఈ కారణంగానే 'ఉత్తమ' చిత్రంగానో కళగానో పేర్కొనే చాలా సినిమాలు పేలవ ప్రదర్శనలుగా మిగిలిపోతున్నాయి. వీటి రసహీనత 'ఉత్తమ కళ' అనే మాటలోని అంతస్సారాన్ని హరిస్తుంది. ఈ స్థితిని అధిగమించడం నిజమైన కళ వికసించి విస్తరించినప్పుడే సాధ్యం. 'ప్రజా జీవితమే ఒక గని' అన్నాడు మావో. ఆ గనిలోంచి ముడివస్తువును తీసుకొని సానబట్టి అందించడం ద్వారానే అసలుసిసలు కళకు ఆస్కారముంటుంది. అదే ఉత్తమకళగా రూపొంది ప్రభావితశక్తిగా నిలుస్తుంది.

ఆస్తిలో రిజర్వేషన్ అనుభవించే వారికే అధికారమా?



ఎస్. వీరయ్య

మనువు మోజులో ఉన్నవారికి మహిమలే తప్ప మనుషుల బాధలు పట్టవు. యాగాలు, పుష్కరాలు, పుణ్యక్షేత్రాల గురించి మాట్లాడే పాలకులు పొట్టకోసం పనిచేసే పేదల గురించి పట్టించుకోరు. కుల వివక్ష, కుల దురహంకార దాడుల గురించీ, సమన్యాయం గురించీ మాట్లాడరు. తరతరాలుగా ఆస్తిమీద, అధికారం మీద రిజర్వేషన్ అనుభవిస్తున్నవారికి మనువాదం కాక మానవత్వం ఉంటుందా? మనిషితనం నచ్చుతుందా? మానవరక్తం రుచిమరిగిన మృగం పంజా విసురుతుందే తప్ప ప్రేమ పంచదు కదా! అందుకే బడుగుజనం మీద పాలకులు ప్రేమ ఒలకబోస్తున్నారంటేనే ఏదో మతలబు ఉన్నదని అనుమానించాలి. జనం గొర్రెలని పాలకుల నమ్మకం. తమనే గుడ్డిగా నమ్ముతారని వారి విశ్వాసం.

దోపిడీకి గురయ్యేవారందరినీ ఏకం చేయాలి. సామాజిక అణచివేతకు బలవుతున్న వారందరినీ కలిపి నడపాలి. ఇది ఊరూరా జరగాలి. ప్రతి బస్తీలో జరగాలి. ఊరూరా పొలికేక కావాలి. పోరాడితే విజయం తథ్యం. అది ప్రజాపోరాటం కావచ్చు.. ఎన్నికల పోరాటమూ కావచ్చు. కులవివక్ష వ్యతిరేక పోరాట ఫలితమే జస్టిస్ పున్నయ్య కమిషన్ కదా! ఈ పోరాటాల ఫలితమే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కూడా. రెండు గ్లాసుల విధానం మీద దేవాలయ ప్రవేశం కోసం పోరాడింది తెలంగాణ బహుజనం. ఇది బడుగుల గుండె చప్పుడు. ఇప్పుడిది రాజకీయంగా కూడా స్పందిస్తున్నది. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రూపంలో ముందుకొచ్చింది.

ప్రజల అమాయకత్వమే వారికి పెట్టుబడి. తెలివి వారి సొంతంగానే ఉండాలనీ, జనం అమాయకంగానే ఉండాలనీ వారు కోరుకుంటారు. ఆర్థిక దోపిడీకి, సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా ప్రజలు కదిలితే తట్టుకోలేరు. కదంతొక్కితే వారికి నిద్రపట్టదు. అందుకే బహుజనులు కండ్లు తెరిస్తే వారు బేజారు. శ్రమదోపిడీ, సామాజిక అణచివేతకు గురవుతున్న సకల జనులను జోకొట్టడం కోసం ఎత్తులు వేస్తారు. తమకు తామే ఆస్తి రిజర్వు చేసుకుని.. విద్యావకాశాలు, ఉద్యోగాలు, చట్టసభల్లో రిజర్వేషన్ల గురించి రోజూ మాట్లాడుతారు. ఆస్తిలో రిజర్వేషన్ తమ జన్మహక్కుగా భావిస్తారు. మిగిలిన రిజర్వేషన్లు బడుగు, బలహీన వర్గాలకు దయతో ఇస్తున్నట్టు, బిక్షమేస్తున్నట్టు మాట్లాడుతారు. ఆస్తి తమకే రిజర్వు కావటం 'అభివృద్ధి' అంటారు. మిగతా రిజర్వేషన్లు ఆటంకమంటారు. దేశంలోని పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి అవసరమైన నిధులు తొమ్మిదివేల కోట్లు. విజయ్‌మాల్యా ఎగ్గొట్టింది తొమ్మిదివేల కోట్లు. నీరవ్ మోడీ కొల్లగొట్టింది 11,400 కోట్లు. గిరిజనులూ, గ్రామీణ పేదలూ మంచినీటికోసం మైళ్ళ దూరం నడవాలి. గోల్ఫ్ కోర్టులకూ, గేటెడ్ కమ్యూనిటీలకూ నీరు వరదై పారాలి. ఇదీ ఆస్తిమీద వారి హక్కు ఫలితం.

వాడుకోవటమే...

ఒంటరి చేయటం.. వాడుకోవటంలో పాలకవర్గాలెప్పుడూ సిద్ధహస్తులే! ప్రేమ నటిస్తారు. జాలి కురిపిస్తారు. ఆస్తిహక్కు గురించి కూడా మాట్లాడతారు. కొంచెం వాటా పంచడానికి ఒప్పుకుంటారు. బడుగులందరికీ ఆస్తిలో హక్కు కల్పించి, రిజర్వేషన్ వదులుకునేందుకు మాత్రం చచ్చినా ఒప్పుకోరు. అందరికీ కాదుగానీ.. కొందరికి చేయూతనిస్తామంటారు. చిన్న చిన్న పరిశ్రమలో, కాంట్రాక్టులో చేసుకొమ్మంటారు. ఆస్తి అందరికీ దక్కితే ఆత్మగౌరవం. కొందరికే ఆశ చూపితే అవకాశవాదం. మొదటిది అందరినీ సమానంగా చూడటం. రెండవది వాడుకోవటం. బడుగు జీవులంతా అణిగి మణిగి ఉండాలనే కోరుకుంటుంది మనువాదం. అందుకే ఆత్మగౌరవాన్ని అంగీకరించరు.

ఆస్తి రిజర్వేషన్

ఆస్తిసంబంధాలలో అంతరాలు వారి హక్కుగా భావిస్తారు. అందుకే దానిని ప్రశ్నించడాన్ని సహించ జాలరు. ఆస్తిపరమైన అసమానతలు కొనసాగించటానికి నిచ్చెనమెట్ల కులవ్యవస్థ వారికి అందివచ్చిన అవకాశం. అందుకే దానిని కాపాడుతారు. అందుకు ఆస్తిమీద తమకున్న ఆధిపత్యం బాగా ఉపయోగపడుతున్నది. కులవివక్షను ప్రశ్నిస్తే పొలంలో పనికి రానీయరు. గ్రామాభివృద్ధి కమిటీలపేరుతో చెలాయిస్తున్న ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తే గ్రామబహిష్కరణ లేదా సాంఘిక బహిష్కరణ చేస్తారు. గ్రామాల్లో గానీ, బస్తీలలోగానీ బడుగుజనం అణిగిమణిగి ఉండేది ఆస్తిలేకనే. ఉపాధి కోసం ఆధిపత్యవాదుల మీద ఆధారపడవల్సి రావటం వల్లనే కదా! సరిగ్గా దీనినే అవకాశంగా తీసుకుని శ్రామికులను కులం పేరుతో విభజిస్తున్నారు. దళితులను ఒంటరిపాటు చేయగలుగుతున్నారు. భూమి మీద ఆధిపత్యం పోతే భూస్వామి కోరలు పీకినట్టే. కూలీలు శక్తిమంతులవుతారు. అందుకే కూలీలు కలవకుండా కులం అడ్డుగోడలను కాపాడుతున్నారు. శ్రామికులంతా ఏకమైతే పారిశ్రామికవేత్తల పట్టు సడలిపోతుంది. అందుకే కులం గోడలు వారికి కూడా అవసరమవుతున్నాయి. పాలకులు భూమి పంపకం గురించి మాట్లాడనిది ఇందుకే. ప్రతి దళిత కుటుంబానికీ మూడెకరాల సాగుభూమి పథకాన్ని కూడా అటకెక్కిస్తున్నది ఇందుకే. కులం గోడలు కూల్చేయాలనీ, ఆర్థిక దోపిడీకి, సామాజిక అణచివేతకు గురవుతున్న వారంతా బహుజనులేనన్న నినాదం సహజంగానే వీరికి గుబులు పుట్టిస్తున్నది. మనువాదం పేరుతో, దళితులు ఆస్తికలిగి ఉంటే శిక్షించాలన్నారు. దానిఫలితమే కదా ఇప్పుడు రిజర్వేషన్ల సమస్య! రిజర్వేషన్లు ఆస్తిమీద మాత్రమే ఉండాలనీ, అది తమకే ఉండాలనీ ఆధిపత్యవాదులు కోరుకుంటున్న ఫలితమే కదా ఈ సమస్య. రిజర్వేషన్ అంటేనే.. అది కొందరికే. ఆస్తిలో రిజర్వేషన్ మనువాదం. ఇది కొందరికే! రాజకీయ రిజర్వేషన్ ప్రజాస్వామ్యం. ఇదీ కొందరికే. ఏ రిజర్వేషన్ లేకపోవటం సమానత్వం. ఇది అందరికీ! ఆస్తిమీద రిజర్వేషన్‌ను బద్దలు కొట్టటంతో ప్రారంభం కావాలి. క్రమంగా ఇది ఏ రిజర్వేషన్ అవసరం లేని స్థితికి దారితీస్తుంది. ఆస్తిమీద ఆధిపత్యం వదులుకునేందుకు ఆధిపత్యవాదులు సిద్ధంగా లేరు. ఆస్తిమీద రిజర్వేషన్ కాపాడుకునేందుకు ఆధిపత్యవాదులు ఏం చేయడానికైనా సిద్ధమే. బహుజనులను విభజించేందుకూ, జుట్లు ముడేసేందుకూ కులమే వారి చేతిలో ఆయుధం. గతంలో రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమాలను ఉసిగొల్పేవారు. ఇప్పుడు అగ్రవర్ణాలు కూడా బీసీల జాబితాలో చేర్చాలని ఉద్యమాలు చేపడుతున్నారు. బీసీలను ఎంబీసీలుగా గుర్తించాలన్న డిమాండ్ కోసం రెచ్చగొడుతున్నారు.

అడుక్కుంటే వస్తుందా?

బహుజనులకు అన్నీ సమస్యలే. ఇప్పుడు ఆకలి సమస్యా? ఆత్మగౌరవ సమస్యా? ఇదొక మీమాంస.

సమాలోచన

నిజానికి రెండూ సమస్యలే. అడుక్కునే స్థితిలో ఉన్నంతకాలం ఆత్మగౌరవం సాధ్యం కాదు. హక్కుగా పొందినప్పుడే ఆత్మగౌరవం. అడుక్కుంటే వచ్చేది హక్కుకాదు. అది పోరాడితే వస్తుంది. అడుక్కుంటే



బిచ్చమేయడానికి ఆధిపత్యవాదులు సిద్ధమే... కాంగ్రెసు, బీజేపీ, టీడీపీ, టీఆర్ఎస్ వంటి పార్టీల నేతలు చేస్తున్నది అదే. ఇది భూస్వామ్యతత్వం. రాజులు అగ్రహారాలు దానం చేసినట్టు... భూస్వామి దానధర్మాలు చేసినట్టు.. వీరూ కొంతమందికి కొన్ని సౌకర్యాలు లేదా అవకాశాలూ విదిలిస్తారు. అడుక్కునే వారి చేయి ఎప్పుడూ కిందనే ఉంటుంది. పోరాడేవారి శక్తి సమ ఉజ్జీగా ఉంటుంది. సంపద అందరిదీ.. ఉత్పత్తిలో అందరూ భాగస్వాములు కావాలి. కులం పేరుతో కూర్చుని తినే అవకాశం ఉండవద్దు. వర్గంపేరుతో దోచుకుతినే అవకాశమూ ఉండకూడదు. ఇదే ఇప్పుడు ప్రజలకు కావల్సిన ప్రత్యామ్నాయం. బహుజనులేకమైతే ఈ ప్రత్యామ్నాయం కోరుకుంటారన్నదే ఆధిపత్యవాదుల భయం. అందుకే బహుజన లెఫ్ట్ ఫ్రంట్ అంటే గిట్టదు.

పుట్టుకతో నిర్ణయించాలా?

అగ్రకులాల సహకారం లేకుండా అధికారం సాధ్యమా? అంటారు కొందరు. నిజమే! కులం కొనసాగాలనుకుంటే.. కులవ్యవస్థ కొనసాగాలనుకుంటే.. అది అక్షరాలా నిజమే. కుల విభజన వల్ల లాభపడే రాజకీయ శక్తులకు అది అవసరమే. ఇప్పుడు కులం కావల్సింది ఆధిపత్య శక్తులకే. కులం అవరోధంగా ఉన్నది బహుజనులకు. అందుకే.. ఆర్థిక దోపిడీకి గురవుతున్న వారంతా... సామాజిక అణచివేతకు బలవుతున్న వారంతా బహుజనులే. వీరి పోరాటానికి అండగా నిలిచేవారంతా వీరి మిత్రులే. అందువల్లనే కులవివక్ష అన్నా, సమన్యాయం అన్నా ఆధిపత్యవాదులు ఆగ్రహిస్తారు. పుట్టుకతో కుల నిర్ధారణ కావాలంటారు. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో దళితులను ఒంటరి చేయచూస్తారు. తమ కాళ్ళకు తామే బంధాలు వేసుకుని ఒంటరిపాలయ్యేటంత అమాయకంగా బహుజనులిప్పుడు లేరు. అంబేద్కర్ నాయకత్వంలో మనుస్మృతిని తగులబెట్టిన బృందంలో ప్రముఖ బ్రాహ్మణ కుటుంబీకుడు కూడా ఉన్న విషయం వీరికి తెలుసు. పూలే కృషిలో తోడుగా నిలిచిన బ్రాహ్మణ కుటుంబీకుల గురించి వీరికి తెలుసు. "మంచి అన్నది మాల అయితే మాల నేనౌదున్" అన్న గురజాడ గురించి కూడా వీరికి బాగా తెలుసు. స్వాతంత్ర్యానికి పూర్వమే, మాదిగ సంఘానికి అధ్యక్షుడుగా పనిచేసిన తెలంగాణ సాహిత్యకారుడు సురవరం ప్రతాపరెడ్డిని జనం మరిచిపోలేదు. చరిత్రను శ్రామికుల దృక్కోణం నుంచి తిరగ రాసిన వారిలోనూ, శ్రామికుల కోణం నుంచి తత్వశాస్త్రాన్ని అభివృద్ధి చేసిన వారిలోనూ బ్రాహ్మణ కుటుంబ నేపథ్యం ఉన్న ప్రముఖులున్నారు.

భూమికోసం.. భుక్తికోసం.. వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో జైలుగోడల మధ్య నినదించిన దాశరథి కృష్ణమాచార్య గానీ, తుపాకీ చేతబట్టి తిరగబడ్డ దాశరథి రంగాచార్య గానీ బ్రాహ్మణ కుటుంబీకులే! బ్రాహ్మణ, వైశ్య, రెడ్డి, కమ్మ తదితర తేడాలు మరిచి నాటి పోరాటంతో మమేకమైన వారెందరో! అందుకే పుట్టుకతో నిమిత్తం లేకుండా.. ఆర్థిక దోపిడీ, సామాజిక అణచివేతలకు గురవుతున్న వారంతా బహుజనులే. అంతే కాదు.. దళిత కుటుంబంలో పుట్టినంత మాత్రాన శ్రామికుల పక్షమే కావాలని కూడా ఏమీలేదు. దళితుడుగా పుట్టిన కోవింద్ మనుధర్మానికి తలొగ్గి, బీజేపీ అభ్యర్థిగా గెలిచి, ఇప్పుడు రాష్ట్రపతిగా ఉన్నారు. దళితుల గురించి నీతులు చెప్పి బీజేపీ పంచన చేరిన ఉదిత్ రాజ్‌లూ ఉన్నారు. దళితులుగా పుట్టి ఆరెస్సెస్ కోసం పనిచేస్తున్నవారికి బహుజనుల పక్కన స్థానం సాధ్యమా? ఎవరు మిత్రులో.. ఎవరు కాదో పసిగట్టలేనంత అమాయకులు కాదు బహుజనులు. అందుకే ఆర్థిక దోపిడీకి గురయ్యేవారందరినీ ఏకం చేయాలి. సామాజిక అణచివేతకు బలవుతున్న వారందరినీ కలిపి నడపాలి. ఇది ఊరూరా జరగాలి. ప్రతి బస్తీలో జరగాలి. ఊరూరా పొలికేక కావాలి. పోరాడితే విజయం తథ్యం. అది ప్రజాపోరాటం కావచ్చు.. ఎన్నికల పోరాటమూ కావచ్చు. కులవివక్ష వ్యతిరేక పోరాట ఫలితమే జస్టిస్ పున్నయ్య కమిషన్ కదా! ఈ పోరాటాల ఫలితమే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కూడా. రెండు గ్లాసుల విధానం మీద దేవాలయ ప్రవేశం కోసం పోరాడింది తెలంగాణ బహుజనం. ఇది బడుగుల గుండె చప్పుడు. ఇప్పుడిది రాజకీయంగా కూడా స్పందిస్తున్నది. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రూపంలో ముందుకొచ్చింది. ■

పకోడి కొల్వు



తెలిదేవర భానుమూర్తి

నారదుడు కొప్పేసుకుండు. తంబూరు దీస్కుండు. ఒకపారి టింగ్ టింగ్ మన్నడు. చిర్తలు దీస్కుండు. ఒకపారి గవ్వెటిని కొట్టి జూస్కుండు. గీపారి యాడికిబోవాలె. యాడికి బోతె బాగుంటదని జెరసేపు గాయిన సోంచాయించిండు. యాడికో ఎందుకు ఎప్పటితీర్గ యాద్గిరి గుట్టకే బోతె బాగుంటదని గాయిన అనుకున్నడు. అనుకోని గుట్ట దిక్కు రాబట్టిండు. నడ్మల నర్కం దిక్కు బోతున్న దున్నపోతు గాయినను గల్సింది.

"యాడికి బోతున్నవు నారదా" అని దున్నపోతు అడిగింది.

"యాద్గిరి గుట్టకు బోతున్న" అని నారదుడు అన్నడు.

"గుట్టకు ఎందుకు బోతున్నవు." అని దున్నపోతు అడిగింది.

"నర్సిమ్మసామితోని ముచ్చటబెట్టె తందుకు" అని నారదుడు అన్నడు.

"గాయినతోని ముచ్చటబెడ్తె ఏమొస్తది?" అని దున్నపోతు అడిగింది.

"గాయినతోని ముచ్చటబెడ్తె దేసంల ఏమైతున్నదో ఎర్కైతది" అని నారదుడు అన్నడు.

"గీయింత దాన్కి గుట్టకు బోవుడు ఎందుకు?" అని దున్నపోతు అన్నది.

"గుట్టకు బోకుంటె దేసంల ఏమైతున్నదో ఎట్ల ఎర్కైతది?" అని నారదుడు అడిగిండు.

"దేసంల ఏమైతున్నదో నేను జెప్త గద" అని దున్నపోతు అన్నది.

"నీకెట్ల ఎర్క?" అని నారదుడు అడిగిండు.

"నెల దినాల సంది నేను బారతదేసంలనే ఉన్న" అని దున్నపోతు అన్నది

"ఎందుకున్నవు?" అని నారదుడు అడిగిండు.

"మా దున్నపోతుల మీటింగ్లు అయితుంటె నేను వొచ్చిన" అని దున్నపోతు అన్నది.


"గట్లయితె దేసంల ఏమైతున్నదో జెర జెప్పు" అని నారదుడు అన్నడు.

"గీనడ్మ పకోడిల గురించి బైస్ అయితున్నది" అని దున్నపోతు అన్నది.

"ఎందుకైతున్నది?" అని నారదుడు అడిగిండు.

"గీనడ్మ ప్రతాని మోదీ ఒక చానల్ల మాట్లాడుకుంట ఏం జెయ్యకుంట ఊకునుడు కంటె పకోడీలు ఏస్కుంట బత్కుడు మంచిదని అన్నడు. గంతే గాకుంట పకోడిలు ఎట్ల జెయ్యాల్నో జెప్పిండు. ముందుగాల చెన్గె పిండి, లేకుంటె లంక పిండి దీస్కోమన్నడు. గా పిండిల నీల్లు బోసి గల్పుమన్నడు. ఉల్లిగడ్డలు దీస్కోని తుక్డతుక్డలు కొయ్యిమన్నడు. గా ఉల్లిగడ్డ తుక్డలను పిండిల గల్పుమన్నడు. అటెంకల పొయ్యిమీద మూకుడు బెట్టి గా దాంట్ల నూనె బొయ్యిమన్నడు. నూనె గరం అయినంక చెన్గె పిండిని చిన్న ముద్దలు ముద్దలు జెయ్యిమన్నడు. గా ముద్దలను నూనెల ఏసి గోలిస్తె పకోడిలు తయ్యారైతయని ప్రతాని జెప్పిండు." అని దున్నపోతు అన్నది.

"ప్రతానికి చాయ్ జేసుడే గాకుంట పకోడిలు గూడ జెయ్యొస్తయన్న మాట" అని నారదుడు



చిత్రమైన చాలోత్రా

అన్నడు.

"దేసంల సద్వుకున్న పోరగాల్లకు కొల్వులు లేకుంట తిర్గుతున్న పోరగాల్లకు పిరీగ పకోడిలు ఎట్ల జెయ్యాల్నో నేర్పిస్తరట. ఎవ్వలి పిండి, ఎవ్వలి ఉల్లిగడ్డలు, ఎవ్వలి నూనె గాల్లే దెచ్చుకోవాలంట. పకోడిల ట్రేనింగ్ సెంటర్లు బెట్ట రంట. గివ్విట్ల షరీక్ జేస్కునే ముంగట పరీచ్చలు బెట్టరు. గా పరీచ్చల పాసైనోల్లకే ట్రేనింగ్ సెంటర్ల సీటు ఇస్తరు. సీట్లు దొర్కిన పోరగాల్లకే పకోడిలు జేసుడు నేర్పిస్తరు. ఉల్లి గడ్డ పకోడిలే గాకుంట పల్లి పకోడిలు, కాజు పకోడిలు ఎట్ల జెయ్యాల్నో జెప్తరు. పకోడి పరీచ్చల పాసైనోల్లకు సర్టిపికేట్లు ఇస్తరు. పకోడిల దుక్నాలు బెట్టుకునే తందుకు అప్పులు గూడ ఇస్తరు. పకోడిలను పారిన్ దేసాలకు గూడ పంపిస్తరట. పకోడిలతోని బగ్గ ఆమ్దాని వొచ్చెటట్లు జూస్తరట. రామ్‌రాజ్ యాత్రల పకోడిలను బంచుతరట. ఇంటర్ సద్వినోల్లు ఉల్లిగడ్డ పకోడిలు జేస్తె డిగ్రి సద్వినోల్లు కాజు పకోడిలు జేస్తరట. పకోడిలు అమ్ముడంటె కొల్వు జేస్తున్నట్లే నంట" అని దున్నపోతు అన్నది.

"బీదోల్లు పకోడిలు అమ్ముకుంట బత్కాల్నా? అని చిదంబరం అడిగిండట గదా" అని నారదుడు అన్నడు.

"అవ్. అడిగిండు. కొల్వు లేకుంట బేకార్గ తిర్గుడు కంటె పకోడిలు అమ్ముకుంట బత్కుడే మంచిది. కొల్వులు లేకుంట ఉన్నోల్లు బిచ్చగాల్లసుంటోల్లు అని అంటున్నరు. కొల్వులు లేకుంట ఉండుడు కంటె పకోడిలు అమ్ముకుంట బత్కుడు మంచిది. పకోడిలు అమ్ముడు సిగ్గుపడే విషయం గాదు. చాయ్‌వాలా ప్రతాన మంత్రి అయ్యిండు. పకోడివాలా గూడ ప్రతాని అయినా అయితడు అని అమిత్ షా అన్నడు. బిజెపి సర్కార్ కోటి కొల్వులు ఇస్తనని జెప్పింది, కొల్వులు లేనోల్లకు కొల్వులు ఇయ్యశాత గాక గిప్పుడు పకోడిలు ఏస్కోని బత్కుమంటున్నది అని గులాబ్ నబీ అజాద్ అన్నడు. గిట్ల పకోడిల మీద బైస్ అయ్యింది. కొంతమంది కొల్వులు లేనోల్లు నిజంగనే పకోడిలు ఏసి అమ్మింద్రు. ఇడ్లిలు, దోసెల తీర్గ అందరు పకోడిలు తినాలని జెప్పింద్రు. పకోడిలే గాకుంట బుబ్దాలు, బజ్జీలు గూడ ఎయ్యాలని అన్నరు. ఒక్క పకోడిలు ఏస్తెనే పడ్తల్ బడదని బుబ్దాలు, బజ్జీలు గూడ ఏస్తెనే పడ్తల్ బడ్తదని జెప్పింద్రు. మెల్లగ కొంత మంది పకోడి కార్కానలను గూడ బెట్టింద్రు. గీ కార్కానల పకోడిలను ప్యాక్ జెయ్యబట్టింద్రు. పాక్ జేసిన పకోడిలను బజార్ల అమ్మబట్టింద్రు. గా పాకిట్ల మీద పకోడిలు జేసిన తారీక్ గూడ రాయబట్టింద్రు. నర్కం బోయేడ్డి ఉన్నది మల్ల గలుస్త" అన్కుంట దున్నపోతు నర్కం దిక్కు బోయింది. నారాయన, నారాయన అన్కుంట నారదుడు వైకుంటం బోయిండు.

తోక... పొద్దు మీకింది. ఎప్పటితీర్గ చౌరస్తల ఉన్న పాన్ డబ్బకాడ్కి బోయిన, గాడ పాన్లు దినుకుంట మా దోస్తులు ముచ్చటబెడ్తున్నరు.

"దినాం గంటసేపు హన్‌మాన్‌చాలీసా సద్వితె పంటలు మంచిగ బండుతయి. వడగల్ల వాన పడినా పంటలకు ఏంగాదు అని రమేష్ సక్సేనా అనేటి బిజెపి లీడర్ అన్నడు" అని యాద్గిరి జెప్పిండు.

"యాడనన్న మంత్రాలకు చింతకాయలు రాల్తయా?" అని సత్నారి అడిగిండు.

సెల్: 9959150491

రిపోర్టర్స్ డైరీ

వర్మ...ట్విటర్ ఎగిరెగిరి...!

సామాజిక మాధ్యమాలలో పేస్‌బుక్, ట్విటర్, వాట్సాప్ బాగా ప్రాచుర్యం పొందాయి. ముఖ్యంగా సెలబ్రెటీలు, రాజకీయ నాయకులు వీటిద్వారా ఎంతో ప్రచారం పొందుతున్నారు. అయితే కొంత మంది కొన్ని ముఖ్యమైన అంశాలపై వాటిని ఉపయోగిస్తే... సొంత ఇమేజ్ పెంచుకోవడానికి మరికొంతమంది వీటిని ఉపయోగిస్తున్నారు. ఎక్కువ ప్రచారం పొందుతూ నిత్యం వార్తల్లో ఉండేందుకు తాపత్రయం పడుతున్నారు. ఇటువంటి వ్యక్తుల్లో దర్శకుడు రాంగోపాల్‌వర్మ (ఆర్‌జీవీ) ముందుంటారని చెప్పుకోవచ్చు. అయిందానికి, కానిదానికి ఫేస్‌బుక్, ట్విటర్‌లో పోస్టులు పెట్టి ఉచిత ప్రచారం పొందేందుకు ప్రయత్నం చేస్తున్నారు. సినిమా ప్రమోషన్స్ కోసమైతే లెక్కేలేదు. ఏదో ఒక టీజర్‌ను రిలీజ్ చేయడం, లేక కామెంట్ చేయడం పాపులారిటీ సంపాదిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నది. కానీ కొన్నిసార్లు తమ చేష్టలు రివర్స్ అవుతుంటాయని వర్మ నిరూపించాడు. ఆయన ట్విటర్ ఎగిరెగిరి... చివరకు పోలీస్‌స్టేషన్‌కు చేరింది. తనకు సంబంధం లేని వాటిపై స్పందించడం, తలతిక్క సమాధానాలు చెప్పడం, మహిళలపై అడ్డగోలుగా కామెంట్లు చేయడంతో అడ్డంగా దొరికిపోయారు వర్మ. అందరికీ ప్రశ్నలు సంధించే వర్మ... ఇవాళ సీసీఎస్ పోలీసుల వేసిన ప్రశ్నలకు ఉక్కిరిబిక్కిరయ్యారు. ప్రశ్నలు వేయడమే కాదు సమాధానాలు తెలిసుండాలన్నంతగా ప్రశ్నల వర్షాన్ని ఎదుర్కొన్నారు. ఇంతకు చెప్పొచ్చేదేమంటే... అనవసరంగా అన్నింటిలో తలదూర్చితే వర్మకు పట్టిన గతే... ఎవరికైనా పడుతుంది.

- గుడిగ రఘు

విచిత్ర కాశీ మజిలీ కథలు..

ప్రస్తుతం తెలంగాణ సచివాలయంలోని ఆఫీసర్లంతా బిజీబిజీగా ఉన్నారు. మార్చిలో రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగబోతుండటమే వారి బిజీకి కారణం. ఈ క్రమంలో బడ్జెట్ రూపకల్పనలో తలమునకలై ఉన్న ఓ సూపరింటెండెంట్ స్థాయి అధికారిని సమాచార నిమిత్తం ఇటీవల కొందరు విలేకరులు కలిశారు. మాటల మధ్యలో ఓ ఉన్నతాధికారి ప్రస్తావన వచ్చింది. 'ఆయన చాలా మంచివారండీ.. ఎప్పుడూ చిరునవ్వుతో మాట్లాడతారు. విసుక్కోకుండా సహనంతో, ఓపిగ్గా వివరాలు చెబుతారు.. నిజంగా ఆయనలాంటి ఆఫీసరు రాష్ట్రానికి అవసరం...' అంటూ ఓ జర్నలిస్టు స్తుతించారు. మన విలేకరి స్తోత్రం పూర్తికాగానే.. ఎదురుగా ఉన్న సూపరింటెండెంట్ గట్టిగా పగలబడి నవ్వారు. దీంతో ఉక్రోశం పొడుచుకొచ్చిన పాత్రికేయ మిత్రుడు.. 'ఏంటి సార్.. నేను అన్న మాటల్లో ఏమైనా తప్పుందా..?' అని గద్దింపు స్వరంతో ప్రశ్నించాడు. దానికా సూపరింటెండెంట్ నవ్వాపుకుని నింపాదిగా.. 'దూరపు కొండలు నునుపన్నట్టు మీరు కండ్లతో చూసిందే నిజమనుకుంటున్నారు. ఆయన అసలు స్వరూపం మాకు తెలుసు. నువ్వు చెప్పిన ఆ పెద్ద మనిషి.. గవర్నమెంట్ జాబును, అందునా ఐఏఎస్ ఉద్యోగాన్ని వదిలి డబ్బుకోసం ఓ ప్రయివేటు కంపెనీలో పదేండ్లపాటు పనిచేశాడు. ఆ కంపెనీలో పని చేసినన్నాళ్లు కోట్లు గడించాడు. ఆ తర్వాత కంపెనీ దివాళా తీయబోతున్నదనే వార్త తెలిసి.. మళ్లీ ఢిల్లీ స్థాయిలో పైరవీలు చేసి.. ఆలిండియా సర్వీసులోకి వచ్చి చేరాడు. అదీ ఆయన కథ. మీలాంటోళ్లు వినటానికి సిద్ధంగా ఉంటే.. ఆయన మస్తు కథలు.. అందునా విచిత్ర కాశీ మజిలీ కథలు ఎన్నో చెబుతాడు...' అంటూ అసలు విషయాన్ని బయటపెట్టేసరికి జర్నలిస్టులు నోరెళ్లబెట్టారు. నిజమేమరి.. ఒక కాంట్రాక్టు ఉద్యోగో లేక నాలుగో తరగతి సిబ్బందో అనివార్య కారణాల వల్ల సెలవు పెడితే.. జీతంలో కోత విధించి నోటీసులిచ్చి నానా యాగీ చేసే మన పాలకులు.. పెద్దోళ్లకు మాత్రం ఎర్ర తివాచీ పరుస్తున్నారన్నమాట...

-బి.వి.యన్.పద్మరాజు

మంత్రిగార్కి కోపమొచ్చింది

కల్తీ పదార్థాలపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.లక్ష్మారెడ్డి గార్కి కోపమొచ్చింది. అలాంటి ఇలాంటి కోపం కాదు.. ఏకంగా షాపుల్లో తనిఖీలు చేసి వినియోగిస్తున్న పదార్థాలను అప్పటికప్పుడు వాటిని పరీక్షలకు పంపేంత వరకు. మన మంత్రి గారు శుక్రవారం హైదరాబాద్ నగరంలో పర్యటించారు. పలు హోటల్స్, టీ దుకాణాల వద్ద, ఐస్‌క్రీం బండ్ల వద్ద తనిఖీలు చేశారు. భారీ కాన్వాయ్‌తో వచ్చి మంత్రి గారు ఈ తనిఖీలు చేశారు. రాష్ట్ర మంత్రే రావడంతో వ్యాపారులు హడలిపోయారు. అంతేకాదు ఎప్పుడు రాని మంత్రి గారు రావడంతో ఉబ్బితబ్బయ్యారు. కుశల ప్రశ్నలు వేసి వాటికి సమాధానాలు రప్పించుకున్నారు. చివరికి వారి వద్ద ఉన్న పదార్థాలను శాంపిల్స్‌గా తీసుకుని అప్పటికప్పుడు పరీక్షలకు పంపించారు. అయితే పరీక్ష ఫలితాలు రావడానికి సమయం పడుతుందని, నకిలీవి అని తేలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో వారంతా బెదిరిపోయారు. ఇదంతా చూస్తున్న అక్కడ వారు ప్రభుత్వ గొప్పతనాన్ని మెచ్చుకున్నారట. ఈ విషయం అంతా మంత్రి కార్యాలయం నుంచే మీడియా కార్యాలయాలకు ప్రకటన రూపంలో వచ్చింది. ఇంత చేసి మంత్రిగారు చేసిన తనిఖీలు ఎక్కడంటే, రోడ్ల వెంబడి తక్కువ రేటుతో భోజనం పెడుతున్న చిన్న చిన్న హోటల్స్, టీ అమ్ముతున్న దుకాణాల వారిని, ఐస్‌క్రీమ్ విక్రయిస్తున్నవారిని కావడం విశేషం. అయితే వాస్తవానికి ఆ పదార్థాలు తిన్నవారు ఎప్పుడూ రోగాలపాలయినట్టు ఫిర్యాదులు వచ్చిన దాఖలాలు లేవు. నకిలీ పదార్థాలు తయారు చేసి బయట అమ్ముతున్న వారిని పట్టుకోకుండా, పొట్టకూటికోసం జీవనం సాగిస్తున్న చిన్న దుకాణాలపై ప్రతాపం చూపించడమేంటని అక్కడున్న వారు విస్తుపోయారు. పెద్ద పెద్ద హోటల్స్‌లో జరుగుతున్న బండారాన్ని బయటపెట్టకుండా, ఇలాంటివారిపై కన్నెరజేస్తే ఉపయోగమేంటో మంత్రిగారు సెలవిస్తే బాగుంటుంది.

- కె. ఆనందరాజు

కేసీఆర్ వీరుడు..ధీరుడు..

ముఖ్యమంత్రి కేసీఆర్ వీరుడు, ధీరుడు అంటూ ఆయన అభిమానులు, టీఆర్ఎస్‌పార్టీ కార్యకర్తలు, నేతలు అంటున్నారు. ఎలక్ట్రానిక్ చానల్స్‌లోనూ, పత్రికల్లోనూ ఇదే హెడ్డింగులు దర్శనమిచ్చాయి. పాటల రూపంలోనూ వచ్చాయి. ఆయన పుట్టినరోజు కావడంతో ఘనంగా వేడుకలు నిర్వహించారు. పుట్టినరోజును ఘనంగా జరపడంలో తప్పులేదు. తెలంగాణ తెచ్చినందుకు వీరుడు.. ధీరుడు అని అనవచ్చు. కానీ కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగినా ప్రజల తరపున తన నిరసనను తెలియజేయకుంటే, ఏ రకంగా వీరుడు అవుతారని చాలామందికి సందేహం వచ్చింది. ఢిల్లీలో వారం రోజులు ఉండి నోరెత్తని సీఎం, గవర్నర్ కలిసి కేంద్ర బడ్జెట్‌పై నిరసన తెలియజేశారని ఒక పత్రికలో రావడం విశేషం. అదేంటో ఆ ఒక్క పత్రికలోనే రావడమేంటని మిగతా జర్నలిస్టులు ఆశ్చర్యపోయారు. బహిరంగంగా చెప్పుకోవడానికి భయపడితే కేంద్రాన్ని ఎలా నిలదీస్తారని గుసగుసలు మొదలయ్యాయి.

- టి.సంజయ్‌కుమార్

కథ నచ్చితేనే..



కొత్త నటీనటులను తెరకు పరిచయం చేయడంతో పాటు.. కుటుంబమంతా కలిసిచూసే కథాచిత్రాలను తీస్తూ.. అరుదైన లోకేషన్స్‌ను తన సినిమాల ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేస్తున్న డైనమిక్ డైరెక్టర్ బి. జయ. తెలుగు చిత్రపరిశ్రమలో వేళ్లపై లెక్కించదగిన మంచి దర్శకుల్లో ఆమె ఒకరు. సినీరంగంలోని 24క్రాఫ్ట్స్‌పై పట్టుసాధించిన ఆమె కలం పట్టి జర్నలిస్టుగా సినీపరిశ్రమలో అడుగుపెట్టి.. ఆ తర్వాత మెగాఫోన్ అందుకుని కెప్టెన్ ఆఫ్ ది షిప్‌గా మారారు. మనుషుల మనస్తత్వాలను ఆసక్తికరంగా వెండితెరపై ఆవిష్కరిస్తూ.. ఆకట్టుకునే కథనంతో సినిమాని సృజనాత్మకం గా మలుస్తారు. 'చంటిగాడు' తో ప్రారంభమైన దర్శకత్వం 'లవ్‌లీ'గా ముందుకు సాగి 'వైశాఖం'గా అలరించి.. ఇప్పుడు 'లక్కీ ఫెలో' ను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆమె సినీరంగ ప్రస్థానం మానవితో..



ఎక్కువగా కొత్తవారితోనే సినిమా తీయడానికి ఇష్టపడతాను. కొత్తవారైతే వారిని కథకు తగ్గట్టుగా మోల్డ్ చేసుకోవచ్చు. ఆ తర్వాత వారు సినీరంగంలో మంచిపేరు తెచ్చుకుంటే పరిశ్రమలోకి ప్రతిభావంతులైన వారికి తీసుకువచ్చామని ఆనందంగా ఉంటుంది. కథపైనే ఎక్కువగా నేను డిపెండ్ అవుతాను. కథ బాగా నచ్చితేనే.. ఎంత రిస్క్ అయినా తీసుకోవడానికి సిద్ధపడతాను. నాపై నమ్మకంతో మా వారు ప్రముఖ నిర్మాత బి.రాజు నన్ను ఎంతో ప్రోత్సహిస్తారు.

ఇక నా గురించి చెప్పాలంటే.. మాది తూర్పు గోదావరి జిల్లాలోని రావులపాలెం. నాన్న నర్సింహరాజు, మెడికల్ రిప్రజెంటేటివ్. అమ్మ విమలాదేవి గృహిణి. నేను పశ్చిమ గోదావరి జిల్లా లోని మా అమ్మమ్మ ఊరు సిద్ధాంతంలో పుట్టి పెరిగాను. మేం ముగ్గురం ఆడపిల్లలం. నేనే పెద్ద. గోదావరి నదీతీరమే మా ఆట మైదానం. ఇసుకలో అలసిపోయేవరకు ఆడుకునేవాళ్లం. క్షత్రియ కుటుంబం కావడంతో బయటకు వెళ్లాలంటే చాలా ఆంక్షలు ఉండేవి. ఇద్దరు చెల్లెండ్లను పదవతరగతి వరకు మాత్రమే చదివించి పెళ్లిండ్లుచేసి అత్తవారింటికి పంపించారు. నేను మాత్రం పై చదువుల కోసం పట్టుపట్టాను. విజయవాడలో మాంటిస్సోరిలో పదవతరగతి వరకు చదివాను. ఇంటర్ అమలాపురంలోని ఎస్‌కెబిఆర్ కాలేజీలో, డిగ్రీ మద్రాసులోని ఎస్ఐఇటి ఉమెన్స్ కాలేజీలో పూర్తిచేశాను. ఆ తర్వాత చెన్నై విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. ఇంగ్లీష్ లిటరేచర్‌తో ఎం.ఎ, జర్నలిజంలో డిప్లొమా చేశాను. మనుషుల మనస్తత్వాలపై ఆసక్తితో అన్నామలై విశ్వవిద్యాలయంలో సైకాలజీలో ఎం.ఎ. చదివాను

తొమ్మిదోతరగతిలో అచ్చుయైన కథ..

చిన్నప్పటి నుంచి పుస్తకాలు బాగా చదివేదాన్ని. అలా చదువుతూ.. చదువుతూ ఉన్నప్పుడు నాకు ఏదైనా రాయలనిపించేది. నోట్‌బుక్‌లో నాకు తోచింది రాసుకునేదాన్ని. అలా రాసిన కథను నా స్నేహితుల ప్రోత్సాహంతో ఒక పత్రికకు పంపితే నా పేరు, స్కూల్‌పేరుతో సహా అచ్చువేశారు. అంతే ఇక స్కూల్‌లో ఫేమస్ అయ్యాను. ఉత్తరాలతో పాటు పదిరూపాయల పారితోషికం అందుకున్నాను. నా కవితల గురించి తోటి విద్యార్థులే కాదు.. టీచర్లు మెచ్చుకోవడం సంతోషాన్ని ఇచ్చింది. రైటర్‌ను కావాలని అప్పుడే అనుకున్నాను. కథతో పాటు కార్టూన్లు వేయడం నా హాబీగా మారింది. అలా వేసిన కార్టూన్స్ వివిధ దినపత్రికల్లో వచ్చాయి. వనిత కథల పోటీల్లో నేను రాసిన "అభ్యుదయం" కథ ఎంపికైంది. "యువ"లో వచ్చిన కథకు చక్రపాణి అవార్డు, "వనిత"లో ప్రచురితమైన "ఆనందోబ్రహ్మ"కథకు జాతీయ అవార్డు వచ్చాయి. ఈ కథను నేషనల్ బుక్ ట్రస్ట్ ఇతర భాషల్లోకి అనువదించి ప్రచురించారు. విప్లవ సాహిత్యం చదవడంతో స్వతంత్రంగా ఆలోచించడం, ప్రశ్నించడం బాగా అలవాటై.. కాలేజీ ఎన్నికల్లోనూ పాల్గొన్నాను.

నాన్సీపైడే రాసిన పుస్తకాలు..

డిగ్రీ చదువుతూనే జర్నలిజంలోనూ డిప్లామా పూర్తిచేశాను. ఆ తర్వాత ఎంఏ చదువుతున్నప్పుడే 'ఆంధ్రజ్యోతి'లో సబ్‌ఎడిటర్‌గా చేరాను. 'జ్యోతిచిత్ర' సినిమా అనుబంధంలో మూడేండ్లు పనిచేశాను.

ఒకవైపు సినీపరిశ్రమలో ప్రముఖల ఇంటర్వ్యూలు, మరోవైపు ఫెమినా, మిర్రర్, ఉమెన్ ఎరాలకు కథనాలు రాస్తూ.. బిజీగా ఉండేదాన్ని. ఏ మాత్రం ఖాళీ సమయం దొరికినా నాన్సీపైడే రాసిన పుస్తకాలు చదివేదాన్ని. జ్యోతిచిత్రలో పనిచేస్తున్నప్పుడే బి. రాజుగారితో పెండ్లి. ఆయన సూచనతో 'సూపర్‌హిట్' సినిమా పత్రికను ప్రారంభించి సక్సెస్ అయ్యాం. ఆ తర్వాత 'చంటిగాడు' సినిమా కోసం నేనే మెగాఫోన్ పట్టక తప్పలేదు. చిన్నప్పుడు నేను ఆడుకున్న గోదావరి తీరంలో తీసిన సన్నివేశాలతో వచ్చిన 'చంటిగాడు' వందరోజుల పండుగ కూడా పూర్తి చేసుకుంది.

డైరెక్షన్ ప్యాషన్‌గా..

నేను ప్రొఫెషనల్ డైరెక్టర్‌ను కాదు. ప్యాషన్‌తో సినిమా తీస్తున్నాను. నాకు నచ్చిన కథను వైవిధ్యంగా ప్రేక్షకుల ముందుకు తీసుకువెళ్లాలన్నదే నా ఆలోచన. అందుకే వెంటవెంటనే కాకుండా.. రిలాక్స్‌డ్‌గా సినిమాను తెరపైకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తాను. లవ్‌లీ సినిమా తర్వాత ఎక్కువ గ్యాప్ తీసుకుని.. దాదాపు ఏడాది పాటు వైశాఖం సినిమాను రూపొందించాం. సినిమా ఎంతో బాగా వచ్చింది. విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తెలుగు సినిమాల్లో పాటలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. నేను తీసే సినిమాల్లో లోకేషన్స్ కొత్తగా ఉండాలని కోరుకుంటాను. అందుకే లవ్‌లీ సినిమాలోని పాటలను టర్కీలోనూ.. వైశాఖం సినిమాలోని పాటలు ఖజకిస్తాన్‌లోనూ చిత్రీకరించాం. కొత్త నటీనటులను, కొత్త కథనే కాదు కొత్త ప్రదేశాన్ని చూశామన్న ఫీల్ ప్రేక్షకులకు కలగాలి. కొత్తదనం ఉన్నప్పుడే ప్రేక్షకులను ఆకట్టుకోవడం సాధ్యమవుతుంది.

సక్సెస్ ఒకశాతం మాత్రమే..

చిత్రపరిశ్రమలో మహిళా డైరెక్టర్లు తక్కువగా ఉన్నారు. ఎంతో మంది ఉన్నతచదువులు చదివిన వారు సినీపరిశ్రమవైపు వస్తున్నా వారిలో పరిశ్రమలో నిలబడుతున్నవారి సంఖ్య ఒక్కశాతమే. మహిళలుగా విజయవంతంగా పరిశ్రమలో నిలబడాలంటే సొంత నిర్మాణ సంస్థల ద్వారానే సాధ్యమవుతుంది. పరిశ్రమలో సక్సెస్ కన్నా ఫెయిల్యూర్ శాతమే ఎక్కువగా ఉంటుంది. ఫెయిల్యూర్‌కు భయపడకుండా నిలబడినప్పుడే సక్సెస్ సాధ్యమవుతుంది. ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలి. గెలుపోటములకు తట్టుకుని నిలబడాలి. అప్పుడే సక్సెస్ సాధ్యమవుతుంది.

వి.యశోద

క్లీనింగ్.. క్లీనింగ్...



ఒక గంటపాటు ఇంటిని శుభ్రం చేస్తే దాదాపు వంద క్యాలరీలు ఖర్చవుతాయట. ఇంటి శుభ్రత అంటే చాలా మంది భయపడిపోతారు. దాని కోసం ఒక రోజు కేటాయించాలని ఆందోళనపడతారు. దాని కోసం అంతగా భయపడాల్సిన పని లేదు. కొన్ని చిట్కాలను పాటిస్తే సరిపోతుంది.

- ఇల్లు తుడిచేటప్పుడు యాంటీ బ్యాక్టీరియల్ సొల్యూషన్ వాడుతున్నట్లైతే ఇలా చేయండి. ఒక బకెట్ నీటిలో రెండు చెంచాల యాంటీ బ్యాక్టీరియల్ సొల్యూషన్ వేసి అరగంట పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత నీటిని ఉపయోగిస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.
- ఇంట్లోకి వచ్చేటప్పుడు డోర్ మ్యాట్‌కు కాళ్లు తుడుచుకోని రావడం ద్వారా చాలా వరకు దుమ్ము, ధూళి ని ఇంట్లోకి చేరకుండా ఆరికట్టవచ్చు.
- వంటగదిలో ఉపయోగించే క్లాత్స్‌కు, సింక్ లో ఎక్కువ క్రిములు ఉంటాయి. కాబట్టి వాటిని తరచు శుభ్రపరుచుకోవడం ఆరోగ్యకరం.
- పాత మేకప్ బ్రష్‌లను, పాత టూత్ బ్రష్‌లను కిటికీ అంచులను శుభ్రపరచడానికి ఉపయోగించవచ్చు. వంటగది టైయిల్స్ మీద నూనె మరకలు ఉన్నట్లైతే గ్లాసు నీటిలో ఒక చెంచా నిమ్మరసం, చిటికెడు బేకింగ్ సోడా కలిపి టైయిల్స్ మీద చల్లాలి. ఇలా చల్లిన పది నిమిషాల తర్వాత బ్రష్‌తో రుద్దితే నూనె, జిడ్డు మరకలు పూర్తిగా తొలగిపోతాయి. ❄

బద్ధకానికి కారణాలు...



మార్పు సహజమైనటువంటి ప్రక్రియ. మన చుట్టూ ఉన్న ప్రపంచంలో ప్రతి క్షణం ఏదో ఒక మార్పు జరుగుతూ ఉంటుంది. అంతే కాదు మార్పు లేకపోతే జీవనం విధానం చాలా ఇబ్బందికరం. ఆహ్లాదకరంగా, సంతోషకరంగా ఉండాలంటే మార్పు తప్పని సరి!

పనులను వాయిదా వేసుకోవడం వల్ల ఒక రకమైన బద్ధకానికి గురవుతున్నారు. బద్ధకం కారణంగా ఎన్నో పనులు వాయిదా పడటం క్రమంగా తలనొప్పిగా మారడం సహజం. కాని, పనులను వాయిదా వేసుకోవడం వల్ల తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని మానసిక నిపుణులు చెబుతున్నారు. దీనికి ప్రధాన కారణం బద్ధకం. ఇది అన్నింటి కంటే భయకరమైన జబ్బు. ఈ రోజు చేసే పనిని రేపు చేద్దాం అని వాయిదా వేసుకునే వారు చివరికి ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు. దీని నుంచి బయపడాలంటే మన అలవాట్లను, బాధ్యతలను మార్చుకుంటూ ఉండాలి. దాంతో పాటు ఎప్పటి పని అప్పుడు చేయడం అనే ఒక కొత్త అలవాటును బాధ్యతగా స్వీకరించి అనుసరించాలి. పనులను వాయిదాలు వేయడానికి గల కారణాలు... 'ఫియర్ ఆఫ్ ఫెయిల్, వాయిదాలు వేయడం, సమయం వృథా చేయడం, ప్రతి దానికి ఏదో ఒక వంక చెప్పడం వంటివి. ఇవి ఒకరమైన భయకరమైన బద్ధకానికి దారి తీస్తాయి. జీవితం లో మార్పును కోరుకునే వారు పై కారణాలను సున్నితంగా తొలగించుకుంటే మార్పు దానంతట అదే వస్తుంది. ❄


పొరపాటున కూడా వాడొద్దు!



అందరిలో ప్రత్యేకంగా, ఆకర్షణీయంగా కనిపించాలని ఎవరికి మాత్రం కోరిక ఉండదు. అందు కోసం రకరకాల క్రీములను, ఫేస్ ప్యాక్‌లను వాడుతుంటారు. అయితే కొన్ని పదార్థాలను పొరపాటున కూడా ముఖానికి ఈ విధంగా రాసుకోకూడదు. అలా రాకుంటే మీ చర్మం త్వరగా పాడవుతుంది. ఏ విధంగా రాసుకోకూడదో... ఎలాంటి పదార్థాలను ఉపయోగించకూడదో తెలుసుకుందాం...

- బేకింగ్ సోడా ఆల్కలైన్ అనే రసాయనం ఉంటుంది. ఇది చర్మంలో సహజంగా ఏర్పడే పీ హెచ్ లెవల్స్ పాడుచేస్తుంది. ముఖ్యంగా సెన్సిటివ్ చర్మం ఉన్నవారు బేకింగ్ సోడాను అస్సలు వాడకూడదు. దాంతో పాటు బేకింగ్ సోడాలో యాంటీ సెప్టిక్ గుణాలు ఉంటాయి. అవి చర్మాన్ని కాపాడుతాయి. అయితే బేకింగ్ సోడాను ఉపయోగించే వారు ముందుగా చేతిపై అప్లై చేసుకొని ఎలాంటి ఇరిటేషన్, దురద, మంట లేకపోతే ముఖానికి అప్లై చేసుకోవాలి.
- బేకింగ్ సోడా చర్మంపై ఉండే మృత కణాలను, మురికి, జిడ్డు, నలుపు వంటి వాటిని తొలగిస్తుంది. కానీ ఇది అన్ని చర్మతత్వాల వారికి మంచిది.
- చాలామంది మొటిమలను తగ్గించుకోవడానికి టూత్ పేస్టును ఉపయోగిస్తారు. మరికొందరు చర్మంపై జిడ్డును తొలగించుకోవడానికి టూత్ పేస్టుతో వాష్ చేసుకుంటారు. ఇలా టూత్ పేస్టును వాడటం చర్మానికి అంత మంచిది కాదు. దీన్ని అప్లై చేయడం వల్ల చర్మరంధ్రాలు మూసుకుపోతాయి. దాంతోపాటు చర్మ సంబంధిత సమస్యలు అంటే మొటిమలు, ఎలర్జీ వచ్చే అవకాశం ఎక్కువ. మొటిమలను తగ్గించుకోవడానికి టూత్ పేస్టుకు బదులుగా ట్రీ ట్రీ ఆయిల్‌ను వాడితే మంచిది. ఇది మొటిమలను త్వరగా తగ్గిస్తుంది.
- కొంతమంది ముఖాన్ని తెల్లగా, అందంగా మార్చుకోవడానికి వెనిగర్‌ను ఉపయోగిస్తారు. వెనిగర్‌ను డైరెక్టుగా ఉపయోగించడం వల్ల చర్మం త్వరగా పాడవుతుంది. అలా కాకుండా ఉండాలంటే ఆపిల్ సైడర్ వెనిగర్‌లో కొద్దిగా నీటిని కలిపి ముఖానికి అప్లై చేసుకోవచ్చు.
- నిమ్మరసంలో పీ హెచ్, ఆసిడిక్ గుణాలు అధికంగా ఉంటాయి. చర్మాన్ని అందంగా మార్చుకోవడానికి నిమ్మరసం ఎంతగానో ఉపయోగపడుతుంది. కానీ నిమ్మరసాన్ని మోతాదుకు మించి వాడకూడదు. కేవలం నిమ్మరసాన్ని మాత్రమే చర్మానికి అప్లై చేయకూడదు. నిమ్మరసంలో కొద్దిగా నీటిని లేదా గులాబీ నీటిని కలిపి ముఖానికి ప్యాక్ వేసుకోవాలి. ❄







మనసు ముచ్చటపడక తప్పదు...

ప్రకృతి అందాలను చూస్తే ఎంత ముచ్చటేస్తుంది. కొన్నిసార్లు వాటిని వర్ణించడం కూడా కష్టమేమో అనిపిస్తుంది. ప్రకృతిలో లభించే చిన్నపుల్ల నుంచి మొదలు పెడితే పెద్ద పెద్ద వృక్షాల వరకు ఎన్నో అపురూపమైన వస్తువులను తయారు చేసుకోవచ్చు. ప్రకృతి చాటున దాచుకున్న అందాలను మనముందు విరబూస్తుయిన్నవి అగ్గిపుల్లలు. వాటితో ఎన్నో అబ్బురపరిచే బొమ్మలను, ఆకట్టుకునే వస్తువులను స్వయంగా చేసుకోవచ్చు... క్యాండిల్ పైకి నిచ్చెన వేయడం, పెద్ద పెద్ద వస్తువులను మోయడం, తల్లిదండ్రులు పిల్లలను ఆడించడం, సాయంత్రపూట సరదాగా సైకిల్ తొక్కడం, సంగీత వాయిద్యాలతో ఆడుకోవడం, వంతెన దాటడం, వానలో తడవకుండా అరటి ఆకును ఉపయోగించడం.. ఇవన్నీ కేవలం అగ్గిపుల్లతో తయారు చేసిన కళాకృతులు. ఇక అవి చేసే అందాలను చూస్తే మనసు ముచ్చటపడక తప్పదు. అలాంటి కొన్ని బొమ్మలు మీ కోసం...







యాదవరెడ్డి,నిషాంత్‌రెడ్డిల వద్ద కట్టా అక్రమాస్తుల చిట్టా

- వీరి విచారణలో మరి కొన్ని కోట్ల ఆస్తుల వివరాలు వెల్లడి
- సోమవారం ఏసీబీకి లొంగిపోనున్న శ్రీనివాస్‌రెడ్డి

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

అవినీతి తిమింగలం కట్టా పురుషోత్తంరెడ్డికి చెందిన మరిన్ని అక్రమాస్తుల వివరాలు ఇద్దరు బినామీల విచారణలో వెల్లడవుతున్నాయి. హెచ్‌ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి బినామీలైన రియల్ ఎస్టేట్ వ్యాపారులు యాదవరెడ్డి , నిషాంత్‌రెడ్డిలను శనివారం రెండవ రోజు కూడా ఏసీబీ అధికారులు విచారించారు. వీరి విచారణలో కొత్తగా కట్టాకు చెందిన రెండు విలువైన ఫ్లాట్‌లు కీసర రామగిరి వద్ద, మాదాపూర్‌లో ఉన్నట్టు ఏసీబీకి వెల్లడైందని తెలిసింది. వీటిని ఏ విధంగా కట్టా ఖరీదు చేశాడనే వివరాలను ఇద్దరు బినామీలు వెల్లడించారని తెలిసింది. కాగా మున్సిపల్ ఉద్యోగి అయిన యాదవరెడ్డి 1997లో వాలంట్రీ రిటైర్‌మెంట్ తీసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారానికి దిగాడని , అయితే ఇది కూడా కట్టాదేనని దర్యాప్తు అధికారులకు రూఢీ అయినట్టు తెలిసింది. విచారణలో రోజు రోజుకు కట్టా కొత్త ఆస్తుల చిట్టా వెలుగు చూస్తుండటంతో అక్రమాస్తుల విలువ వంద కోట్లకు పైనే ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు. కట్టా అక్రమాస్తులలో కీలక పాత్ర పోషిస్తున్న బావమరిది శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఏసీబీ ముందు లొంగిపోనున్నట్టు సమాచారం. అదే రోజు కట్టాను ఏసీబీకి కస్టడీకి ఇచ్చే విషయమై సంబంధిత కోర్టు నిర్ణయం తీసుకోనుంది. ఈ ఇద్దరిని కస్టడీలోకి తీసుకుని ఇప్పటి వరకు తెరువని ఇద్దరి ఇండ్లను సోదా చేయాలని నిర్ణయించిన అధికారులకు నిందితుల బ్యాంకు బ్యాలెన్సులు, బంగారు,వెండి నగలు, ఇతర విలువైన ఆస్తుల వివరాలు వెల్లడి కావచ్చని భావిస్తున్నారు. ముఖ్యంగా భారీ మొత్తంలో నగదు కూడా ఆయనింట్లో పట్టుబడే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. సీజ్ చేసిన వీరి ఇండ్ల వద్ద తమ కానిస్టేబుళ్లను అధికారులు కాపలాగా ఉంచారు.

విద్యార్థులకోసం వెళితే.... తరగతి గదుల్లో మేకలు

ఇంఫాల్: పాఠశాలల్లో సరిపడా విద్యార్థులున్నారని చెబుతూ, మధ్యాహ్న భోజన పథకం తాలూకూ నిధులు, పుస్తకాలు, యూనీఫారమ్స్ తీసుకుంటున్న విద్యాశాఖ.. ఆచరణలో మాత్రం తప్పుడు లెక్కలు చూపుతున్నది. మణిపూర్‌లోని ఓ స్కూల్‌ను తనిఖీ చేయడానికి వెళ్లిన మంత్రికి విచిత్రమైన పరిస్థితి ఎదురైంది. తరగతి గదుల్లో విద్యార్థులకు బదులు మేకలు దర్శనమివ్వడంతో మంత్రి ఖంగుతిన్నారు. ఈ ఘటన మణిపూర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... మణిపూర్ విద్యాశాఖ మంత్రి రాధేశ్యాం.. మయంగ్ ఇంఫాల్, వబంగీ నియోజకవర్గాల్లోని పాఠశాలల ఆకస్మిక తనిఖీకి వెళ్లారు. ఈ క్రమంలో ఖేలాఖంగ్‌లోని ఒక పాఠశాలకు వెళ్లగా, అక్కడ ఒక్క విద్యార్థి లేకపోగా, తరగతి గదుల్లో మేకలు దర్శనమిచ్చాయి. దీంతో ఖంగుతిన్న మంత్రి ఉపాధ్యాయుల కోసం ఆచూకీ తీయగా వారూ సొంత పనుల నిమిత్తం బయటకెళ్లారని స్థానికుల ద్వారా తెలిసింది. దీంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా వారిని సస్పెండ్ చేశారు. ఐదేండ్ల క్రితం ఈ స్కూళ్లో 200 మంది విద్యార్థులుండేవారని మంత్రి ముందు స్థానికులు వాపోయారు. దీనిపై రాదేశ్యాం స్పందిస్తూ.. స్కూళ్లల్లో విద్యార్థులు లేకపోవడం చాలా బాధాకరంగా ఉందన్నారు. కొన్ని పాఠశాలల భవనాలూ ఏమంత భద్రంగా లేవన్నారు. వాటి స్థానే కొత్త భవనాలను చేపట్టవలసిన అవసరమున్నదని ఆయన అన్నారు. మరో పాఠశాలకు వెళ్లిన ఆయనకు అదే పరిస్థితి ఎదురైంది. అక్కడ 72 మందికి గానూ కేవలం 16 మంది విద్యార్థులే ఉన్నారు. దీనిపై ప్రధానోపాధ్యాయులను సంప్రదించగా ఆయనతో పాటు మరో ఇద్దరు అధ్యాపకులు ఉంటారని చెప్పినా, పాఠశాల ఆవరణలో వారెవ్వరూ కనపడకపోడం గమనార్హం.

నిధులు సాధించకపోతే గాజులు, కుంకుమ పంపిస్తాం : పొన్నం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

టీఆర్‌ఎస్ ఎంపీలు కేంద్రంతో పోరాడి నిధులు సాధించకపోతే, వారికి తమ పార్టీ గాజులు, కుంకుమ పంపిస్తోందని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ తెలంగాణ నంబర్ వన్ రాష్ట్రం అని పొగుడుతుంటే తెలంగాణలో బీజేపీ రాష్ట్ర పార్టీ శాఖ ఎందుకని ప్రశ్నించారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో టీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల అనైతిక పొత్తు కొనసాగుతుందన్నారు. రైతుల ఆత్మహత్యలలో కూడా తెలంగాణ రాష్ట్రం నంబర్ వన్ అని చెప్పే ధైర్యం బీజేపీకి ఉందా? అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని నిధులు అడగని దద్దమ్మలు అని ప్రజలు చర్చించుకుంటున్నారని చెప్పారు. తెలంగాణ హక్కుల కోసం పోరాడకుండా కేసీఆర్ కూతురు కవిత పార్లమెంటులో జై ఆంధ్ర అని చెప్పడం వల్ల తెలంగాణఅమరవీరుల ఆత్మ క్షోభిస్తోందన్నారు. ఇది ఒక అసమర్థ ప్రభుత్వమన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి మత్తు వదలి బయటకు రావాలన్నారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి : పట్నం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఆస్తిపన్ను వసూళ్లు అతి తక్కువగా ఉన్నాయని, పన్ను బకాయిదార్లనే పేరుతో సామాన్య ప్రజలను సతాయిస్తూ, నోటీసు బోర్డుపైన, వెబ్‌సైట్లలో వారి పేర్లు ఎక్కించి అవమానపరచడాన్ని పట్నం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. మున్సిపాలిటీలకు వెంటనే ప్రభుత్వం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేసింది. ఈమేరకు శనివారం 'పట్నం' అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వేణుగోపాలరావు, డిజి నర్సింహారావు ఒక ప్రకటన విడుదల చేశారు. నగరాల్లో అధ్వాన్నంగా ఉన్న అంతర్గ రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీటి సరఫరా, పేరుకు పోతున్న చెత్త, స్వైరవిహారం చేస్తున్న పందులు, కుక్కలు, దోమలు వంటి పెద్ద మున్సిపాలిటీలో కమిషనర్‌తోసహా ఖాళీగా ఉన్న 184 పోస్టులు భర్తీ చేయాల్సి ఉందన్నారు. బిల్ కలెక్టర్లు లేక పన్ను వసూళ్ళు తక్కువగా వసూళ్ళు అవుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఆస్థిపన్ను రూ 361.76 కోట్లు వసూలు కావాల్సి ఉండగా, రూ 171.85లు మాత్రమే వసూలు అయ్యాయన్నారు. ఇంకా రూ 189.91 కోట్లు వసూలు కావాలని పేర్కొన్నారు. ఇందులో రూ 74.40 కోట్లు ప్రభుత్వ భవనాలపై స్థానిక సంస్థలకు ప్రభుత్వం చెల్లించాల్సిందేనన్నారు. ఈ లోపాలను సరిదిద్ది, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

యాదాద్రీశుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-యాదాద్రి

యాదాద్రీశుని బ్రహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ బ్రహ్మోత్సవాలు 11 రోజుల పాటు సాగుతాయి. విశ్వక్సేనుడికి తొలిపూజలు చేపట్టారు. జలంతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం బాలాలయం, కొండపై నలుదిక్కులా సంప్రోక్షణ చేపట్టారు. సాయంత్రం మత్సంగ్రహణం, అంకురార్పణ సంప్రదాయరీతిలో నిర్వహించారు. స్వామివారి వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా రాత్రి అంకురార్పణ వేదమంత్రాల మధ్య జరిగింది. పుట్టమట్టితో యాగశాలలో నవధాన్యాలు నాటే పర్వాన్ని నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కలెక్టర్ అనితారామచంద్రన్, జేసీ గుగులోతు రవినాయక్, రాచకొండ పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్, భువనగిరి జోన్ డీసీపీ రామచంద్రారెడ్డి, యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాసచార్యులు, భువనగిరి ఆర్డీవో భూపాల్‌రెడ్డి, వైటీడీఏ అధికారి సాయిరాం హాజరయ్యారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ధ్వజరోహణం, సాయంత్రం భేరిపూజ, దేవతాహ్వానం, హవనం నిర్వహించనున్నారు.

2553 జూనియర్ లైన్‌మెన్ పోస్టులకు నోటిఫికేషన్


నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర ఉత్తరప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎన్పీడీసీఎల్)లో ఖాళీగా ఉన్న 2,553 జూనియర్ లైన్‌మెన్ పోస్టులకు నోటిఫికేషన్‌ను ఆ సంస్థ సీఎమ్‌డీ అన్నమనేని గోపాలరావు శనివారం విడుదల చేశారు. ఈ పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి రెగ్యులర్ ప్రాతిపదికన దరఖాస్తులను కోరుతున్నట్టు తెలిపారు. సర్కిళ్ల వారీగా ఖాళీల వివరాలిలా ఉన్నాయి. వరంగల్-575, కరీంనగర్-674, ఖమ్మం-365, నిజామాబాద్-500, ఆదిలాబాద్-439, మొత్తం ఖాళీలు 2,553. పూర్తి వివరాలకు www.tsnpdcl.in లో చూడవచ్చని పేర్కొన్నారు.

కళాఖండాలు గాయబ్

- దేశంలో ప్రతీరోజూ ప్రాచీన సంపద చోరీ
- మన ప్రాచీన విగ్రహాలకు విదేశీ విపణిలో భారీ డిమాండ్..
- అక్రమార్కులకు అధికారుల సాయం
- విగ్రహాల చోరీ ఘటనల్లో తమిళనాడు టాప్.. తర్వాతి స్థానం తెలుగు రాష్ట్రాలదే!
- పట్టించుకోని దేవాదాయ, పురావస్తు శాఖలు, మేల్కొని ప్రభుత్వాలు
- పరిస్థితి ఇలాగే ఉంటే, మరో దశాబ్దంలో దేశంలోని ప్రాచీన ఆలయ విగ్రహాలు ఖాళీ
- భద్రత, అంతర్జాతీయ నియమావళి అవసరమంటున్న నిపుణులు

- కడవేర్గు


(ఫైల్)

గత వైభవానికి, నేటి వర్తమానానికి, రానున్న భవిష్యత్తుకు అనుసంధానంగా నిలుస్తూ.. చారిత్రక ఘనకీర్తికి ప్రతీకగా.. భావితరాలకు బహుచక్కని జ్ఞాపికగా నిలుస్తోన్న దేశచారిత్రక సంపద.. నేడు అక్రమార్కుల చేతుల్లో పడి సరిహద్దులు దాటుతున్నది. అలనాటి పాలనకు దర్పణాలు, శిలా నైపుణ్యానికి మచ్చుతునకలైన మన పురాతన వస్తువులకు క్రమంగా ఆపద ముంచుకొస్తున్నా.. పాలకులకు చీమకుట్టినట్టు మిన్నకుండిపోతున్నారు. ఆ నేపథ్యంపై 'నవతెలంగాణ' స్పెషల్ స్టోరీ..

పంచలోహ విగ్రహాలను చోరీచేసే ఓ అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను పక్షం రోజుల క్రితం హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి రూ.3 కోట్లు విలువ చేసే 600 ఏండ్ల నాటి పంచలోహ విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తరహా ఘటనలు ఒక్క మన రాష్ట్రంలోనే కాదు.. దేశవ్యాప్తంగా రోజూ ఏదో ఒక చోట పురాతన విగ్రహాలు, విలువైన చారిత్రక వస్తువులు దొంగతనానికి గురవుతూనే ఉన్నాయి. ఐతే, చోరీకి గురైన వస్తువులు మాత్రం తిరిగి స్వాధీనం చేసుకున్న సందరాలు చాలా తక్కువనే చెప్పాలి.

అందరూ సిద్ధహస్తులే:

మన దేశానికి చెందిన ప్రాచీన కళాఖండాలలో ఇప్పటివరకు 50శాతానికి పైగా చోరీకి గురై విదేశాలకు తరలివెళ్లాయని తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ఐతే, ఇది అక్షరాలా నిజం. విదేశీ విపణిలో అధిక మొత్తంలో ధర పలుకుతుండటం, అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా తదితర దేశాల్లోని సంపన్న వర్గాలు, అధికారులు, ప్రతినిధులను మన ప్రాచీన వస్తువులు ఆకర్షిస్తుండటం వగైరా వంటి కారణాల మూలంగా అక్రమార్కులు స్వదేశీ ప్రాచీన సంపదను విదేశాలపాలు చేస్తున్నారు. కాగా, 2016, జూన్ నెలలో అమెరికా పర్యటనకు వెళ్లిన ప్రధాని మోడీకి ఆ ప్రభుత్వం 2 వేల ఏండ్ల నాటి సుమారు రూ.667 కోట్ల విలువైన మన 200 సాంస్కృతిక కళాఖండాలను ముట్టజెప్పిన విషయం తెలిసిందే!

తిరిగిచ్చిన సదరు సంపదలో దేవతా విగ్రహాలు, టెర్రాకోట భాగాలు, చెన్నైలోని శివాలయం నుంచి దొంగిలించిన చోళుల కాలంనాటి సెయింట్ మాణిక్యవిచావకర్ విగ్రహం, వెయ్యేండ్ల కిందటి గణేశుడి కంచు విగ్రహం తదితరాలను చూశాక.. ఇలాంటి ఇంకెన్నో మన అపురూప చారిత్రక సంపదలు విదేశాల్లో కన్నీరు కారుస్తున్నాయని అవగతమవుతున్నది. కాగా, ఇండియాకు అమెరికా అప్పగించిన సదరు కళాఖండాలను అమెరికాలో 'ఆర్ట్ ఆఫ్ ద పాస్ట్' అనే గ్యాలరీని నిర్వహించే సుభాష్ కపూర్ అనే భారతీయుడే మన దేశం నుండి అక్కడికి అక్రమంగా రవాణా చేశాడని తేలడం యావత్ భారతీయులను నిశ్చేష్టులను చేసింది. ఆయా కళాఖండాలను తరలించడంలో ఇక్కడి పురావస్తు, దేవాదాయ అధికారులు, కస్టమ్స్ ఆఫీసర్లు సుభాష్ కపూర్‌కు సాయపడ్డారని అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి.

భద్రత ఎక్కడ?:

ఉత్తరాదితో పోలిస్తే దక్షిణాదిలో పురాతన ఆలయ విగ్రహ దొంగతనాలు అధికంగా జరుగుతున్నవి. అత్యధికంగా తమిళనాడులో ఎక్కువ ప్రాచీన సంపద దోపిడీకి గురవుతుండగా తర్వాతి స్థానాల్లో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, గుజరాత్ లు ఉన్నాయి. ఇక, తమిళనాడు రాష్ట్రంలోని హిందూ దేవాదాయ ట్రస్టు ఆధ్వర్యంలో ఉన్న 38,500 ఆలయాల్లో.. కేవలం, 26,000 ఆలయాల్లోని విగ్రహాలు మాత్రమే భారత పురావస్తు శాఖ రికార్డుల్లో నమోదు కావడాన్ని చూస్తే, అక్కడి అధికారులు ప్రాచీన సొత్తుపై ఎంత జాగురతతో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా, వెనుకబడిన జిల్లాల్లోని పురాతన ఆలయాలకు అక్కడి రాష్ట్రంలో భద్రత లేకుండా పోయింది. ఆయా ఆలయాల్లోని వేల కోట్లు విలువ చేసే విగ్రహాలపై విదేశీయుల కన్ను పడి స్థానిక అధికారులు, స్మగ్లర్లతో చేతులు కలిపి ఈ విగ్రహాల చోరీకి పాల్పడుతున్నట్టు తేలింది. అందుకే, ఏటా ఎంత లేదన్నా 150కి పైగా చోరీ సంఘటనలు ఒక్క తమిళనాడు నుండే రికార్డు అవుతున్నాయి. దాదాపు ఇదే పరిస్థితి మన తెలుగు రాష్ట్రాల్లో కూడా నెలకొంది. అధికారిక లెక్కల ప్రకారం.. ప్రతీ సంవత్సరం మన రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 75 ఈ తరహా చోరీలు జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నా.. లెక్కల్లోకి రానివి ఇంకా ఎన్నో ఉన్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతర్జాతీయ నియమావళి అత్యవసరం:

పురాతన విగ్రహాలు, విలువైన వస్తువులు కొలువైన ఆలయాల వద్ద పటిష్ట బందోబస్తు, సీసీ కెమెరాల పర్యవేక్షణ ఏర్పాటు చెయ్యాల్సిన బాధ్యత ఆయా శాఖలపై ఉన్నది. విగ్రహాల భద్రతతో పాటు వాటి బాగోగులను సైతం పట్టించుకోవాల్సిన అవసరం పురావస్తుశాఖ, ప్రభుత్వాల కనీస ధర్మం. షిఫ్టుల వారీగా సెక్యూరిటీ గార్డులు, దేవాలయాల చుట్టూ ప్రహరీ నిర్మాణం, ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, చోరీ అయ్యే విగ్రహాలను ఎప్పటికప్పుడు గుర్తించడం- రికార్డుల్లో నమోదు చెయ్యడం, ఆలయాలను అధికారులు దఫాలవారీగా సందర్శించడం, విగ్రహాల చోరీ బాధ్యులకు కఠిన శిక్షలను అమలు చేయడం, ప్రాచీన విగ్రహాల అక్రమ రవాణాపై వివిధ దేశాల మధ్య అంతర్జాతీయ నియమావళిని పటిష్టంగా ఆయా దేశాలు రూపొందించడం వంటివి చేస్తేనే మన గత సంపదను భవిష్యత్తుకు అందించిన వారమవుతాం.

మన ప్రాచీన సంపద పరిస్థితి - కొన్ని అంశాలు

- ప్రస్తుతం దేశంలో జరుగుతున్న పురాతన విగ్రహాల చోరీ ఇలాగే సాగితే, మరో దశాబ్దకాలంలోగా మన పురాతన ఆలయాల్లో విగ్రహాలు మిగలవని ఒక అంచనా!
- దేవతా విగ్రహాల ప్రతిష్టాపన సమయంలో అప్పటి రాజులు బంగారం, వెండి, నవరత్న ఖచిత విలువైన రంగురాళ్లను విగ్రహాల అడుగున ఉంచుతారన్న నమ్మకంతో కొందరు దుర్మార్గులు అత్యంత ప్రాచీన కళాఖండాలను, విగ్రహాలను ధ్వంసం చేసిన ఘటనలు వివిధ రాష్ట్రాల్లో ఇప్పటికీ జరుగుతుండటం విచారకరం.
- ఏటా మన రాష్ట్రంలో దోపిడీకి గురవుతోన్న విగ్రహాల విలువ యాభై కోట్లు ఉండొచ్చని అధికారులు చెబుతున్నా.. వాస్తవానికి, ఇది మరో ఐదు రెట్లు ఎక్కువ ఉంటుందని విశ్లేషకుల అభిప్రాయం.

పరాయి పంచన జాతి సంపద -కొన్ని ఘటనలు

- గుంటూరు జిల్లాలో తవ్వకాల్లో బయటపడ్డ 45.52 క్యారెట్ల హోప్ డైమండ్(నీలిరంగు వజ్రం) ప్రస్తుతం వాషింగ్టన్ నేషనల్ మ్యూజియం ఆఫ్ నేచురల్ హిస్టరీలో ఉంది.
- ఛత్రపతి శివాజీ వీర ఖడ్గం 'భవానీ తల్వార్'ను కొల్హాపూర్ దివాన్ మహదేవో భర్వే.. 1875లో ఎడ్వర్డ్ రాజుకు బహుమతిగా ఇచ్చాడని చరిత్ర చెబుతోంది. ప్రస్తుతం ఇది లండన్‌లోని రాయల్ అల్బర్ట్ మ్యూజియంలో ఉంది. ఆదేశ అధికారులు ఈ ఖడ్గాన్ని తిరిగి భారత్ కు అప్పగిస్తామని చెప్పినప్పటికీ.. ఇంకా ఆచరణ మాత్రం జరగలేదు.
- బ్రిటన్ రాణి కిరీటంలో పొదిగి ఉన్న కోహినూర్, మొఘల్ రాజుల కాలంలో విశేషంగా ఆకట్టుకున్న నెమలి సింహాసనం ప్రస్తుతం పరాయిపంచన చేరాయి.
- జైపూర్ లోని రాయల్ మ్యూజియం నుండి 1700 పురాతన కళాఖండాలు, బీహార్ లోని నలందా మ్యూజియం నుండి 188 విగ్రహాలు ఒకేసారి అదృశ్యమైపోవడం అప్పట్లో అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది.
- తంజావూరులోని శివపురం దేవాలయం నుండి మాయమైన నటరాజ విగ్రహం లాస్ ఏంజిల్స్ మ్యూజియంలో ఉండగా.. బీహార్ కు చెందిన ప్రాచీన శివుని విగ్రహం లండన్ మ్యూజియంలో ఉన్నది.
- దాదాపు రూ. 27కోట్ల విలువజేసే 12వ శతాబ్దానికి చెందిన బుద్ధుడి విగ్రహం, హిందూ దేవతల విగ్రహాల వంటి అరుదైన కళాఖండాలు ప్రస్తుతం ఆస్ట్రేలియా జాతీయ మ్యూజియంలో ఉన్నట్టు నిపుణులు గుర్తించారు.
- భారత్‌కు చెందిన సుల్తాన్ గంజ్ బుద్ధుడి విగ్రహం ప్రస్తుతం ఇంగ్లాండ్‌లోని బర్మింగ్‌హమ్ మ్యూజియంలో కొలువుతీరి ఉంది.

ఇక, 13వ శతాబ్దం నాటి మిథున విగ్రహం సైతం విదేశాల్లోకి తరలిపోయింది.

- మేలిమి రకపు పాలరాతితో రూపొంది.. ఒకప్పుడు మధ్యప్రదేశ్‌లోని భోజ్శాలోని గుడిలో పూజలందుకున్న సరస్వతీ దేవి విగ్రహం ప్రస్తుతం బ్రిటీష్ మ్యూజియంలో ఉంది. ఈ విగ్రహాన్ని వెనక్కి రప్పించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టినప్పటికీ ఫలించడం లేదు.
- చెన్నైలోని విర్ధగిరీశ్వర్ గుడిలో పూజలందుకున్న సింహముఖ కలి విగ్రహాన్ని ఓ దొంగ అధికారుల అండదండలతో విదేశీయుల పంచన చేర్చాడు. ప్రస్తుతం ఈ విగ్రహం ఆస్ట్రేలియాలోని నేషనల్ గ్యాలరీలో ప్రదర్శనలో ఉంచారు.
- ఆంగ్లేయులు వెళ్తూ వెళ్తూ తీసుకెళ్ళిన ఆంధ్రరాష్ట్ర అమరావతికి చెందిన బౌద్ధ స్థూపాలు, ఇతర బౌద్ధ మతానికి చెందిన శిల్ప సంపద ఇప్పటికీ లండన్‌లోని జోసెఫ్ హౌటురగ్ గ్యాలరీలో ఉన్నది.
- గుంటూరులోని అమరావతిలో బయటపడ్డ అరుదైన చిహ్నాలను బ్రిటీష్ రాజు తరలించుకుపోయి మొదట చెన్నై మ్యూజియంలోనూ ఆ తర్వాత 1853లో లండన్‌కు చేర్చారు. ప్రస్తుతం అవి బ్రిటీష్ మ్యూజియంలో ఉన్నాయి.

భవిష్యత్‌లో విద్యుత్ వాహనాలదే హవా

పెట్రోల్ బంక్‌ల తరహాలో చార్జింగ్ కేంద్రాల ఏర్పాటు

- సైబర్ నేరాలతో గ్రిడ్‌కు ముప్పు
- ఎస్‌ఆర్‌పీసీ అధ్యక్షులు డి ప్రభాకరరావు
- పాండిచ్చేరిలో ముగిసిన రెండు రోజుల సమావేశాలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశంలో విద్యుత్ వాహనాల పరిశ్రమ దినదిన ప్రవర్ధమానవుతున్నదని, దీనికి తగ్గట్లుగా విద్యుత్ సంస్థలు సంస్థాగతంగా సంసిద్ధం కావాలని దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ సంస్థల సంఘం (ఎస్.ఆర్.పి.సి) అధ్యక్షులు, తెలంగాణ ట్రాన్స్ కో, జెన్ కో సిఎమ్‌డి దేవులపల్లి ప్రభాకర్ రావు అన్నారు. పాండిచ్చేరిలో రెండు రోజుల పాటు జరిగిన ఎస్‌ఆర్‌పిసి 33వ సదస్సులో ఆయన అధ్యక్షోపన్యాసం చేశారు. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ఎకోఫ్రెండ్లీ వాహనాల వాడకాన్ని అన్ని దేశాలు ప్రోత్సహిస్తున్నాయని, భారత దేశంలో కూడా విద్యుత్ వాహనాల పరిశ్రమ బాగా అభివద్ధి చెందుతున్నదని ఆయన చెప్పారు. 2030 నాటికి ప్రజారవాణా వ్యవస్థలో నూరు శాతం, వ్యక్తిగత వాహనాల్లో 40 శాతం విద్యుత్ వాహనాల వినియోగం ఉండాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నట్టు వివరించారు. పెట్రోల్ బంకుల మాదిరే వాహనాలకు విద్యుత్ చార్జింగ్ సదుపాయాలను వేగంగా, విరివిగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఆటోమోబైల్ పరిశ్రమ నుంచి విద్యుత్ సంస్థలకు ఉన్నదని చెప్పారు. దీనిని దష్టిలో ఉంచుకుని విద్యుత్ సంస్థలు భవిష్యత్ ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. చార్జింగ్ స్టేషన్లకు అవసరమైన విద్యుత్‌ను అందించడానికి ఏర్పాట్లు చేసుకోవాలని, ఆయా రాష్ట్రాల విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్లతో సంప్రదించి, విద్యుత్ వాహనాలకు చార్జింగ్ చేసే ఏజెన్సీలను ప్రత్యేక విద్యుత్ వినియోగదారులుగా గుర్తించాలని, వారికి ప్రత్యేక టారిఫ్ నిర్ణయించాలని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తికి అత్యవసమైన బొగ్గు నిల్వలు చాలినంత లేకపోవడం వల్ల ఇబ్బంది కలుగుతున్న విషయాన్ని కేంద్ర విద్యుత్ సంస్థ (సీఈఏ)కు తెలిపామన్నారు. సిఈఏ కూడా కోల్ కంపెనీలతో సంప్రదింపులు జరిపిందని, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో చాలినంత బొగ్గును నిల్వచేయాలని కోరిందన్నారు. భవిష్యత్తులో బొగ్గు కొరత ఎదురుకాదని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రిడ్ ఆపరేషన్లను విఘాత పరిచే విధంగా సైబర్ నేరాలు జరుగుతున్నాయని, వీటిపై అప్రమత్తంగా ఉండాలని ఆయన సభ్య రాష్ట్రాల విద్యుత్ అధికారులను హెచ్చరించారు. కీలకమైన విభాగాలు, పరికరాల నిర్వహణ విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని, ఎప్పటికప్పుడు మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించారు. విద్యుత్ రంగంలో సైబర్ భద్రతకు సంబంధించి, సిఇఎ కూడా అప్రమత్తంగా ఉందని, ఈ విషయంలో దేశంలోని అన్ని విద్యుత్ సంస్థలకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించడానికి సిద్ధంగా ఉన్నదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేయడంపై ఎస్‌ఆర్‌సిపి సమావేశం హర్షం వ్యక్తం చేసింది. సమావేశానికి ఆతిథ్యమిచ్చిన నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ డైరెక్టర్ తంగ పాండ్యన్ తన ప్రారంభోపన్యాసంలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. రైతులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరి, రైల్వే, కోల్ ఇండియా, పిజిసిఐఎల్ ప్రతినిధులు కూడా తమ అభినందనలు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాల్ని డి ప్రభాకరరావు వారికి తెలిపారు. సమావేశంలో ఎస్‌ఆర్‌పిసి సభ్య కార్యదర్శి ఎస్‌ఆర్ భట్ తదితరులు పాల్గొన్నారు.



వేసవికాలంలో ఉరకలేసే జంస్కార్ నది ఇపుడు ఎంతగా గడ్డకట్టిందంటే.. ఆ నది కాస్త రహదారిలా మారిపోయింది.జమ్మూకాశ్మీర్‌లోని జంస్కార్ వ్యాలీలో పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నది.లద్దాక్ ప్రాంతంలోని జంస్కార్ నది ప్రవాహంతో.. చుట్టు పక్కల బంధాలు,సంబంధాలు తెగిపోయలా ఉధృతంగా ప్రవహిస్తోంది.కానీ శీతాకాలంలో గడ్డకట్టిన జంస్కార్ నది కాస్త రహదారిగా మారిపోతోంది. స్థానికులతో పాటు పర్యాటకులు తరలివస్తారు.

ఐకేపీ, వివోఏ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని ఐకేపీ, వివోఏ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీసం వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, జీవోల ప్రకారం గత ఆరు నెలల బకాయిలు చెల్లించాలని తెలంగాణ ఐకేపీ, వివోఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం తీర్మాణించింది. సమస్యల సాధన కోసం ఈనెలలో జిల్లాస్థాయి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ సంఘం కొత్త కమిటీని సైతం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ వివోఏల పట్ల వివక్ష ప్రదర్శించడం అన్యాయమన్నారు. ఎన్నికల్లో చేసిన వాగ్దానాలకు కట్టుబడి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంఘాలు, ఉద్యోగుల మధ్య విభేదాలు సృష్టించి కుట్రలు చేస్తున్నారని చెప్పారు. గత నాలుగేండ్లుగా అనేక విధాలుగా ప్రభుత్వానికి మొరపెట్టుకున్న ఫలితం లేదన్నారు. ఐకేపీ, వివోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, రూ. 10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, జీవో 58ని రద్దుచేసి వేధింపులు ఆపాలని విజ్ఞప్తి చేశారు. మార్చి మూడో వారంలో చలో అసెంబ్లీకి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు జె.వెంకటేశ్, ఎం.నగేశ్, సుధాకర్ పాల్గొన్నారు.

కొత్త కమిటీ ఎన్నిక : తెలంగాణ ఐకేపీ, వివోఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ అనుబంధం) గౌరవాధ్యక్షులుగా జె.వెంకటేశ్, అధ్యక్షులుగా సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా కె.లావన్య, కోశాధికారిగా ఎం.నగేశ్ ఉపాధ్యక్షు లుగా జి.ధనలక్ష్మి, రాజ్‌కుమార్, వెంకటేశ్, కార్యదర్శులుగా మంగ, శివశం కర్, లక్ష్మన్‌తోపాటు మరో 17 మంది రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.



తెనాలిలో కేసీఆర్ జన్మదిన వేడుకలు

తెనాలి : తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు ఏపీ గుంటూరు జిల్లా తెనాలిలో కేసీఆర్ అభిమాని ఖాదర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కేసీఆర్ 64 జన్మదినం సందర్భంగా కేసీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మదర్ తెరిస్సా ఆశ్రమంలోని వృద్ధులకు చీరలు పంపిణీ చేయడంతోపాటు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఖాదర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తితో ఆయన అభిమానిగా మారినట్టు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కేసీఆర్ పాత్రను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. రామకృష్ణ, సుభాని, సునీల్, షేక్ ఆమ్లే, రఫీ, మాణిక్యరావు, శివ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఏపీలో కేసీఆర్ జన్మదిన వేడుకలు చర్చనీయాంశంగా మారాయి.

దేశాభివృద్ధికి యువశక్తే కీలకం

- మద్రాస్ మేనేజ్‌మెంట్ వార్షికోత్సవంలో కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భవిష్యత్తులో దేశాన్ని యువశక్తే ముందుకు తీసుకువెళ్లుతుందని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. యువత ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వాలు సహాయ, సహకారాలు అందిస్తే వారు ప్రపంచాన్నే జయించే శక్తి ఉందన్నారు. శనివారం చెన్నైలోని మాద్రాస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ 2018వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ వేగంగా దేశాభివృద్ధి జరగాలంటే ప్రభుత్వాలు, ప్రయివేటు సంస్థల్లా ఆలోచించి తమ పనితీరును మెరుగుపర్చుకోవాలని తెలిపారు. ప్రయివేటు సంస్థలు ప్రభుత్వాల మాదిరిగా ఆలోచించి సమాజం కోసం పని చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో వినూత్న విధానాలను అమలు చేస్తున్నదని చెప్పారు.

"అసలు పాపం అప్పుడే..

న్యూఢిల్లీ: కోట్లాది రూపాయల పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణంపై కాంగ్రెస్ పార్టీకి బీజేపీ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. యూపీఏ హయంలోనే ఈ కుంభకోణం చోటుచేసుకున్నప్పటికీ ప్రజల దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందని దుయ్యబట్టింది. నీరవ్ మోడీ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ బీజేపీని టార్గెట్ చేయడంపై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ స్పందిస్తూ... "నీరవ్ మోడీ మొత్తం వ్యవహారంలో అసలు పాపం 2011లోనే జరిగింది. ఫైర్ స్టార్ డైమండ్ ఇంటర్నేషనల్ ప్రయివేట్ లిమిటెడ్ అనేది నీరవ్ మోడీ కంపెనీల్లో ఒకటి. అద్వైత్ హోల్డింగ్స్ నుంచి వాళ్లు దీనిని కొనుగోలు చేశారు. 2002 నుంచి అనితా సింఘ్వి ఈ కంపెనీలో వాటాదారుగా ఉన్నారు..." అని ఆమె చెప్పారు. అనితా సింఘ్వి కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వి సతీమణి కావడం విశేషం. 2013 నుంచి ఎఎస్ఈలో వ్యాపారం చేస్తున్న గీతాంజలి జెమ్స్ అనే కంపెనీని 6 నెలల క్రితమే సస్పెండ్ చేశారనీ... అయితే ఇదే నగల సంస్థ నిర్వహించిన ఓ ప్రమోషనల్ కార్యక్రమంలో రాహుల్ గాంధీ పాల్గొన్నారన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి 9 మంది మృతి

18 మందికి గాయాలు, రాజస్థాన్‌లోని ఆజ్మీర్‌లో ఘటన

జైపూర్: రాజస్థాన్‌లో విషాదం చోటుచేసుకుంది. పెండ్లి ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి 9 మంది మృతి చెందారు. మరో 18 మందికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం... రాష్ట్రంలోని అజ్మీర్ జిల్లా బీవార్‌లో శుక్రవారం రాత్రి ఓ భవనంలో పెండ్లి వేడుక జరుగుతుండగా ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలింది. పేలుడు దాటికి రెండస్తుల భవనం కుప్పకూలిపోయింది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టి 9 మృతదేహాలను వెలికి తీశారు. క్షతగాత్రులను అజ్మీర్, జైపూర్ ఆస్పత్రులకు తరలించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశమున్నట్టు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధరా రాజే దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మెక్సికోలో భూకంపం

- రిక్టర్ స్కేల్‌పై 7.2గా నమోదు

మెక్సికో సిటీ: మెక్సికోను మరోసారి భూకంపం వణికించింది. భూకంప లేఖినిపై దీని తీవ్రత 7.2గా నమోదైనట్టు యూఎస్ జియోలాజికల్ సర్వే అధికారులు వెల్లడించారు. ఒక్కసారిగా ప్రకంపనలు రావడంతో ప్రజలు రోడ్లమీదకు పరుగులు తీశారు. ఒక్సాకా, మెక్సికో సిటీలోని పలు భవనాలు ధ్వంసమైనట్టు అధికారులు తెలిపారు. అయితే.. ఇప్పటి వరకు ఎవరూ ప్రాణాలు కోల్పోలేదని వెల్లడించారు. ఎటువంటి సునామీ హెచ్చరికలు జారీ చేయలేదు. నిమిషం పైనే భూమి కంపించిందని కొందరు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. చైనీస్ న్యూఇయర్ వేడుకలు చేసుకునేందుకు ప్రజలు పెద్ద ఎత్తున రహదారుల మీదకు చేరారు. అదే సమయంలో ఒక్కసారిగా ప్రకంపనలు రావడంతో అందరూ భయభ్రాంతులకు గురయ్యారు.

గతేడాది సెప్టెంబరు నెలలో మెక్సికోలో రెండు సార్లు భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. సెప్టెంబరు 7న రిక్టర్ స్కేల్‌పై 8.2 తీవ్రతతో భూకంపం సంభవించగా.. 96 మంది ప్రాణాలు కోల్పోయారు. అనంతరం అదే నెలలో 19వ తేదీన మరోసారి 7.1తీవ్రతతో భూకంపం రాగా.. దాదాపు 369 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ రెండు ప్రమాదాల నుంచి మెక్సికో నగరం ఇప్పుడిప్పుడే



తేరుకుంటున్న సమయంలో మరోసారి ప్రకంపనలు రావడంతో ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు లోనయ్యారు. తమ వాళ్లను వెంట బెట్టుకొని ఏడుస్తూ రోడ్ల మీదకు పరుగులు తీశారు. భూప్రకంపనలు వచ్చిన సమయంలో తీసిన వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో సంచలనంగా మారాయి.

కూలిన మంత్రి హెలికాప్టర్..

- 13 మంది మృతి..15 మందికి గాయాలు



భూకంప తాకిడికి గురైన ప్రాంతాల్లో పర్యటిం చేందుకు వెళ్లిన మంత్రి హెలికాప్టర్ అమాంతంగా కూలిపోయింది. ఘటనలో 13 మంది చనిపోగా, 15 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా మంత్రి సురక్షితంగా తప్పించుకున్నారని సమాచారం. భూకంప తాకిడి ప్రాంతాల్లో పర్యటించేందుకు మంత్రి అల్ఫోన్సో వెళ్లారు. ఈ సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. దీనిపై ప్రాథమిక దర్యాప్తు చేస్తున్నారు.

ఆ టీచర్ లేకపోతే.. మరింత ప్రాణనష్టం



శాంతి విశ్వనాథన్

న్యూయార్క్: ఓ వైపు విద్యార్థి తుపాకీతో తోటి విద్యార్థులపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడుతున్నాడు. పాఠశాల కారిడార్‌లో తిరుగుతూ కనిపించిన వారిని కనిపించినట్టు కాల్చేస్తున్నాడు. ప్రమాదాన్ని గమనించిన ఓ భారతీయ-అమెరికన్ ఉపాధ్యాయురాలు భయపడిపోకుండా ఎంతో చాకచక్యంగా వ్యవహరించింది. ఆమె ఎంతో ధైర్యంగా పిల్లలకు ఎటువంటి ప్రమాదం జరగకుండా కాపాడగలిగింది. ఆ సమయంలో ఆమె కనుక సమయస్ఫూర్తితో వ్యవ హరించకపోయి ఉంటే.. అతడి తుపాకీకి మరింత మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చి ఉండేది. విద్యార్థులను కాపాడిన ఉపా ధ్యాయురాలి పేరు శాంతి విశ్వనాథన్. ఆమె ఆ పాఠశాలలో గణితశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది.

ఫ్లోరిడాలోని పార్క్‌ల్యాండ్‌లోని మర్జోరీ స్టోన్‌మన్ డగ్లస్ పాఠశాలలోకి చొరబడిన 19ఏళ్ల క్రూజ్ విచక్షణారహితంగా కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఈ కాల్పుల్లో దాదాపు 17 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోగా.. మరో 14 మంది గాయపడ్డారు. క్రమశిక్షణగా మెలగడం లేదని క్రూజ్‌ను పాఠశాల యాజమాన్యం సస్పెండ్ చేయడంతో కోపం పెంచుకున్న అతడు ఈ కాల్పులకు తెగబడ్డాడు.

కాల్పుల శబ్దం వినబడగానే విశ్వనాథన్ వెంటనే తరగతి తలుపులు, కిటికీలు మూసివేశారు. విద్యార్థులందరినీ నిశ్శబ్దంగా ఉండమని చెబుతూ వారందరినీ కింద కూర్చోమన్నారు. ప్రమాద సమయంలో ఆమె చూపించిన సమయస్ఫూర్తి వల్లే తమ పిల్లలు ప్రాణాలతో ఉన్నారని లేదంటే.. ఊహించడానికే భయం వేస్తోందని ఓ విద్యార్థి తల్లి ఆనాటి ఘటనను గుర్తుకు తెచ్చుకున్నారు. పోలీస్ బృందం వచ్చి తరగతి గది తలుపు కొట్టినప్పటికీ ఆమె మాత్రం తలుపు తీసేందుకు నిరాకరించారు. గన్‌మెన్ గొంతు మార్చి అలా మాట్లాడి కాల్పులు జరిపేందుకు ప్రయత్నిస్తున్నాడేమోనని భావించిన ఆమె తలుపు తీయనన్నారని పోలీస్ అధికారి ఒకరు తెలిపారు.

టెస్లా కారు భూమిని ఢీకొట్టనున్నదా ?

న్యూఢిల్లీ: స్పేస్‌ఎక్స్ సీఈవో ఎలన్ మస్క్ గత వారం అంతరిక్షంలోకి పంపించిన టెస్లా రోడ్‌స్టర్ కారు గుర్తుందా? దీని గురించి ముగ్గురు ఖగోళ శాస్త్రవేత్తలు చెప్పిన విషయం అందర్నీ ఆందోళనకు గురిచేసింది. ఆ కారు భూమి, లేదా శుక్ర గ్రహాన్ని ఢీకొట్టే అవకాశాలు ఉన్నాయని వారు అంచనావేస్తున్నారు. అయితే అది జరగాలంటే కొన్ని లక్షల సంవత్సరాలు పడుతుందని చెబుతున్నారు. భూమికి దగ్గరగా రావాలంటే మరో పది లక్షల ఏండ్లు పడుతుందని చెబుతున్నారు. అదికూడా భూమివైపు దూసుకొచ్చే అవకాశాలు తక్కువేనని పేర్కొన్నారు. 6 శాతం భూమివైపు వచ్చే అవకాశాలుంటే... 2.5 శాతం శుక్ర గ్రహం వైపు వచ్చే ఛాన్స్ ఉందన్నారు. అయితే భూ కక్ష్యలోకి వచ్చేలోగా మహాప్రళయాలు సంభవించే అవకాశం ఉన్నందున... భూమిపై అప్పటికి జీవరాశి ఉండకపోవచ్చునని పరిశోధకులు వెల్లడించారు. భూకక్ష్యలోకి వస్తే భూమిని చేరేలోగా ఆ వేగానికి కారు కాలిపోయే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు ఆర్బిటల్ డైనమిక్స్‌పై అధ్యయనం చేస్తున్న హన్నో రైన్, డానియేల్ టమాయో, డేవిడ్ వక్రొల్కి అనే ముగ్గురు పరిశోధకులు రాయల్ ఆస్ట్రానామికల్ సొసైటీ మ్యాగజైన్ వెల్లడించారు.

1,140 అడుగుల చెక్క ఆకాశహర్మ్యం !

టోక్యో : ప్రపంచంలో అతిపెద్ద చెక్క ఆకాశహర్మ్యాన్ని నిర్మించనున్నట్టు జపనీస్ ఆర్కిటెక్ట్ పేర్కొన్నారు. 1,148 అడుగులు(350 మీటర్లు) ఎత్తు ఉండే చెక్క భవనంలో షాపులు, ఇండ్లు, కార్యాలయాలు, హోటల్స్ ఉంటాయని చెప్పారు. నగరాన్ని అడవిగా మార్చే యుద్ధప్రాతిపదిక చర్యల్లో భాగంగా సెంట్రల్ టోక్యోలో దీన్ని నిర్మించనున్నట్టు పేర్కొన్నారు. భవిష్యత్‌లో ప్రతి భవనాన్ని ఎకో ఫ్రెండ్లీగా నిర్మించాలని భావిస్తున్నట్టు తెలిపారు. 2041 కల్లా చెక్క ఆకాశహర్మ్యాన్ని పూర్తి చేస్తామని వెల్లడించారు. భవంతి నిర్మాణంలో 90 శాతానికి పైగా చెక్కనే వినియోగించనున్నట్టు వివరించారు. నిర్మాణానికి దాదాపు 5.9 బిలియన్ డాలర్లు ఖర్చు అవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టును డబ్ల్యూ 350గా పిలుస్తున్నారు. 70 అంతస్తులు ఉండే భవంతి నిర్మాణానికి ఏ రకపు చెక్కను వినియోగిస్తారన్న విషయంపై ఇంకా స్పష్టత లేదు.

మానవ మృగానికి నాలుగు మరణశిక్షలు

- చిన్నారిపై లైంగికదాడి, హత్య కేసులో సంచలన తీర్పు
- పాక్‌లోని లాహోర్ న్యాయస్థానం తీర్పు

లాహోర్: ఏడేండ్ల చిన్నారిని అపహరించి అత్యంత దారుణంగా ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టి కిరాతకంగా హత్య చేసిన ఓ దుర్మార్గుడికి పాకిస్థాన్‌లోని లాహోర్ న్యాయస్థానం నాలుగు మరణశిక్షలు విధించింది. పాక్‌లో సంచలనం సృష్టించిన చిన్నారి జైనాబ్(7) లైంగికదాడి కేసును విచారించిన యాంటీ టెర్రరిజం కోర్టు(ఏటీసీ) శనివారం సంచలన తీర్పును ఇచ్చింది. పాపపై అత్యాచారానికి ఒడిగట్టిన 23ఏండ్ల ఇమ్రాన్ అలీకి నాలుగు మరణశిక్షలు విధిస్తున్నట్టు ప్రకటించింది. అపహరణ, హత్య, అత్యాచారం, ఉగ్రవాద చర్యల కింద నాలుగు మరణశిక్షలు విధించింది.

వీటితో పాటు చిన్నపిల్లతో అత్యంత దారుణంగా ప్రవర్తించినందుకు గాను మరో జీవిత ఖైదును విధించింది. అంతేకాదు.. చిన్నారి మృతదేహాన్ని చెత్తలో పడేసినందుకు అదనంగా మరో ఏడేండ్ల జైలు శిక్షను విధిస్తున్నట్టు ఏటీసీ ప్రత్యేక న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ఇంకా అతడు రూ.32లక్షలు జరిమానా కూడా కట్టాల్సిందిగా న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. తీర్పును సవాలు చేస్తూ ఎగువ కోర్టుకు వెళ్లేందుకు దోషి అలీకి న్యాయస్థానం



15రోజుల గడువు ఇచ్చింది.

కసూర్ ప్రాంతానికి చెందిన జైనాబ్ జనవరి 4న అపహరణకు గురైంది. ఐదు రోజుల తర్వాత ఆమె ఇంటికి సమీపంలోని డంపింగ్ యార్డులో అత్యంత విషాద పరిస్థితిలో విగతజీవిగా పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. ఈ కేసు పాక్‌లో సంచలనం సృష్టించింది. జైనాబ్ కేసును పాక్ నిర్భయగా కూడా అభివర్ణించారు. జైనాబ్ ఘటనను నిరసిస్తూ పాక్‌కు చెందిన ఓ ప్రముఖ టెలివిజన్ వ్యాఖ్యాత తన రెండేళ్ల కూతురుని ఒడిలో కూర్చొబెట్టుకొని వార్తలు చదివిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియోలు అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో సంచలనంగా మారాయి. ఈ ఘాతుకానికి పాల్పడిన వ్యక్తిని ఉరితీయాలంటూ కసూర్ గ్రామస్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. అక్కడ పోలీస్ స్టేషన్‌పై ఆందోళనకారులు దాడి చేయడంతో పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల ఘటనలో ముగ్గురు ప్రాణాలు కూడా కోల్పోయారు.

జైనాబ్‌పై అత్యంత క్రూరంగా హత్యాచారానికి పాల్పడిన నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించారు. ఎట్టకేలకు పాపపై అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తిని ఇమ్రాన్ అలీగా గుర్తించారు. జనవరి 23న అతడ్ని అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి దాదాపు 52 మంది సాక్షులను కోర్టు విచారించింది. గురువారంతో ఈ కేసు విచారణలు పూర్తి కాగా.. తీర్పును రిజర్వ్‌లో పెట్టింది. శనివారం అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈ కేసుకు సంబంధించిన తీర్పును న్యాయమూర్తి ఇచ్చారు.

కోర్టు తీర్పు పట్ల జైనాబ్ తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. తమ బిడ్డకు న్యాయం జరిగిందని అన్నారు. ఈ కేసులో దోషిగా తేలిన అలీ కసూర్ ప్రాంతంలోని ఆరుగురు చిన్నారులపై ఇదే విధంగా అత్యాచారానికి పాల్పడినట్టు విచారణలో వెల్లడించాడు.

ఎఫ్‌బీఐ ఆరోపణలు 'ఫూలిష్'

- రష్యా విదేశాంగ మంత్రి లావరోవ్



మ్యూనిచ్ : అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యన్ల జోక్యం కేసులో ఎఫ్‌బీఐ ప్రత్యేక కౌన్సిల్ 13మంది రష్యన్లపై ఆరోపణలు నమోదు చేయటాన్ని రష్యా విదేశాంగ మంత్రి లావరోవ్ తప్పుబట్టారు. ఎఫ్‌బీఐ తీరు 'ఫూలిష్'గా ఉందని వ్యాఖ్యానించారు. శనివారం జర్మనీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..."ఇందులో నిజానిజాలేంటో చూడాలి.

ఎఫ్‌బీఐ తీరు ఫూలిష్‌గా ఉంది" అని అన్నారు. ఎఫ్‌బీఐ ప్రత్యేక కౌన్సిల్ 37 పేజీలతో ఛార్జ్‌షీట్ రూపొందించింది. కొంతమంది రష్యన్లు గ్రూపులుగా ఏర్పడి..అమెరికన్ పౌరులుగా వ్యవహరించారని, అమెరికాకు వచ్చి ఇక్కడ బ్యాంక్ ఖాతాలను తెరిచారని, రాజకీయ ప్రచారంలో పాల్గొని వేల డాలర్లను అడ్వర్టయిజ్‌మెంట్స్ కోసం ఖర్చు చేశారని, వారంతా రష్యా నేపథ్యాన్ని కావాలనే దాచారని,

అమెరికాలో రాజకీయాల్ని ప్రభావితం చేయడానికి వ్యవస్థీకృత వ్యవస్థను తయారుచేశారని...మొదలైన ఆరోపణల్ని ఎఫ్‌బీఐ నమోదుచేసింది.

నైజీరియాలో ఆత్మాహుతి దాడి

- 19 మంది మృతి, 70మందికి గాయాలు
- బొకోహరం పనేనని అనుమానం

కానో: నైజీరియాలోని కొండుగ ప్రాంతంలో శుక్రవారం జరిగిన ఆత్మాహుతి పేలుళ్లలో 19 మంది మృతి చెందగా 70 మంది గాయపడ్డారు. ఇందులో 20 మంది పరిస్థితి విషమం గా ఉందని నైజీరియా సైన్యం శనివారం తెలిపింది. ఈ దాడి బొకోహరం జిహాదీలు పనేనని సైన్యం భావిస్తున్నది. శుక్రవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో బాంబు దాడి చోటు చేసుకు న్నట్టు బోర్నో పోలీస్ కమిషనర్ తెలిపారు. బోర్నో రాష్ట్ర రాజధానికి 35 కిలోమీటర్ల దూరంలో ఉండే కొండుగలోని చేపలో మార్కెట్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. కాగా చనిపోయిన వారిలో ఒక సైనికుడు కూడా ఉన్నాడు. ముగ్గురు వ్యక్తులు ఆత్మాహుతి దాడికి పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. గత 9ఏండ్లుగా బొకోహరం ఆత్మాహుతి దాడుల్లో సుమారు 20 వేల మంది చనిపోగా లక్షల మంది నిరాశ్రయులయ్యారు. గత నెల 31 కొండుగలోని ఓ గ్రామంలో మహిళా ఉగ్రవాదులు ఆత్మాహుతి పేలుళ్లకు పాల్పడ్డారు. 2015లో నైజీరియా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మాజీ సైనిక పాలకుడు ముహమ్మదు బుహారీ, బోకోహరామ్‌ను కట్టడి చేయలేకపోతున్నాడు. ఆయన పౌరులకు రక్షణ కల్పించలేకపోతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బొకోహరాం తీవ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్‌తో విలీనం అయ్యాక, పెద్ద ఎత్తున ఆత్మాహుతి దాడులు జరుపుతోంది.



ఎస్సారెస్పీ కాల్వల ఆధునీకరణలో ...

11 తూముల నిర్మాణానికి ఆమోదం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

శ్రీరామ్‌సాగర్ ఆధునీకరణలో భాగంగా వరదకాలువ నుంచి చెరువులను నింపేందుకు గాను 11 తూముల నిర్మాణానికి ప్రభుత్వం శనివారం ఆమోదం తెలిపింది. కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లోని పలు చెరువులు వాటితో ముడిపడి ఉన్న గొలుసుకట్టు చెరువులను వరదకాలువ నీటితో నింపడానికి ఇరిగేషన్ శాఖ కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేసినట్టు ఆ శాఖ మంత్రి హరీశ్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కల్వకోట గ్రామానికి చెందిన వీరన్నకుంట చెరువుతో పాటు గోలుసుకట్టు చేరువులను నింపడానికి తూము నిర్మాణం జరగనుంది. కొండాపూర్ దగ్గర పెద్దచెరువు, దాంతో పాటు గొలుసుకట్టు చెరువులను నింపడానికి గాను తూము నిర్మిస్తున్నారు. అంతర్గాం ఊరచెరువు, గొలుసుకట్టు చెరువులను నింపేందుకు తూము నిర్మిస్తారు. మల్యాల మత్తడి చెరువు, దానితో పాటు గొలుసుకట్టు చెరువులు నింపడానికి తూము నిర్మాణం చేపడతారు. తాటిపల్లి పెద్దచెరువు, గొలుసుకట్టు చెరువులు నింపడానికి తూము అవసరమవుతున్నది. బూరుగుపల్లి ఊరచెరువు, దాంతోపాటు గొలుసుకట్టు చెరువులను నింపడానికి,



నందగిరి బంజారి కుంట దాంతో గోలుసుకట్టు చేరువులను గట్టుబూత్కూరు ఊరచెరువ, నర్సింగాపూర్ చెరువు నింపేందుకు తూములను నిర్మించాలని తలపెట్టారు. ఎస్సారెస్పీ మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు హయాంలో శంకుస్థాపనకు నోచుకున్న వరద కాలువ నిర్మాణం పనులు దశాబ్ద కాలం క్రితం పూర్తి అయ్యాయి. అయితే ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో తగ్గిపోవడంతో వరదకాలువ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటివరకు కేవలం రెండు పర్యాయాలే వరద కాలువ ద్వారా నీటిని వదిలారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయిలో నిండితే తప్ప వరద కాలువ నీటిని వదిలే అవకాశం లేకుండాపోయింది. ప్రాజెక్ట్ ఎగువ ప్రాంతంలో మహారాష్ట్ర ప్రభుత్వం గోదావరి నదిపై అనేక ప్రాజెక్టలను ఏర్పాటు చేయడంతో ఇన్‌ఫ్లో దాదాపుగా తగ్గిపోయింది. వరద కాలువ నిండుగా ప్రవహించిన సందర్భాల్లో తూముల నుండి విడుదలయే నీరు డిస్ట్రిబ్యూటరీ కాలువల ద్వారా చెరువులకు చేరేలా ఏర్పాట్లు చేసారు. నిజామాబాద్ జిల్లాలో ఇదివరకే బాల్కొండతో పాటుగా మోర్తాడ్ మండలంలోని దొన్‌కల్, పాలెం, కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌ల వద్ద ఈ తూములను ఏర్పాటు చేసారు. ఇప్పుడు జగిత్యాల, కరీంనగర్ జిల్లాలోనూ వరద కాలువ పై తూములను నిర్మించబోతున్నారు. వరదకాలువ, ఎస్సారెస్పీ లింక్ ఎత్తిపోతల పథకానికి గత జూన్లో సీఎం కేసీఆర్ ఆమోదం తెలిపారు. వరదకాలువ నుంచి 60 రోజుల పాటు రోజుకు ఒక టీఎంసీ నీటిని మూడు దశల్లో తరలించేలా నిర్మించాలని ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని డిజైన్ చేసింది. దీనికి సంబంధించి రూ.1,067 కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. ఎత్తిపోతలతో పాటు కాల్వలను కూడా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయనున్నారు.

కొన్నారు.. అక్కడే అమ్మేశారు

- సబ్సిడీ గొర్రెలు అమ్మిన వారిపై కేసు
- పోలీసుల అదుపులో 11 మంది లబ్దిదారులు: వివరాలు వెల్లడించిన హుస్నాబాద్ ఏసీపీ మహేందర్


నవతెలంగాణ-హుస్నాబాద్



గొల్ల, కుర్మల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన సబ్సిడీ గొర్రెలను దారిలోనే అమ్మేసిన 12 మంది లబ్దిదారులపై కేసు నమోదైంది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శనివారం హుస్నాబాద్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మహేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. అక్కన్నపేట మండలం మోతుకులపల్లి గ్రామానికి చెందిన 12మంది లబ్దిదారులు జింక నవీన్, సలుపల మొం డయ్య, సలుపల రాజు, అందె రాజయ్య, బూస రాజు, గొర్ల శ్రీకాంత్, మర్క రవికుమార్, మండల రవీందర్, నేతుల అయిలయ్య, గుల్లబోయిన సమ్మయ్య, మందల ఐలోని, ముసికె సారయ్యకు సబ్సిడీ గొర్రెలు మంజూరయ్యాయి. వారం రోజుల కిందట వారు గొర్రెల కోసం ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాకు వెళ్లారు. అక్కడ 12 యూనిట్లు కొనుగోలు చేశారు. కానీ గ్రామానికి మాత్రం ఖాళీగా వచ్చారు. ఇది గమనించిన సిద్దిపేట జిల్లా పశువైద్యాధికారి అంజయ్య అక్కన్నపేట పోలీస్‌స్టేషన్‌లో వారిపై శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి లబ్దిదారులను విచారించారు. కొనుగోలు చేసి మార్గమధ్యలోనే అమ్మిన్నట్టు వారు తెలిపారు. దీంతో శనివారం 11 మందిని అరెస్టు చేశారు. శ్రీకాంత్ పరారీలో ఉన్నాడు. గొర్రెలను అమ్మకానికి మధ్య వర్తిత్వం వహించిన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ తెలిపారు. సమావేశంలో సీఐ శ్రీనివాస్‌జీ, ఎస్సైలు పాపయ్య నాయక్, దాస సుధాకర్ ఉన్నారు.

బీసీ బిల్లు కోసం మిలిటెంట్ పోరాటాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టేందుకు మిలిటెంట్ తరహాలో పోరాటాలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు.

చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు గాను పెద్ద ఎత్తున ఉద్యమాలు, రాస్తారోకోలు నిర్వహించాలని తెలిపారు. శనివారం బీసీ భవన్‌లో బీసీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సమస్యల పరిష్కారానికి గుజ్జర్లు, జాట్లు, పటేళ్ల తరహాలో కేంద్రంపై తెగించి పోరాడాలన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలలో చట్ట సభలలో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ తీర్మాణం చేయాలన్నారు.

పార్లమెంట్‌లో 36 రాజకీయ పార్టీలు ఉన్నా ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా బీసీల పక్షాన మాట్లాడటం లేదని విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో 56 శాతం ఉన్న బీసీలకు రాజకీయ రంగంలో 14 శాతం కూడా ప్రాతినిధ్యం లేకపోవడం శోచనీయమన్నారు.

చట్ట సభలలో తగిన ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల విద్య, ఉద్యోగ రంగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతున్నదని తెలిపారు. ఈ సమావేశంలో రాగ్యా అరుణ్‌కుమార్, గుజ్జ కృష్ణ, రాజేందర్, గుజ్జ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో నేతన్నలకు రుణమాఫీ

- 'చేనేత మిత్ర' నమోదు వేగవంతం చేయాలి
- 16 శాతం త్రిఫ్ట్‌ఫండ్ ప్రారంభం: చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ శైలజరామయ్యార్

నవతెలంగాణ-కరీంనగర్ టౌన్

త్వరలో చేనేత కార్మికులకు రుణమాఫీ కానుందని, దానికి సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోందని చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ శైలజ రామయ్యార్ తెలిపారు. చేనేత, పవర్‌లూం కార్మికుల సంక్షేమ పథకాలపై కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించినా అమలు కావట్లేదని చేనేత కార్మికులు ఆమెను ప్రశ్నించారు. దీనిపై శైలజ రామ



మాట్లాడుతున్న చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ శైలజరామయ్యార్

య్యార్ మాట్లాడుతూ..చేనేత మిత్ర (నూలు రాయితి) పథకం నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులు, సంఘాల ప్రతినిధులకు సూచించారు. చేనేత వస్త్రోత్పత్తిలో నూలు కొనుగోలుపై రాష్ట్ర ప్రభుత్వం 40శాతం రాయితీ కల్పిస్తున్నట్టు చెప్పారు. అందులో 35 శాతం కార్మికులు, 5 శాతం సంఘానికి జమ చేస్తామన్నారు. కార్మికులవారీగా ఆన్‌లైన్లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్మికునికి నెలకు 30 కిలోల వరకే నూలు రాయితీ పరిమితిపై ప్రతినిధులు ప్రశ్నించగా, నెల తరువాత సమస్యలుంటే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఇప్పటికే చేనేత కార్మికుని ఎనిమిది శాతం వాటాకు అదనంగా 16 శాతం ప్రభుత్వం నెలనెలా జమ చేస్తోందని గుర్తుచేశారు. నూలు రాయితీ ఇవ్వడం వల్ల కార్మికులు ఆర్థికంగా వృద్ధిలోకి వస్తారని, మరమగ్గాల కార్మికులకూ త్రిఫ్ట్‌ఫండ్ పథకాన్ని అమలు చేయనున్నామని తెలిపారు. కార్మికుడు నెలకు ఎనిమిది శాతం వాటా జమచేస్తే ప్రభుత్వం అంతే మొత్తం ప్రతినెలా జమచేస్తుందని, మార్చి నుంచి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మరమగ్గాల ఆధునీకరణ పథకం ఇన్‌సీటూ కింద పరికరాలు అందజేస్తున్నట్టు తెలిపారు. అందులో భాగంగా కరీంనగర్ జిల్లాలోని 90 మందికి లబ్ది చేకూరిందని గుర్తుచేశారు. సమావేశంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, టెస్కో జీఎం యాదగిరి, చేనేత, జౌళిశాఖ ఏడి ఎం. వెంకటేశం, ఆప్కో మాజీ డైరెక్టర్ సత్యనారాయణ, సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు రాంచంద్రం, వెంకటేశం, ప్రతినిధులు తిరుపతి, కార్మికులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పనుల్లో అపశృతి

- జేసీబీ కిందపడి వలస కూలీ మృతి

నవతెలంగాణ-హుజూరాబాద్ రూరల్

మిషన్ భగీరథ పనుల్లో భాగంగా పైపులను తరలిస్తుండగా జేసీబీ కింద పడి వలస కార్మికుడు చనిపోయాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం రంగాపూర్‌లో శనివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా కొత్తకోటకు చెందిన విరుగ దిండ్ల రాములు (25) ఆర్నెళ్లుగా మిషన్ భగీరథ పనుల్లో పనిచేస్తు న్నాడు. శనివారం సిర్సపల్లి క్రాస్‌రోడ్డు నుంచి రాజపల్లికి పైపులను జేసీబీ ద్వారా తరలిస్తుండగా అవి కదలకుండా రాములు పట్టుకున్నాడు. ఈ క్రమంలోనే ప్రమాదవశాత్తు వాహనం పైనుంచి కిందపడి కార్మికుడు అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తరలించేందుకు యత్నించారు. మృతుని తల్లిదండ్రులు వచ్చేవరకు మృతదేహాన్ని తరలించవద్దని తోటి కార్మికులు ఆందోళన చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సర్దిచెప్పి మృతదేహాన్ని పోలీసులు తరలించారు.



మృతి చెందిన రాములు

ఐఈఆర్పీలకు కనీసవేతనాలు ఇవ్వాలి

- ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి టీఐఈఆర్‌టీఏ వినతి

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు విద్యాబోధన చేస్తున్న ఐఈఆర్పీలకు కనీస వేతనాలు చెల్లించాలని తెలంగాణ ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రీసోర్స్ టీచర్స్ అసోసియేషన్ (టీఐఈఆర్‌టీఏ) ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు శనివారం ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆసంఘం నేతలు కలిసి వినతిపత్రం అందించారు. మూడేండ్ల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఐఈఆర్పీలకు వేతనాలు పెంచలేదనీ,

ఈ విద్యాసంవత్సరం ఎస్ఎస్ఏలోని అన్ని విభాగాలకూ పెంచి తమను మాత్రం విస్మరించారని యూనియన్ నేతలు చెప్పారు. పీఏబీలో నెలకు రూ.17,600 ఆమోదం చేసుకుని, రూ.15వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ఐఈఆర్పీలకు ఉద్యోగభద్రత కల్పించాలని, హెచ్‌ఆర్‌పాలసీని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నేతలు బోయ శ్రీనివాస్, టి ప్రవీణ్‌కుమార్, మల్లేశ్, పాషా ఉన్నారు.



'ఆనందం' చిత్రంలోని ఒక దృశ్యం

హ్యాపీడేస్‌ను మరిపించే ఆనందం

నూతన నటీనటులతో గణేష్‌రాజ్ దర్శకత్వంలో రూపొంది ఘన విజయం సాధించిన మలయాళ చిత్రం 'ఆనందం'. ఈ చిత్రాన్ని అదే పేరుతో సుఖీభవ మూవీస్ పతాకంపై ఎత్తరి గురురాజ్ తెలుగులో విడుదల చేస్తున్నారు. వీర వెంకటేశ్వర రావు (పెదబాబు), వీఆర్‌బీ రాజు, రవివర్మ చిలువూరి సహనిర్మాతలు. ఆర్.సీతారామరాజు సమర్పకులు. ఈ చిత్రం గురించి నిర్మాత ఎత్తరి గురురాజ్ మాట్లాడుతూ, 'కాలేజ్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం రూ.4కోట్లతో తెరకెక్కి రూ.20కోట్లు వసూలు చేసింది. ఆహ్లాదకరమైన కథతో, భారీ విజయంతో యువ హృదయాలను కొల్లగొట్టిన ఈ మలయాళ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఇందులో మాలీవుడ్ టాప్ హీరో నివిన్ పాల్ అతిథి పాత్రలో నటించడం విశేషం. ఈ చిత్ర రీమేక్ కోసం ఓ పెద్ద సంస్థ ఫ్యాన్సీ రేట్‌ను ఆఫర్ చేసింది. కానీ తెలుగు నేటివిటీకి సరిపోయే అంశాలు ఇందులో పుష్కలంగా ఉండటంతో అనువాదం చేసి విడుదల చేయాలనుకుంటున్నాం. సినిమా అంతా చాలా నేచురల్‌గా సాగుతుంది. ఎక్కడా ఓవర్ డ్రామా, మెలో డ్రామా, సినిమాటిక్ డ్రామా కనిపించదు. తప్పకుండా యువతను ఆకట్టుకుంటుంది. ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా నాలుగు రోజుల్లో ఏం జరిగిందనేది సినిమాలో ఆసక్తికరం. మూడు లవ్ స్టోరీలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయి. మలయాళ అగ్ర సంగీత దర్శకుడు సచిన్ వారియర్ వినసొంపైన సంగీతాన్ని అందించారు. వినేకొద్దీ వినాలపించేలా పాటలుంటాయి. మార్చి మొదటి వారంలో పాటలను, 16న సినిమాను విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. ఇది 'హ్యాపీడేస్'ను మరిపించే చిత్రమవుతుంది' అని అన్నారు. అరుణ్ కురియన్, థామస్ మాథ్యూ, రోషన్ మాథ్యూ, విశాక్ నాయర్, సిద్ధి మహాజన కట్టి, అన్ను ఆంటోని, అనార్కళి మరికర్, రెంజి ఫణిక్కర్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఆనంద్.ఇ.చంద్రన్.

యువతరాన్ని కనెక్ట్ చేసే సందేశాత్మక చిత్రం



నీరజ్, విజయరామరాజు, రాజ్ మాదిరాజు, జారా షా

రాజ్ మాదిరాజు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఐతే 2.0'. ఇంద్రనీల్ సేన్ గుప్తా, జారా షా, అభిషేక్, కర్తవ్య శర్మ, నీరజ్, మృణాల్, మృదాంజలి ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని ఫర్మ్ 9 పతాకంపై కె.విజయరామరాజు, డా॥హేమంత్ వల్లపురెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్ర మోషన్ పోస్టర్ విడుదల కార్యక్రమం శనివారం హైదరాబాద్‌లో వైభవంగా జరిగింది. అతిథిగా విచ్చేసిన నందిని రెడ్డి మాట్లాడుతూ, 'ఈ సబ్జెక్ట్ నాకు తెలుసు. సూపర్‌గా ఉంటుంది. విన్నప్పుడు రోమాలు నిక్కబొడిచాయి. నేటి తరానికి బాగా కనెక్ట్ అయ్యే చిత్రమిది. కచ్చితంగా కొత్తగా ఉంటుందని నమ్ముతున్నా' అని అన్నారు. 'రాజ్ మాదిరాజు నా సినిమాలకు పనిచేశాడు. తను మంచి టెక్నీషియనే కాదు, మంచి నటుడు కూడా. తెలుగులో ఇలాంటి సబ్జెక్ట్ రావడం అభినందనీయం' అని రాజ్ కందుకూరి తెలిపారు. చిత్ర దర్శకుడు రాజ్ మాదిరాజు చెబుతూ, 'ప్రస్తుతం మనమంతా ఆన్‌లైన్‌లోకి వెళ్ళిపోయాం. జీవితానికి సంబంధించిన ప్రతి విషయమూ మొబైల్ ఫోన్‌లో ఉంటోంది. ఇటీవల వి.వి.వి.ఎస్.లక్ష్మణ్ అకౌంట్ నుంచి పది లక్షల రూపాయలను హ్యాక్ చేశారు. అలాగే దేశ భద్రతకు సంబంధించిన డీఆర్‌డీఓ సమాచారం కూడా హ్యాక్‌కు గురైంది. ఈ నేపథ్యంలో ఫోన్స్‌ని కూడా హ్యాక్ చేస్తే పరిస్థితి ఏంటి?, ఆన్‌లైన్ సౌకర్యాల వెనుక పెద్ద ప్రమాదం దాగుందని తెలిపే చిత్రమిది. నలుగురు ఇంజనీరింగ్ పూర్తి చేసిన కుర్రాళ్లు కొన్నాళ్ళపాటు నిరుద్యోగులుగా ఉంటారు. దీంతో వాళ్ళలో వచ్చిన ఉక్రోశం ఎలాంటి పరిణామాలకు దారి తీసిందనేది సినిమాలో ఆసక్తికరం. సందేశాత్మకంగా రూపొందిస్తున్న చిత్రమిది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. మార్చి 16న సినిమాను విడుదల చేస్తున్నాం' అని అన్నారు.

థ్యాంక్స్ చెప్పడమే బిగ్గెస్ట్ కాంప్లిమెంట్



ప్రశాంత్ వర్మ

'సాధారణంగా ఏ సినిమా బాగున్నా. చూసినవారంతా బాగుందని ప్రశంసిస్తారు. కానీ 'అ' చూసి ఇలాంటి సినిమా తీసినందుకు థ్యాంక్స్ అని చెబుతున్నారు. అది నాకు బిగ్గెస్ట్ కాంప్లిమెంట్' అని అంటున్నారు దర్శకుడు ప్రశాంత్ వర్మ. నాని నిర్మించిన 'అ' చిత్రానికి ప్రశాంత్ వర్మ దర్శకుడు. కాజల్, నిత్యామీనన్, రెజీనా, అవసరాల శ్రీనివాస్, ప్రియదర్శి ప్రధాన పాత్రధారులుగా నటించారు. ఈ శుక్రవారం విడుదలైన సినిమాకు పాజిటివ్ టాక్ వస్తున్న నేపథ్యంలో శనివారం దర్శకుడు ప్రశాంత్ వర్మ మీడియాతో ముచ్చటించారు. 'మా సొంతూరు భీమవరం. ఇంజనీరింగ్ సెకండ్ ఇయర్ నుంచే లఘు చిత్రాలను తీయడం ప్రారంభించాను. పలు యాడ్ ఫిల్మ్ కూడా చేశా. 'అ' స్క్రిప్ట్‌తో నేనే తక్కువ బడ్జెట్‌లో కొత్తవాళ్ళతో సినిమా చేయాలనుకున్నాను. సినిమాలో చేప వాయిస్ కోసం నాని అయితే బాగుంటుందనిపించి ఆయన్ని కలిశా. స్క్రిప్ట్ నచ్చి సినిమాను నిర్మించడానికి ముందుకొచ్చారు. ఒక సెక్టార్ ఆడియెన్స్‌ను దృష్టిలో పెట్టుకుని తీసిన చిత్రమిది. అందరికీ నచ్చుతుందనుకోలేదు. బేసిక్‌గా ఇది తెలివితో కూడిన కథ. అన్ని వర్గాలకు కనెక్ట్ కాదు. రెండు, మూడు సార్లు చూడాల్సి వస్తుంది. కొత్తగా ట్రై చేశాం. మొదట ఈ కథ విని కొందరు తెలుగులో వద్దని, తమిళంలో చేసి తెలుగులో డబ్ చేయమన్నారు. అది ఎంత అవమానకరం. కొత్తగా చేయాలని, నెక్ట్స్ లెవెల్ సినిమాకిది స్ఫూర్తిగా నిలవాలని చేశాం. అదే సమయంలో నానికి ఓ మార్కెట్ ఉంది. ఆయన సినిమాలంటే ఓ ప్రత్యేకత ఉంటుంది. దాన్ని దృష్టిలో పెట్టుకుని నాని క్రెడిబులిటీని పాడు చేయకుండా కమర్షియల్‌గా తీసే ప్రయత్నం చేశాం. నాని కూడా కొన్ని ఇన్‌పుట్స్ ఇచ్చారు. తొలుత కాస్టింగ్‌కు సంబంధించి కొత్తవాళ్ళతోనే చేయాలనుకున్నాం. కాజల్ ఒప్పుకోవడంతోపాటు పెద్ద నటీనటులందరికీ కథ నచ్చి చేసేందుకు ముందుకొచ్చారు. రెజీనా పాత్ర కోసం చాలా స్పెషల్ కేర్ తీసుకున్నాం. ఆమెకు టాటూస్ వేయడానికి 12 గంటలు పట్టేది. షూటింగ్ టైమ్‌లో స్నానం కూడా చేయకుండా పనిచేయాల్సి వచ్చింది. డిప్రెషన్ వంటి సమస్యలను కూడా ఈ చిత్రంలో చూపించే ప్రయత్నం చేశాం. దాని వల్ల మహిళల్లో అవగాహన వస్తుందని ఆశిస్తున్నాం. ఈ చిత్రం ద్వారా టెక్నీషియన్లకు అవార్డులు కూడా వస్తాయని భావిస్తున్నాం. సినిమాకు మంచి స్పందన లభిస్తోంది. సినిమా బాగుంటే చాలా మంది బాగుందని చెబుతారు. కానీ ఈ చిత్రం చూసి ఇలాంటి కొత్త కాన్సెప్ట్‌తో సినిమా చేసినందుకు థ్యాంక్స్ చెబుతున్నారు. తాము కూడా చేసేందుకు ఇది పునాది అవుతుందని చెప్పడం ఆనందంగా ఉంది. ప్రసాద్స్, బెంగుళూరులోని పలు థియేటర్లలో ఆడియెన్స్ సినిమా అయిపోయాక స్టాండింగ్ ఓవేయేషన్ ఇవ్వడం గర్వంగా ఉంది. ఈ చిత్రం కంటే ముందే నేను ఇతర సినిమాలు చేయాల్సి ఉంది. అవి వర్కౌట్ కాలేదు. బేసిక్‌గా నా స్టయిల్ ఆఫ్ జోనర్ ఇది. మున్ముందు కూడా ఇలాంటి జోనర్‌లోనే సినిమాలు తీస్తా. అంతేకాదు నా దగ్గర 20, 30 కథలు రెడీగా ఉన్నాయి. 'స్క్రిప్ట్ విల్' పేరుతో కథలను అమ్ముతున్నాం. సమాజంలోని సంఘటనలే నా కథలకు స్ఫూర్తి' అని ప్రశాంత్ వర్మ చెప్పారు.

నవచిత్రం

పొలిటికల్ థ్రిల్లర్‌గా రంగస్థలం..!



రామ్‌చరణ్

రామ్‌చరణ్ చెవిటివాడిగా నటిస్తున్న 'రంగస్థలం' చిత్రం గ్రామీణ రాజకీయాల నేపథ్యంలో సాగుతుందట. సర్పంచ్ స్థాయి ఎన్నికల ప్రధానంగా ఈ చిత్రం ఉంటుందని సమాచారం. పొలిటికల్ థ్రిల్లర్‌గా సాగే ఈ చిత్రంలో చిట్టిబాబుగా రామ్‌చరణ్ ఏంచేశాడనేది ప్రస్తుతానికి సస్పెన్స్. అంతేకాదు చరణ్ తొలిసారి తనలోని కామెడీ యాంగిల్‌ను చూపించబోతున్నాడట. చెవిటి వాడిగా అయన పలికించే భావోద్వేగాలు కడుపుబ్బ నవ్విస్తాయట. ఈ చిత్రం మార్చి 30న విడుదల కానుంది.

ఆశాభోంస్లేకు యశ్‌చోప్రా జాతీయ అవార్డు ప్రదానం



ఆశాభోంస్లే, విద్యాసాగర్ రావు, టి.సుబ్బరామిరెడ్డి, రేఖా

లెజెండరీ సింగర్ ఆశాభోంస్లేకు అత్యంత ప్రతిష్టాత్మకమైన యశ్‌చోప్రా మెమొరియల్ జాతీయ అవార్డును అందజేశారు. 2018 సంవత్సరానికిగానూ టి.సుబ్బరామిరెడ్డి ఫౌండేషన్ అందజేసే ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం శుక్రవారం ముంబయిలో అత్యంత వైభవంగా జరిగింది. ఆశాభోంస్లేకు అతిథిగా విచ్చేసిన మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్ రావు అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో అలనాటి మేటినటి రేఖ, జయప్రద, పరిణీతి చోప్రా, పూనమ్ దిల్లాన్, జాకీ షరాఫ్ పాల్గొని ఆశా భోంస్లేకు అభినందనలు తెలిపారు. అంతేకాదు ఆమెతో తమకున్న అనుబంధాన్ని ఆహుతులతో పంచుకున్నారు. ఏడు దశాబ్దాల సుదీర్ఘ సినీ సంగీత ప్రస్థానంలో ఆశాభోంస్లే ఇప్పటి వరకు 20 భాషల్లో 11వేల పాటలు పాడి శ్రోతల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారు. యశ్‌చోప్రా జ్ఞాపకార్థం 2012లో టి.సుబ్బరామిరెడ్డి, అను రంజన్, శశి రంజన్ కలిసి ఈ అవార్డును స్థాపించారు. ఇప్పటి వరకు లతా మంగేష్కర్, అమితాబ్ బచ్చన్, రేఖ, షారూఖ్‌ఖాన్‌లకు అందజేశారు. 5వ పురస్కార గ్రహీతగా ఆశాభోంస్లే ఎంపికయ్యారు. ఈ అవార్డుతోపాటు పది లక్షల రూపాయల నగదును ఆశాకు అందజేశారు.



రాశీఖన్నా

వాయిదాలకు కారణం అదే..



రజనీకాంత్

రజనీకాంత్ నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మకమైన చిత్రం '2.0'. 'రోబో' తర్వాత శంకర్, రజనీ కాంబినేషన్‌లో వస్తోన్న చిత్రమిది. అమీ జాక్సన్ కథానాయికగా నటిస్తుండగా, అక్షయ్ కుమార్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని మొదట జనవరి 26న విడుదల చేయాలనుకున్నారు. వాయిదా వేసి తమిళ నూతన సంవత్సరం సందర్భంగా ఏప్రిల్‌లో రిలీజ్ చేయనున్నట్టు ప్రకటించారు. తాజాగా మరోసారి సినిమా విడుదలను వాయిదా వేసే ఆలోచనలో చిత్ర బృందం ఉందని సమాచారం. అందుకు కారణం సీజీ, వీఎఫ్ఎక్స్ ఆలస్యమవడమే. ఈ చిత్ర వీఎఫ్ఎక్స్ పనులను అమెరికాకు చెందిన ఓ సంస్థకు అప్పగించారు. ఈ సంస్థ దివాలా తీయడంతోపాటు ఇప్పటి వరకు చేసిన సీజీ వర్క్ విషయంలో కూడా దర్శకుడు శంకర్ సంతృప్తిగా లేరట. దీంతో త్రీడీ ఎఫెక్ట్స్‌తో సహా మొత్తం వీఎఫ్ఎక్స్ పనులు మళ్ళీ మొదట్నుంచి ప్రారంభించాలనే యోచనలో శంకర్ ఉన్నారట. దీంతో ఓ కొత్త సంస్థకు ఈ సీజీ పనులను అప్పగించనున్నట్టు తెలుస్తోంది. ఈ కారణంగానే ఇప్పటి వరకు సినిమాకు సంబంధించిన టీజర్, ట్రైలర్స్ కూడా విడుదల చేయలేదు. అన్ని పనులు పూర్తి చేసిన తర్వాతే టీజర్, ట్రైలర్‌తో సహా సినిమా విడుదల తేదీని ప్రకటిస్తారట. రెహ్మాన్ సంగీతం సమకూర్చిన ఈ చిత్రానికి సంబంధించిన పాటలను ఇటీవల దుబాయ్‌లో విడుదల చేసిన విషయం విదితమే. '2.0' వాయిదా పడుతున్న నేపథ్యంలో రజనీకాంత్ నటించిన మరో చిత్రం 'కాలా'ను ఏప్రిల్‌లో తమిళ కొత్త సంవత్సరం సందర్భంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 'కబాలి' వంటి బ్లాక్ బస్టర్‌ను అందించిన పా.రంజిత్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు.

తొలిసారి నితిన్ సరసన..!


ఈ ఏడాది ఇప్పటివరకు 'టచ్ చేసి చూడు', 'తొలిప్రేమ' వంటి బ్యాక్ టు బ్యాక్ రెండు చిత్రాలతో రాశీఖన్నా ప్రేక్షకులను అలరించింది. అందులో రవితేజ సరసన నటించిన 'టచ్ చేసి చూడు' అపజయాన్ని చవిచూడగా, 'తొలిప్రేమ' మంచి విజయాన్ని సాధించింది. అంతేకాదు ఈ చిత్రంలోని రాశీ నటనకు ప్రేక్షకులందరూ ఫిదా అయిపోయారు. రాశీ ఇప్పటివరకు చాలా చిత్రాల్లో నటించినప్పటికీ ఈ చిత్రంలోని పాత్ర మాత్రం అందర్నీ మెస్మరైజ్ చేసింది. ప్రస్తుతం తమిళ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్న రాశీ తాజాగా ఓ తెలుగు చిత్రంలో నటించేందుకు పచ్చజెండా ఊపిందని సమాచారం. తొలిసారి నితిన్‌కి జోడీగా 'శ్రీనివాస కళ్యాణం' చిత్రంలో రాశీ నటించనుందట. సతీష్ వేగ్నేష్ దర్శకుడు. దిల్ రాజు నిర్మించే ఈ చిత్రంలో ఇద్దరు కథానాయికలకు చోటుండటంతో మరో హీరోయిన్‌గా నందిత శ్వేతను ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందబోయే ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. నితిన్ ప్రస్తుతం 'ఛల్ మోహన్‌రంగ' చిత్రంలో నటిస్తుండగా, రాశీఖన్నా తమిళంలో 'సైతాన్ కా బచ్చా', 'ఇమైక్కా నోడిగల్', 'అగంగా మరు' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

సహజత్వ సన్నివేశాలు..



'దండుపాళ్యం 3' చిత్రంలోని ఒక దృశ్యం

బొమ్మాళి రవిశంకర్, పూజాగాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రవికాలే ప్రధాన పాత్రధారులుగా శ్రీనివాసరాజు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దండుపాళ్యం 3'. ఈచిత్రాన్ని సాయికృష్ణ ఫిల్మ్ సమర్పణలో వాడపల్లి వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై శ్రీనివాస్ మీసాల, రజని తాళ్లూరి సంయుక్తంగా తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, 'విభిన్నమైన కథాంశంతో సహజమైన సన్నివేశాలతో, భావోద్వేగపరమైన నటనతో 'దండుపాళ్యం' చిత్రాలు ఆకట్టుకుంటున్న విషయం విదితమే. అందులో భాగంగా మూడవ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఇదే ఈ సిరీస్‌కి చివరి చిత్రం. అద్భుతమైన కథ, కథనంతో దర్శకుడు శ్రీనివాసరాజు సినిమాను అత్యద్భుతంగా తెరకెక్కించారు. సన్నివేశాలు ఆడియెన్స్‌ను మెస్మరైజ్ చేస్తాయి. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది. 'దండుపాళ్యం' సిరీస్‌కి ఇదే చివరి సినిమా కావడంతో క్లైమాక్స్ ఎలా ఉండబోతుందోననే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. అందుకే ట్రేడ్‌లో విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. ఈ నెల 25న గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించి, మార్చి 2న సినిమాను విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అర్జున్ జన్యా, సినిమాటోగ్రఫీ: వెంకట్ ప్రసాద్, ఎడిటింగ్: రవిచంద్రన్.



జీరోలో కత్రినా మెరుపులు..



కత్రినా కైఫ్

కత్రినా కైఫ్ ప్రస్తుతం షారూఖ్ ఖాన్‌తో కలిసి 'జీరో' చిత్రంలో కథానాయికగా నటిస్తోంది. ఆనంద్. ఎల్. రాయ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం పాట చిత్రీకరణలో ఉంది. ఇందులో భాగంగా కత్రినాపై ఓ ప్రతిష్టాత్మక పాటను షూట్ చేస్తున్నారు. షూటింగ్ స్పాట్‌లోని కత్రినా ఫొటో ఒకటి సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. గోల్డ్ కలర్ కాస్ట్యూమ్స్‌తో పాటకు స్టెప్పులేయడానికి రెడీగా ఉన్న గెటప్‌లో కత్రినా మెరిసిపోతోంది. షారూఖ్ ఖాన్ మరుగుజ్జు పాత్రలో నటిస్తున్న ఈ సినిమాలో కత్రినాతోపాటు అనుష్క శర్మ మరో కథానాయికగా నటిస్తోంది. రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 21న విడుదల చేయనున్నారు. కత్రినా దీంతోపాటు 'థగ్స్ ఆఫ్ హిందూస్థాన్' చిత్రంలో అమీర్‌ఖాన్‌కి జోడీగా నటిస్తోంది.

చిదిమేస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)

ముందస్తు లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టం(పీసీపీఎన్‌డీటీ యాక్ట్)-1994ను రాష్ట్రాలు పటిష్టంగా అమలు చేయాలని నిటి ఆయోగ్ సూచించింది. అలాగే ఆడపిల్లల ప్రాముఖ్యతను తెలిపేందుకు తగిన కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నది. జనన లింగ నిష్పత్తిలో అసమానత బాలికా జననాలను అడ్డుకునేందుకు జరిపే అబార్షన్‌ల పెరుగుదలను సూచిస్తుందని నివేదిక వివరించింది. హెల్తీ స్టేట్స్, ప్రోగ్రెస్ ఇండియా పేరుతో నిటి ఆయోగ్ ఇటీవల విడుదల చేసిన నివేదికలో భాగంగానే లింగ వివక్షకు సంబంధించిన అంశాలను కూడా నిటి ఆయోగ్ పొందుపరిచింది. పెద్ద రాష్ట్రాల్లో అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోగా ఆరోగ్యకర రాష్ట్రాల్లో కేరళ, పంజాబ్, తమిళనాడు వరుసగా మొదటి స్థానాల్లో నిలిచిన విషయం తెలిసిందే.

పదవుల కోసమే పార్టీలు మారుతున్నరు

(మొదటిపేజీ తరువాయి)

కోసమే బీఎల్‌ఎఫ్ పోరాడుతోందన్నారు. జనాభాలో అతి తక్కువ శాతంగా ఉన్న రెండు సామాజిక వర్గాలే రాష్ట్రాన్ని పాలిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభాలో అధికంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం వర్గాల నుంచి చట్ట సభల్లో చాలా తక్కువ మంది ప్రతినిధులుగా ఉన్నారని తెలిపారు. వామపక్ష, బహుజనులను సంఘటితపరిచి అణగారిన వర్గాలకు రాజ్యాధికారం సాధించేందుకు పని చేస్తున్నామన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.రాములు మాట్లాడుతూ.. దళితులు, బహుజనుల మీద దాడులను అరికట్టాలంటే సంఘటితంగా పోరాడాలన్నారు. ఈనెల 20న సంగారెడ్డిలోని బాలాజీ గార్డెన్స్‌లో నిర్వహిం చనున్న బీఎల్‌ఎఫ్ బహిరంగ సభ సందర్భంగా లింగంపల్లి నుంచి సంగారెడ్డి వరకు ప్రదర్శన చేపడతామని చెప్పారు. ఈ బహిరంగ సభకు బీఎల్‌ఎఫ్ కన్వీనర్లు తమ్మినేని వీరభద్రం, మజీ దుల్లాఖాన్ ఫర్హత్, రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్, మద్దికాయల అశోక్, చుక్క రాములు, ఇతర నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.నాగయ్య, నాయకులు తాండ్ర కుమార్, రత్నయ్య, బీరం మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఎర్రజొన్న' నిరసనలు

- మద్దతు ధర కల్పించాల్సిందేనన్న రైతులు



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి/కమ్మర్‌పల్లి/ఆర్మూర్

ఎర్రజొన్న, పసుపు రైతులు ఆందోళన కొనసాగుతోంది. మద్దతు ధర ప్రకటించేవరకు నిరసన కొనసాగిస్తామని రైతులు భీష్మిస్తున్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, జక్రాన్‌పల్లి, కమ్మర్‌పల్లి రైతులు నల్లబ్యాడ్జీలు ధరించి శనివారమూ నిరసనలు చేపట్టారు. జక్రాన్‌పల్లి మండలంలోని 16 గ్రామాల రైతులు మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44 నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యా లయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఎర్రజొన్నలకు రూ.4500 మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, పసుపునకు రూ.15వేలు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎర్రజొన్నలను సింగిల్ విండోల ద్వారా కొనుగోలు చేయాలని, జొన్నలను రెండు నెలల 15రోజుల వరకు కొనుగోలు చేయాలని కోరారు. ప్రతి రైతుకు హెల్త్‌కార్డు, పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పసుపు బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని తహసీల్దార్ సతీష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కమ్మర్‌పల్లిలోని బస్టాండ్ ప్రాంతంలోనూ రైతులు అఖిలపక్షం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఆర్మూర్ పట్టణంలో రైతు జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. రైతుల ఆందోళన నేపథ్యంలో పోలీసు అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

26 నుంచి కాంగ్రెస్ బస్సు యాత్ర

- మార్చి 11 వరకు మొదటి విడత
- జూన్ 1న భారీ బహిరంగ సభ, రాహుల్ రాక

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

వచ్చే ఏడాది జరిగే సాధారణ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సమాయత్తమవుతున్నది. మూడు నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పర్యటించడానికి ప్రణాళిక సిద్ధం చేసుకుంది. బస్సుయాత్ర, పాదయాత్రతో పాటు రథయాత్ర కూడా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన గాంధీభవన్‌లో శనివారం ముఖ్య నేతల సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, వచ్చే ఏడాది జరిగే ఎన్నికలు, కాంగ్రెస్ కార్యచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఇందులో భాగంగా మొదటగా బస్సుయాత్ర చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. మూడు విడతలుగా యాత్రలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించి ప్రణాళిక కూడా సిద్ధం చేశారు. మొదటి విడతలోని ఈ బస్సు యాత్ర ఈ నెల 26న చేవెళ్లలో ప్రారంభం కానుంది. అదే రోజు 4 గంటలకు వికారాబాద్‌లో, 27న తాండూరు, సంగారెడ్డిలో 28న జహీరాబాద్, నారాయణ ఖేడ్‌లో ఈ బస్సు యాత్ర కొనసాగుతుంది. హోళీ కారణంగా మార్చి 1 నుంచి 3 వరకూ యాత్రను నిలిపివేస్తారు. 4వ తేదీ నుంచి 11 వరకూ యాత్ర కొనసాగుతుంది. 12 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్నందున యాత్రను నిలిపివేస్తారు. సమావేశాల తరువాత తిరిగి ఏప్రిల్ 1నుంచి ప్రారంభమయ్యే యాత్ర మే 15 వరకు కొనసాగుతుంది. ఈ యాత్ర రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాలలో పర్యటించే విధంగా షెడ్యూల్‌ను రూపొందిస్తున్నారు.

15 నుంచి పాదయాత్రలు

మే 15ను బస్సుయాత్ర ముగియడంతోనే.. రాష్ట్రవ్యాప్తంగా మూడు ప్రాంతాల నుంచి ఒకే సమయంలో పాదయాత్రలు ప్రారంభమవుతాయి. ఈ యాత్రలను టిపిసిసి కార్య నిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి, మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ ప్రారంభిస్తారు. అదే రోజు మాజీ ఎంపి ఎఐసిసి కార్యదర్శి వి.హనుమంతరావు రాష్ట్రంలో రథ యాత్ర ప్రారంభిస్తారు. ఈ యాత్రలు అన్ని జూన్ 1వ తేదీకి ముగించే విధంగా షెడ్యూల్‌ను రూపొందిస్తున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన ముందురోజు భారీ ఎత్తున బహిరంగ సభ నిర్వహిస్తారు. ఎక్కడ జరపాలన్నది నిర్ణయం తీసుకోలేదని, అయితే ఈ సభకు ఎఐసిసి అధ్యక్షుడు రాహుల్‌గాంధీ హాజరవుతారని టిపిసిసి ఒక ప్రకటనలో తెలిపింది.

భారత్ వీటో డిమాండ్‌కు మద్దతు

- అగ్ర రాజ్యాలతో అణు ఒప్పందానికి కట్టుబడి ఉంటాం : రౌహానీ

న్యూఢిల్లీ: ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్ చేస్తున్న వీటో(శాశ్వత సభ్యత్వం) డిమాండ్‌కు ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ మద్దతు తెలిపారు. అణు బాంబులు కలిగిన దేశాలకు వీటో హక్కు ఉన్నపుడు 130 కోట్ల భారత్‌కు ఆ హక్కు ఎందుకు ఇవ్వరు అని రౌహానీ ప్రశ్నించారు. భద్రతా మండలిలో అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్‌కు మాత్రమే వీటో హక్కు ఉన్న విషయం తెలిసిందే. 1980వ దశకంలో జరిగిన ఇరాన్-ఇరాక్ యుద్ధం గురించి మాట్లాడుతూ అది అప్పటి ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ నియంతృత్వ ధోరణి వల్లేనని రౌహానీ అన్నారు. అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో రౌహానీ ఈ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు అగ్ర రాజ్యాలతో చేసుకున్న అణు ఒప్పందానికి తమ చివరి శ్వాస వరకూ కట్టుబడి ఉంటామని హసన్ రౌహానీ స్పష్టం చేశారు. ఒవేళ అమెరికా ఆ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే విచారించాల్సి ఉంటుందంటూ రౌహానీ హెచ్చరించారు. 2015లో ఇరాన్‌తో అమెరికాతోపాటు బ్రిటన్,ఫ్రాన్స్, రష్యా, చైనా, జర్మనీ అణు ఒప్పందంపై సంతకాలు చేశాయి. సమగ్ర సంయుక్త కార్యాచరణ ప్రణాళిక(జేసీపీవోఏ) పేరుతో జరిగిన ఆ ఒప్పందం ప్రకారం ఇరాన్ చేపట్టిన వివాదాస్పద అణుశక్తి కార్యక్రమంపై పరిమితులు విధించారు. అందుకు అనుగుణంగా ఇరాన్‌పై విధించిన ఆర్థిక ఆంక్షలను అగ్ర రాజ్యాలు సడలించాయి

సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకల్లో అపశృతి

టపాసులు పేలి టెంట్‌కు మంటలు

- వేదిక పైనుంచి క్షేమంగా బయటపడిన మంత్రి, ఎమ్మెల్యే
- మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఘటన



నవతెలంగాణ- మంచిర్యాల

సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. బీసీ సంక్షేమ, అటవీశాఖ మంత్రి జోగురామన్న, మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు పాల్గొన్న వేదికపై అగ్నిప్రమాదం జరిగింది. టెంట్‌కు నిప్పంటుకోవడంతో భారీగా మంటలు ఎగిశాయి. వెంటనే గమనించిన మంత్రి సెక్యూరిటీ సిబ్బంది ఆయనను బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో శనివారం జరిగింది.

గాంధీనగర్‌లో మున్నూరుకాపు సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమానికి మంత్రి రామన్న హాజరయ్యారు. అనంతరం సీఎం కేసీఆర్ జన్మదిక వేడుకలు నిర్వహించారు. మంత్రి కేక్ కట్ చేశాక, అక్కడ పెద్దఎత్తున బాణసంచా పేల్చారు. ఈ క్రమంలో మంత్రి వేదికపై ఉండగానే టపాసుల నుంచి నిప్పురవ్వలు ఎగిసి షామియానాపై పడ్డాయి. ఒక్కసారిగా మంటలు చెలరేగి, నిమిషాల్లోనే వేదికపైకి వ్యాపించాయి. కుర్చీలు, అక్కడి వస్తువులు కాలి బూడిదయ్యాయి. వెంటనే స్పందించిన మంత్రి సెక్యూరిటీ సిబ్బంది సభా ప్రాంగణంలో ఉన్న మంత్రిని, ఎమ్మెల్యే దివాకర్ రావును బయటకు తీసుకొచ్చారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అంతకుముందు మంచిర్యాల జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మెన్ నల్ల శంకర్ అధ్యక్షతన జరిగిన భూమిపూజ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. త్వరలో హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ సంఘం భవన నిర్మిస్తామని తెలిపారు. కాపు సంఘం భవన నిర్మాణం కోసం రూ.50లక్షల పది గుంటల స్థలాన్ని విరాళంగా ఇచ్చిన బొలిశెట్టి రాజలింగును మంత్రిరామన్న సమక్షంలో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నల్లాల ఓదెలు, పుట్ట మధు, దుర్గం చిన్నయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రెణికుంట్ల ప్రవీణ్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోరియం రాజారాం పాల్గొన్నారు.

కమ్యూనిస్టులు ఏకమవ్వాలి

నవతెలంగాణ-ఖమ్మం ప్రతినిధి

'ప్రపంచంలో పెట్టుబడిదారీ విధానం పదేండ్లుగా తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయింది. దేశంలో ఐదు లక్షల కోట్ల ప్రజాధనాన్ని మోడీ కార్పొరేట్లకు రాయితీలుగా ఇచ్చారు. ఎన్నడూ లేని విధంగా దేశంలో దళితులపైనా, మైనారిటీలపైనా దాడులు తీవ్రమయ్యాయి. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టులు ఏకమై ప్రజా ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం ఉంది' అని సీపీఐ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. సీపీఐ ఖమ్మం జిల్లా 21వ మహాసభల సందర్భంగా శనివారం ఖమ్మంలో బహిరంగ సభ నిర్వహించారు. సభలో సురవరం మాట్లాడుతూ..ఆర్థిక సంక్షోభం ద్వారా వ్యక్తులు, కుటుంబాలు కాకుండా ఏకంగా దేశాలే తీవ్ర అప్పుల్లోకి కూరుకుపోతున్నాయన్నారు. మితవాదులు, ఫాసిస్టులు ఇదే సమయంలో అధికారంలోకి రావడానికి ప్రయత్నాలు చేస్తున్నార న్నారు. ట్రంప్ అమెరికా అధ్యక్షునిగా అయిన తరువాత మానవాళికి ప్రమాదం కలిగించే అనేక దుష్ట రాజకీయ కార్యక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ట్రంప్ ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా ఉందన్నారు. ప్రపంచంలోని 200దేశాలు ఐక్యరాజ్యసమితి వేదికగా ఒక్కటై సంతకాలు చేసిన వాతావరణ సమతుల్యత పాటించే ఒప్పందాన్ని ట్రంప్ ఉల్లంఘించాడని, అతని దుర్మార్గానికి అది నిదర్శనమని అన్నారు. మన దేశంలో మితవాద, మతోన్మాద, పెట్టుబడి దారీ విధానాలను ప్రోత్సహించే బీజేపీ నాయకత్వాన ఎన్‌డీఏ కూటమి పనిచేస్తోందన్నారు. బీజేపీ అధికారంలోకి రాకముందు ఒక శాతం మంది చేతిలో దేశ సంపద 49శాతం కేంద్రీకృతమై ఉంటే..నేడు ఏకంగా 73శాతం వెళ్లిపోయిందన్నారు. ఇది కమ్యూనిస్టులు చెప్పే మాటలు కావనీ, అంతర్జాతీయ సంస్థలు చేసిన సర్వేలో తేటతెల్లమైందనీ చెప్పారు. పంటలకు గిట్టుబాటు ధరల్లేక అనివార్యంగా రైతులు అప్పుల పాలయ్యారన్నారు. బ్యాంకులను దివాళా తీయించే చర్యలకు పాల్పడ్డారన్నారు. రాష్ట్రంలో నిజాంను తలపించే రీతిలో కేసీఆర్ పాలన సాగుతోందని ఎద్దేవా చేశారు. బంగారు తెలంగాణ పేరు జపిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. దేశంలో, రాష్ట్రంలో వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులను ఏకం చేయాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ..కేసీఆర్ పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామని, అందుకోసం భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు. సీపీఐ(ఎం)తోపాటు, తెలంగాణ రాజకీయ జేఏసీతో పాటు కలిసొచ్చే వామపక్ష పార్టీలను కలుపుకుని కుటుంబపాలనకు చరమగీతం పాడుతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి బాగం హేమంతరావు, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

'కంది' కష్టాలు

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రప్రభుత్వం కొనుగోలు చేసి దులుపుకున్నది. మిగతాది తమకు సంబంధం లేదని చేతులెత్తేసిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రులు హరీశ్‌రావు, పోచారం శ్రీనివాసరెడ్డి అధికారులతో సమావేశమై రాష్ట్ర ప్రభుత్వమే ప్రతి గింజ లేకుండా కొనుగోలు చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరి పట్ల మండిపడ్డారు. కొనుగోలుకు సంబంధించి మొత్తంగా రూ. 410 కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు రూ. 226 కోట్లు విడుదల అయ్యాయని, ఆ డబ్బులు మొత్తం రైతులు చెల్లించామని అధికారులు చెబుతున్నారు. ఇంకా రూ.184 కోట్లు రావాల్సి ఉందని చెప్పారు. శుక్రవారం నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 5976 మంది రైతుల నుంచి రూ.29 కోట్ల91 లక్షల 69వేల 575 విలువ చేసే కందులు కొనుగోలు చేసినట్టు మార్క్‌ఫెడ్ అధికారులు తెలిపారు. ఇంకా లక్షన్నర టన్నుల కందులు కొనుగోలు చేయాల్సి ఉంది. కొనుగోలు పరిమితిని మార్చి 31 వరకు పొడిగించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది.

దళారులదే హవా

కందుల కొనుగోలు వ్యవహారంలో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరుగుతున్నది. ప్రభుత్వం కందులను మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు 113 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. అయితే ఈ విషయంలో దళారులు అక్రమాలకు తెరలేపారు. రైతుల నుంచి ముందే రూ. 4వేల చొప్పున కొనుగోలు చేసుకున్నారు. మద్దతు ధర కింద రూ. 5,450కి అమ్ముకుంటున్నారు. అంటే క్వింటాలుకు దళారీలు రూ. 1500 లాభం పొందుతున్నారు. రైతులను పావులుగా ఉపయోగించుకుంటూ దళారులే దందా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు చేతి వాటంతో మహబూబ్‌నగర్, గద్వాల, నిజామాబాద్, వరంగల్, వికారాబాద్, నల్లగొండ జిల్లాల్లో వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలన్న చందంగా సాగుతున్నదని రైతు సంఘాల నేతలు చెబుతున్నారు. ఈ జిల్లాల్లో అనేక అవకతవకలు జరిగినట్టు టాస్క్‌ఫోర్స్ అధికారులు కూడా నిర్ధారించారు. మార్క్‌ఫెడ్, హాకా కొనుగోలు చేసిన కందుల్లో 30 శాతం దళారుల నుంచే వచ్చినట్టు సమాచారం. పంట వేసే సమయంలో కమీషన్ ఏజెంట్ల వద్ద రైతులు అప్పులు తీసుకోవడం అందరికీ తెలిసిందే. తర్వాత వచ్చిన పంటను తిరిగి వారికే విక్రయించి అప్పుపోనూ మిగిలిన సొమ్ము తీసుకుంటారు. ఈ క్రమంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కొనుగోలు కేంద్రాలుగా వ్యవహరిస్తున్న ప్రాంతాల్లోనూ అక్రమాలు చోటు చేసుకుంటున్నట్టు అధికారులు గుర్తించారు. కేంద్రం అంగీకరించిన మేరకు కందులు కొనుగోలు చేశామని మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. పాత నిల్వలు తక్కువ ధరకే మార్కెట్‌లోకి రావడంతో ధర ఇప్పట్లో పెరిగే సూచన లేదని మార్కెటింగ్ శాఖ చెబుతున్నది.

కాన్సెప్టే నాది.. నేను తీయలే : వర్మ



(మొదటిపేజీ తరువాయి)

రెండు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో సీసీఎస్‌కు వచ్చారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు పోలీసులు విచారించారు. డీసీపీ అవినాష్‌మహంతి ముందు హాజరైన వర్మ ఆ తర్వాత అదనపు డీసీపీ రఘువీర్ వద్దకు వెళ్లారు. సుదీర్ఘ విచారణలో పోలీసులు 30 ప్రశ్నలను సంధించారు. జీఎస్‌టీ (గాడ్ సెక్స్ అండ్ ట్రూత్) కాన్సెప్ట్ మాత్రమే తనదని, దర్శకత్వం వహించలేదని, అవసరమైనప్పుడు మాత్రమే స్కైప్ కెమెరా ద్వారా డైరెక్షన్ చేశానని చెప్పారు. ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో పోస్ట్‌చేసిన మాల్కోవా నగ్న ఫొటోలు పోలాండ్‌లో తీసినవిగా వర్మ చెప్పారని, హీరోయిన్ మరో సినిమా షూటింగ్‌లో ఉండటంతో అక్కడికి వెళ్లి కాన్సెప్ట్ గురించి మాట్లాడిన సమయంలోనే ఆ ఫొటోలు తీసినట్టు విచారణలో తెలిపాడని అదనపు డీసీపీ రఘువీర్ తెలిపారు. పోలాండ్, యూకేలో జీఎస్‌టీ చిత్రీకరణ జరిగిందని వర్మ చెప్పాడని, ఆయా దేశాలకు వర్మ వెళ్లడంపైనా విచారణ చేస్తున్నామని తెలిపారు. పాస్‌పోర్టు వివరాలపై దృష్టిసారించామన్నారు. ఫొటోగ్రఫీ, డైరెక్టర్ ఎవరన్న దానిపై ఆరా తీస్తున్నామన్నారు. మరోవైపు సత్యమేవ జయతే వ్యాఖ్యలను మహిళా ఫొటోలను వెనుకాల పెట్టినందుకుగాను వివరణ కోరగా, అది తప్పని తెలియదని వివరణ ఇచ్చాడని రఘువీర్ తెలిపారు. భారత పౌరసత్వం ఉన్నవారు మహిళలను కించపరుస్తూ ఏ దేశంలో సినిమా తీసినా చట్టప్రకారం నేరమే అవుతుందన్నారు. సీజ్ చేసిన ల్యాప్‌టాప్‌లో జీఎస్‌టీ సినిమా లింకులపై ఆరా తీస్తున్నామన్నామని చెప్పారు. వర్మ ఎవరెవరిని సంప్రదించాడనే కోణంలో విచారిస్తున్నామన్నారు.

కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు వర్మ సమయం కోరాడని, దీంతో శుక్రవారం తిరిగి విచారణకు హాజరుకావాలని ఆదేశించామని తెలిపారు. ల్యాప్‌టాప్‌ను ఎఫ్‌ఎస్‌ఎల్‌కు పంపించామన్నారు. ఆ రిపోర్టు ఆధారంగా తదుపరి విచారణ కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. జీఎస్‌టీ సినిమాకు మ్యూజిక్ అందించిన కీరవాణికి పోలీసులు నోటీసులు జారీ చేయనున్నట్టు తెలిసింది. నేరం రుజువైతే వర్మకు మూడేండ్ల నుంచి ఏడేండ్ల వరకు శిక్షపడే అవకాశముందని ఓ సీనియర్ పోలీస్ అధికారి అభిప్రాయపడ్డారు. వర్మను విచారిస్తున్న నేపథ్యంలో దేవి స్పందిస్తూ వర్మ కేసును సీరియస్‌గా తీసుకోవాలని పోలీసులను కోరారు. వర్మ కేసు విచారణ నేపథ్యంలో సీసీఎస్ పోలీస్‌స్టేషన్ వద్ద భారీ భద్రత ఏర్పాటుచేశారు. సీసీఎస్‌లోని సైబర్‌క్రైమ్, మహిళా పోలీస్‌స్టేషన్ల వైపు గేట్లు మూసేయడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులెదుర్కొన్నారు. ఈ విషయాన్ని డీసీపీ అవినాష్ మహంతి దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన మహిళా స్టేషన్‌కు వచ్చేవారిని లోనికి అనుమతించాలని సిబ్బందిని ఆదేశించారు.

వర్మను శిక్షించాల్సిందే : సామాజిక వేత్తలు దేవి, మణి

మహిళలను కించపరిచే విధంగా జీఎస్టీ తీసిన వర్మను నిర్భయ చట్టం కింద శిక్షించాలని సామాజికవేత్తలు దేవి, మణి డిమాండ్ చేశారు. వర్మతో మాట్లాడే ప్రసక్తేలేదన్నారు. మహిళల పట్ల ఆయనకున్న చులకన భావం క్షమించరాని నేరమన్నారు. వెంటనే ఆయనను కఠినంగా శిక్షించాలి.

బాధపడి ఉంటే క్షమించండి : వర్మ

ఓ చర్చావేదికలో తాను చేసిన వ్యాఖ్యలకు సామాజిక కార్యకర్తలు దేవి, మణి బాధపడి ఉంటే క్షమించాలని కోరారు. జీఎస్టీని నిర్మించడంలో ఏ తప్పు కూడా చేయలేదని అన్నారు. జీఎస్టీ-2 కూడా తీస్తానన్నారు. జీఎస్టీ-2 కంటెంట్‌పై వివరించేందుకు ఆయన నిరాకరించారు.

ఇంటర్ పరీక్షలు యథాతథం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు అనుకున్న సమయానికి యథావిధిగా జరుగుతాయని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో విద్యాశాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇంటర్, డిగ్రీ పరీక్షలను బహిష్కరిస్తున్నా మని ప్రయివేటు విద్యాసంస్థల జేఏసీ ప్రకటించిన విషయం తెలిసిందే. అనంతరం మీడియాతో కడియం శ్రీహరి మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలను వాయిదా వేసే ప్రసక్తే లేదన్నారు. పరీక్షల నిర్వహ ణకు సంబంధించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నా మని వివరించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే వీలై నన్ని ఎక్కువ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇన్విజిలేటర్లుగా ప్రభుత్వ ఉపాధ్యాయుల సేవలు వినియోగిస్తామని అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం ప్రయ త్నిస్తోందని చెప్పారు. 2016-17 ఆర్థిక సంవత్సరా నికి సంబంధించి ఫీజులు చెల్లించామన్నారు. 2017-18కి చెందిన మొదటి త్రైమాసికం నిధులు కొన్ని విడుదల చేశామని చెప్పారు. మిగిలిన నిధుల విడుదలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలకు సంబంధించిన నిబంధనలను సులభతరం చేశామని చెప్పారు. అయినా యాజమాన్యాలు పరీక్షలను కావాలనే బహిష్కరిస్తున్నాయని అన్నారు. పక్కా భవనాలు లేకున్నా, ఫైర్‌సేఫ్టీ సర్టిఫికెట్లు లేకున్నా, నిబంధనలు పాటించకపోయినా అఫిడవిట్ తీసుకొని అనుబంధ గుర్తింపు ఇచ్చామన్నారు. ప్రయివేటు కాలేజీల సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పరీక్షల నిర్వహణకు యాజమా న్యాలు సహకరించాలని కోరారు. అంతకుముందు సమీక్షలో వచ్చిన అంశాలను ప్రకటన ద్వారా ఆయన విడుదల చేశారు. ప్రభుత్వ ఉన్నత, జిల్లా పరిషత్ పాఠశాలలు, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, మోడల్ స్కూళ్లు, గురుకుల పాఠశాలల్లో ప్రస్తుతం ఫర్నీచర్ బాగుందని తెలిపారు. వీలైనంత వరకు పరీక్షా కేంద్రాలు అక్కడే ఏర్పాటు చేసే అంశాన్ని అధికారులు పరిశీలించాలని కోరారు. పరీక్షల నిర్వహణ, పేపర్లు దిద్దడం పూర్తిస్థాయిలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో, మైనార్టీ సంస్థల్లో సహకరించే ఇతర విద్యాలయాల్లో నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా పరీక్షల నిర్వహణ జరిగేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి తీసుకెళ్తా : ప్రయివేటు యాజమాన్యాలతో కడియం

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరిని ప్రయివేటు విద్యాసంస్థల జేఏసీ చైర్మెన్ జింజల రమణారెడ్డి నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, ఇంటర్, డిగ్రీ, పీజీ కోర్సుల ఫీజుల పెంపు అంశాలకు సంబంధించి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్టు తెలిసింది.

సీసీఈపై తలో మాట!

- బదిలీలు, ప్రమోషన్లు పెట్టాల్సిందేనన్న యూనియన్స్
- ఏప్రిల్‌లో చర్చిద్దామన్న డిప్యూటీసీఎం
- మ్యాథ్స్, సైన్స్ పంచాయితీపై క్లారిటీ కరువు
- అక్షరాస్యత పెంపునకు సహకరించాలి: కడియం శ్రీహరి



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

నిరంతర సమగ్ర మూల్యాంకనం(సీసీఈ) విధానంపై ఉపాధ్యాయ సంఘాల్లో ఏకాభిప్రాయం రాలేదు. ఈ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ టీచర్స్ జేఏసీ కోరితే, ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ మాత్రం (యూఎస్‌పీసీ) లోపాలను సరిచేసి సీసీఈని కొనసాగించాలని సూచించింది. టీచర్స్ యూనియన్ జాక్టో ఈ అంశంపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో సీసీఈ విధానంపై ప్రభుత్వం, విద్యాశాఖ ఎటూ తేల్చుకోలేని స్థితి ఏర్పడింది. సచివాలయంలో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి సమక్షంలో మూడు ఉపాధ్యాయ సంఘాల జేఏసీలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను సేకరించారు. ప్రధానంగా బదిలీలు, ప్రమోషన్లు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలు డిప్యూటీ సీఎం కడియం శ్రీహరిని కోరాయి. టీఆర్టీ నియామకాల కు ముందే ఈప్రక్రియ పూర్తి చేస్తానని ఆయన హామీ నిచ్చారు. దీనిపై ఏప్రిల్‌లో జరిగే సమావేశంలో సమగ్రంగా చర్చిద్దామని చెప్పారు. అయితే గణితం, మ్యాథ్స్ పీరియేడ్ల పంచా యితీ ఎటూ తేలలేదు. రెండు, మూడు రోజుల్లో దీనిపై స్పష్టత ఇస్తామని కడియం ఉపాధ్యాయ నేతలకు తెలిపారు. పాఠశాలల్లో ఆప్షనల్ హాలిడేస్ వినియోగం, ప్రాథమిక పాఠశాలల్లో సెలవుల మంజూరు, మోడల్ స్కూళ్లలో ఇంక్రిమెంట్లు, సెలవుల మంజూరు తదితర అంశాల్లో పాత విధానాన్నే కొనసాగిస్తామని కడియం శ్రీహరి తెలిపారు. కొన్ని పాఠశాలల్లో టీచర్ల గైర్హాజర్‌పై ఫిర్యాదు అందుతున్నా యనీ, వీటిపై ఉపాధ్యాయ సంఘాలు దృష్టిసారించాల ని డిప్యూటీసీఎం కోరగా, అలాంటి వారిపై చర్యలు తీసు కోవాలని యూనియన్లు కూడా సూచించాయి. అయితే పర్యవేక్షణ కూడా పెంచి, టీచర్లలో వర్క్‌కల్చర్‌ను ప్రోత్స హించేలా చూడాలని కోరాయి. సమావేశంలో 2018-19 నూతన అకాడమి క్ క్యాలెండర్‌కు అన్ని సంఘాలు ఆమోదం తెలిపాయి. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ... ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడేందుకు సమిష్టిగా పనిచేద్దామని అన్నారు. జాతీయ అక్షరాస్యత సగటు కంటే తెలంగాణ రాష్ట్రం వెనుకబడి ఉందనీ, అక్షరాస్య తను పెంచేందుకు ఉపాధ్యాయుల సహకరించాలని కోరారు. పదో తరగతి పరీక్షలో ఉత్తమ ఫలితాలు తీసు కొచ్చేందుకు సమిష్టిగా పనిచేయాలన్నా రు. ఏకీకృత సర్వీసుల విషయంలో తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందనీ, వీలైనంత త్వరలో దీనిని పరిష్కరిం చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

యూఎస్‌పీసీ నాయకులు చావ రవి, సీహెచ్ రాములు, మైస శ్రీని వాస్, ఎం రఘుశంకర్‌రెడ్డి, పోచయ్య, జాడి రాజన్న, మధుసుదన్‌రావు, మసూద్ అహ్మద్, టీటీజేఏసీ నేతలు సరోత్తంరెడ్డి, జాక్టో నేతలు భుజంగరావు, రఘునందన్, చెన్నయ్య, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, పాఠశాల విద్యా శాఖ కమిషనర్ కిషన్, ఆయా విభాగాల డైరెక్టర్లు పాల్గొన్నారు.

భారత్-ఇరాన్ మధ్య 9 ఒప్పందాలు

న్యూఢిల్లీ: భారత్-ఇరాన్ తొమ్మిది ఒప్పందాలపై సంతకాలు చేశాయి. భారత్‌లో పర్యటిస్తున్న ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీతో ప్రధాని మోడీ శనివారం భేటీ అయి ఇరు దేశాల మధ్య సహకారంపై చర్చించారు. ఈ సందర్భంగా ఇరు దేశాల అధికారులు 9ఒప్పందాలపై సంతకాలు చేశారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, ఈప్రాంత రక్షణ,భద్రత అంశాలపై ఇరు దేశాల అధినేతలు చర్చించినట్టు విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రవీశ్‌కుమార్ ట్వీట్ చేశారు. ఇరు దేశాల మధ్య నేరస్తుల అప్పగింత, వీసాలను సరళతరం చేయడం సహా ద్వంద్వ పన్నుల విధానాన్ని నిరోధించడం, వ్యవసాయరంగంలో సహకారం, ఓడరేవు లీజుకు సంబంధించిన అంశాల్లో ఒప్పందాలు కుదిరినట్టు రవీశ్‌కుమార్ తెలిపారు.

ఈ సందర్భంగా ఇరు దేశాల అధినేతలు మీడియాతో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణావంటి సవాళ్లపై చర్చించినట్టు ప్రధాని మేడీ వెల్లడించారు. ఉగ్రవాదం, తీవ్రవాదంపై పోరాటం పట్ల తమకు అవగాహన ఉన్నదని రౌహానీ తెలిపారు. ప్రాంతీయ వైరుధ్యాలను దౌత్యపరంగా, రాజకీయ సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవా లని రౌహానీ సూచించారు. చాబహార్ పోర్టు అభివృద్ధి కోసం వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నారంటూ రౌహానీని ప్రధాని మోడీ అభినందించారు.

సెన్సెక్స్ ▼287 34,010

నిఫ్టీ ▼93 10,452

డాలరుకు రూపాయి విలువ 64.21



బంగారం(10.గ్రా) రూ. 30,812



వెండి (కేజీ) రూ. 40,600



కోడిగుడ్లు			
హైదరాబాద్	368	విజయవాడ	374
ఒక్కగుడ్డుకు	4.30	చెన్నై	397
వరంగల్	370	ముంబయి	410



ఫెయిర్‌ఫాక్స్ చేతికి సీఎస్‌బీ

న్యూఢిల్లీ: కేరళా కేంద్రంగా పని చేస్తున్న క్యాథలిక్ సిరియన్ బ్యాంక్‌లో(సీఎస్‌బీ) కీలక వాటాను ఫెయిర్‌ఫాక్స్ ఇండియా హోల్డింగ్స్ సంస్థ చేజిక్కించుకోనుంది. ప్రవాస భారతీయుడు, కెనడాలో నివసిస్తున్న ప్రేమ్‌వత్సాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ సంస్థ మొత్తం రూ.1200 కోట్లు చెల్లించి సీఎస్‌బీలో కీలక వాటాను సొంతం చేసుకోనుంది. శనివారం సమావేశమైన సీఎస్‌బీ బోర్డు ఫెయిర్‌ఫాక్స్ ప్రతిపాదనకు సమ్మతి తెలిపింది. వాటా కొనుగోలుకు సంబంధించి ఇరు పార్టీల వారు వచ్చే వారం ఒక అవగహా పత్రంపై సతకం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. బ్యాంకులోని దాదాపు 51 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు గాను ఫెయిర్‌ఫాక్స్ సంస్థ నిరంతరాయంగా ఆసక్తి కనబరుస్తూ వచ్చిందని.. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల వారికి సమ్మతమైన ధర వద్ద 51 శాతం వాటా విక్రయానికి తాము అంగీ కరించినట్టుగా బ్యాంక్ చైర్మెన్ టి.ఎస్. అనంతరామన్ తెలిపారు. షేరు ఒక్కింటికి రూ.140 చొప్పున వాటాను కొనుగోలు చేసేందుకు గాను ఫెయిర్ ఫాక్స్ అంగీకారం తెలిపింది. అయితే ఈ విలీనానికి సంబంధంచి పలు అనుమతలు ఇంకా లభించాల్సి ఉందని ఆయన తెలిపారు.

డబ్బులు కట్టమని కోరలేదు: ఆర్‌బీఐ

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో (పీఎన్‌బీ) వెలుగు చూసిన ఘరానా మోసం నేపథ్యంలో తాము ఆ బ్యాంకుపై కత్తిగట్టినట్టు వస్తున్న వార్తలను భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) తోసిపుచ్చింది. పీఎన్‌బీ జారీ చేసిన లెటర్స్ ఆఫ్ అండర్‌స్టాండింగ్‌లకు (ఎల్‌వోయూ) అనుగుణంగా.. ఆయా బ్యాంకులు మోడీకి చెల్లించిన రుణ మొత్తాలను వెంటనే చెల్లించాలంటూ తాము ఆదేశాలను జారీ చేసినట్టు కొన్ని మీడియా సంస్థల్లో వార్తలు రావడం పట్ల ఆర్‌బీఐ సీరియస్ అయింది. పీఎన్‌బీకి తాము ఇలాంటి ఆదేశాలను జారీ చేయలేదని ఆర్‌బీఐ తన వెబ్‌సైట్‌లో వెల్లడించిన ఒక ప్రకటనలో తెలిపింది. పీఎన్‌బీలో వెలుగు చూసిన మోసానికి సంబంధించి పూర్తి నష్టాన్ని తాము అంచనా వేస్తున్నామని.. అవసరాన్ని బట్టి తగిన చర్యలకు దిగుతామని ఆర్‌బీఐ ప్రకటించింది. అంతర్గత నిఘా లోపించడం.. ఒక్కరిద్దరు ఉద్యోగులు చేసిన దష్ చర్యల వల్లే పీఎన్‌బీలో భారీ మోసం జరిగిందని ఆర్‌బీఐ పేర్కొంది.

వేడెక్కుతోన్న పీఎన్‌బీ స్కామ్!

- కీలక పాత్రదారులు అరెస్ట్ • సీబీఐ కోర్టు ముందు హాజరు • 14 రోజుల రిమాండ్‌కు ఆదేశం
- కొనసా..గిన ఏజెన్సీల సోదాలు • ఆర్‌బీఐ స్టాఫ్ పాత్రపై నజర్ • పలు కీలకాంశాలు వెలుగులోకి
- ఎన్‌డీఏపై ప్రతిపక్షాలు గుర్రు- ఆ పాపం యూపీఏదే: ఎన్‌డీఏ • జాయింట్ పార్లమెంటరీ విచారణకు పోదాం: కాంగ్రెస్



న్యూఢిల్లీ: దేశంలోని రెండో అతిపెద్ద విత్త సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో (పీఎన్‌బీ) జరిగిన ఘరానా మోసానికి సంబంధించి శనివారం పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. మరోవైపు ఈ భారీ కుంభకోణంలో కీలక పాత్ర పోషించిన బ్యాంకు అధికారులను సీబీఐ శనివారం అదుపులోకి తీసుకుంది. ప్రధాన సూత్రదారుడు, ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్‌మోదీకి సహకరించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి పీఎన్‌బీ డిప్యూటీ మేనేజర్ గోకుల్ నాథ్ శెట్టిని, పీఎన్‌బీ ఎస్‌డబ్ల్యూవో మనోజ్ ఖారత్‌ను, నీరవ్ మోదీ గ్రూప్ సంస్థలకు అధికారిక సంతకందారు హేమంత్ భట్‌ను సీబీఐ అరెస్ట్ చేసింది. ఎటువంటి రుణ పరిమితి గానీ లేదా నగదు మార్జిన్ గానీ లేకుండానే 'లెటర్స్ ఆఫ్ అండర్ టేకింగ్' (ఎల్‌ఒయు) పొందేందుకు గోకుల్ నాథ్ శెట్టి, మనోజ్ ఖారత్, హేమంత్ భట్‌లతో కలిసి నీరవ్ మోదీ భారీ కుట్రకు పాల్పడ్డారని పీఎన్‌బీ తన ఫిర్యాదులో పేర్కొన్న సంగతి తెలిసిందే. వీరిని ముంబైలోని సీబీఐ స్పెషల్ కోర్టు ముందు హాజరుపరిచారు. కోర్టు తదుపరి విచారణ నిమిత్తం వీరిని 14 రోజుల (మార్చి 3వ తేదీ వరకు) రిమాండ్‌కు ఆదేశించింది. ఇందులో మనోజ్ ఖారత్ బ్యాంకు మోసాన్ని ప్రాథమిక విచారణలోనే ఒప్పుకున్నట్టు సమాచారం కాగా.. వీరి నుంచి తదుపరి వివ రాలతో పాటు కనిపించకుండా పోయిన దస్త్రాలు.. కుం భకోణం వాస్తవ విలువలను అంచనా వేసేందుకు గాను నిం దితులను తమ కస్టడీకి ఇవ్వాలని సీబీఐ కోర్టును కోరింది.

మూడో రోజు కొనసాగిన సోదాలు..

స్కామ్ సూత్రధారి నీరవ్ మోదీకి గోకుల్ నాథ్ శెట్టి అత్యంత సన్నిహితుడిగా ఉండేవాడని తెలుస్తోంది. ఈ క్రమంలో ముంబైలోని ఆయన నివాసంలో కూడా సీబీఐ సోదాలు నిర్వహించింది. ఈ స్కామ్‌లో గోకుల్ శెట్టిని సహ నిందితుడిగా బ్యాంకు పేర్కొంది. ఇది ఇలా ఉంటే నీరవ్ మోదీ, గీతాంజలి గ్రూపుల సంస్థలపై ఈడీ దాడులు మూడవరోజు కూడా కొనసాగాయి. శనివారం మరో రూ.25కోట్ల విలువైన డైమండ్, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని, దీంతో మొత్తం విలువ రూ.5,674 కోట్లకు చేరిందని ఒక ప్రకటనలో వెల్లడించింది.

పెద్ద తలలపై ప్రత్యేక నజర్..

కఠినమైన నిఘా బ్యాంకింగ్ నిబంధనలను పక్కన బెట్టి, ఆడిటింగ్ అధికారుల కండ్లుగప్పి పీఎన్‌బీలో రూ.11,400 కోట్ల మోసం జరగడం కేవలం ఒక్కరిద్దరు ఉద్యోగుల హస్తంతో జరిగే పని కాదని విచారణ సంస్థలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీబీఐ, ఈడీల విచారణలో పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చినట్టుగా తెలుస్తోంది. పీఎన్‌బీ కుంభకోణంలో పీఎన్‌బీ టాప్ అధికారి, ఆర్‌బీఐ ముఖ్య అధికారుల పాత్ర ఉందన్న అనుమానాలు కలకలం రేపుతున్నాయి. ముఖ్యంగా పీఎన్‌బీ ఛైర్మన్ సహా, ఆర్‌బీఐ ఉన్నతాధికారులపై కూడా సీబీఐ దష్టి పెట్టినట్టుగా మనీ కంట్రోల్ ఒక కథనంలో పేర్కొంది. వేలకోట్ల అవినీతిని ఆయా బ్యాంకు శాఖల ఇంటర్నల్ ఆడిటింగ్ సందర్భంగా కూడా ఆర్‌బీఐ ఎందుకు కనిపెట్టలేక పోయిదనే విషయంపై సీబీఐ వర్గాలు ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఫిర్యాదు దారులతో సహా ఈ మెగా స్కాంలో ఎవ్వరూ విడిచిపెట్టేదిలేదని సీబీఐ పునరుద్ఘాటించింది.

స్కామ్‌కు రాజకీయ సెగ..

వేల కోట్ల ప్రజా ధనాన్ని లూటీ చేసి సరిహద్దులు దాటేసిన నీరవ్ మోడీ అంశం దేశంలో కొత్త రాజకీయ వేడికి తెర తీసింది. మోడీ పాలనలో కార్పొరేట్ మోసాలు పెరిగిపో యాయని.. పీఎన్‌బీ కుంభకోణం వెనుక అధికార పార్టీ హస్తం ఉందని కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్షాల వారు ఆరోపి స్తుంటే. అసలు ఈ స్కామ్ యూపీఏ హాయాంలోనే మొదలై ందని.. అప్పటి పాలకులే దీనికి విత్తనం వేసి పోషించారని అధికార పార్టీ ఎదురు దాడికి దిగింది. ఈ నేపథ్యంలో భారీ కుంభకోణంపై జాయింట్ పార్లమెంటరీ విచారణను డిమాండ్ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమ వుతోంది. ఈ మేరకు ప్రతిపక్షపార్టీలతో చర్చించనుంది. జెమ్స్ అండ్ జ్యువెలరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (జీజేఈపీసీ) పీఎన్‌బీ కుంభకోణాన్ని తీవ్రంగా ఖండించింది.

మార్కెట్లకు సూటి పెట్టారు..

- పబ్లిక్ ఇష్యూకు భారీగా పన్నాగం
- సన్నాహక కార్యక్రమాలు పూర్తి
- 'ఫలితాలు' బాగోలేక వెనకడుగు

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) భారీ మోసం కేసులో ప్రధాన నిందితులు నీరవ్ మోడీ, మేహుల్ చోక్సీలు తమ సామ్రాజ్య విస్తరణకు గాను స్టాక్ మార్కెట్లను కొల్లగొట్టాలని ప్రణాళికలు రచించినట్టుగా తెలుస్తోంది. తమకు సంబంధించిన కంపెనీలను పబ్లిక్ ఇష్యూకు తీసుకురావడం ద్వారా నిధుల సమీకరణ జరిపి.. అనంతరం వాటిని స్టాక్ మార్కెట్లలో లిస్ట్ చేయాలని వారు భావించినట్టుగా విచారణ ఏజెన్సీల ద్వారా తెలుస్తోంది. అనుకున్న ప్లాన్ వర్కవుట్ అయితే వీరికి సంబంధించిన అనుబంధ సంస్థలు ఈ ఏడాది స్టాక్ మార్కెట్లలోకి అరంగేట్రం చేయాల్సింది. అయితే ఇప్పుడు పరిస్థితి తారుమారు కావడంతో ఈ ప్లాన్‌లు పడకెక్కనున్నాయి.

'లాభం' లేకనే వెనుకడుగా..

వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, చోక్సీలు వాస్తవానికి ఈ ఏడాది స్టాక్ మార్కెట్లలో అడుగుపెట్టి నిధులను సమీకరిద్దామని అనుకున్నప్పటికీ.. ఆయా సంస్థలు గత ఏడాది కాలంగా అనుకున్న రీతిలో రాణించక పోవడం వల్లే వారు పబ్లిక్ ఇష్యూ ప్రతిపాదనలను వాయిదా వేస్తూ వచ్చినట్టుగా తెలుస్తోంది. ప్రధాన వ్యాపార సంస్థల ఆర్థిక గణాంకాలను పరిశీలిస్తే ఇదే విషయం అవగతమ వుతోంది. నీరవ్ మోడీ ప్రధాన వ్యాపార సంస్థ అయిన ఫైర్‌స్టార్ ఇంటర్‌నేషనల్ 2015-16 ఆర్థిక సంవత్స రానికి రూ.455 కోట్ల లాభాన్ని ఆర్జించింది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది 27% అధికం. కంపెనీ నెట్‌వర్త్ మొత్తం రూ.2,808 కోట్లుగా నమోదు అయింది. ఇదే సమయంలో సంస్థ అమ్మకాలు 21 శాతం పెరిగి రూ.12,511 కోట్లకు చేరుకున్నాయి. ఇందులో ముడి సరుకు విలువే రూ.11,569 కోట్లుగా ఉండడం విశేషం.

పీఎన్‌బీ రుణ రికవరీ కష్టమే..

మరోవైపు గీతాంజలి జెమ్స్ సంస్థ ఆర్థిక ఫలితాలను పరిశీలిస్తే గత మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి ఈ సంస్థ లాభం రూ.595 కోట్లుగా నమోదు అయింది. 2013లో సంస్థ లాభం రూ.166 కోట్లుగా ఉంది. ఇదే సమయంలో సంస్థ రుణ భారం రూ.5,239 కోట్లుగా నమోదు అయింది.

కంపెనీ అమ్మకాల టర్నోవర్ రూ.16,571 కోట్లుగా ఉన్నప్పటికీ, ముడి సరకు విలువ దాదాపుగా రూ.16,616 కోట్లుగా ఉంది. దీంతో సంస్థ ఆర్థిక పనితీరు బాగులేదని భావించిన మోడీ, చోక్సీలు ఐపీవో ప్లాన్‌లను పక్కనబెట్టినట్టు సమాచారం.

ఇరు సంస్థల ఆర్థిక పరిస్థితి బయటకు కనిపించినంత ఆరోగ్యకరంగా లేదని ఈ సంస్థల లెక్కలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో పీఎన్‌బీకి వజ్రాల వ్యాపారులు చేసిన మొత్తం రుణాలు తిరిగి వసూలు కావడం కష్టమేనని విశ్లేషకులు చెబుతున్నారు.





వీఆర్‌ఏ సమస్యల పరిష్కారం ఉద్యమం

- 24న మండలాల్లో ఆందోళన
- మార్చి 12న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం చేపట్టాలని తెలంగాణ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఈనెల 24న మండల కేంద్రాల్లో ఆందోళన చేయాలని, మార్చి 12న కలెక్టరేట్ కార్యాయాల వద్ద ధర్నాలు నిర్వహించాలని తీర్మాణించింది. శనివారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఉపాధ్యక్షులు సిహెచ్. రాజయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు మాట్లాడుతూ రాష్ట్రంలో టీఆర్‌ఎస్ సర్కారు ఏర్పాటైనప్పటి నుంచి రకరకాల సర్వేల పేరుతో రేయిపగలు బండ చాకిరీ చేయిస్తున్నదన్నారు.పెరిగిన పనిభారానికి అనుగుణంగా వేతనాలు పెంచలేదని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ హామీలు ఇచ్చి ఏడాది గడుస్తున్నా అతీగతీలేదన్నారు. 010 పద్దు, అర్హత కలిగిన వారికి ఉద్యోగోన్నతులు, ఖాళీ పోస్టుల భర్తీ, పెండింగ్ సమస్యల పరిష్కారం హామీలు అమలుచేయడంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తాతల నుంచి నుంచి తండ్రులు, వారి నుంచి పిల్లలు తరతరాలుగా వ్యవస్థలో కొనసాగుతున్నా, వీఆర్‌ఏలను 60 ఏండ్లుగా నిండాయని, వారిని ఎలాంటి రిటైర్‌మెంట్ ప్రయోజనాలు ఇవ్వకుండా తొలగించడం అన్యాయమన్నారు. ఇసుక మాఫీయా దాడులు సైతం పెరిగాయని చెప్పారు. ప్రభుత్వ హామీల అమలు, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం మండల, జిల్లా కలెక్టరేట్ ధర్నాల్లో విఆర్‌ఏలంతా ఐక్యంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మార్కం రామన్న, మేకల రాజు, మైసకొండయ్య, దుప్పి పోషెట్టి, అన్నిజిల్లాల నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి ఆరు పీజీ సీట్లు మంజూరు

- ప్రభుత్వానికి ఎంసీఐ లేఖ ?

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రానికి కొత్తగా ఆరు పీజీ సీట్లు దక్కాయి. ఈ మేరకు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రెండు రోజుల క్రితం ప్రభుత్వానికి లేఖ రాసినట్టు సమాచారం. ఆస్పత్రి పరిపాలన, ఫార్మాకాలజీ విభాగాలకు మూడేసి చొప్పున మొత్తం ఆరు పీజీ సీట్లు మంజూరు చేస్తూ ఎంసీఐ ఇటీవల నిర్ణయించిన సంగతి తెలిసిందే.

గాంధీ వైద్య కళాశాలకు పరిపాలనా విభాగంలో మూడు పీజీ సీట్లు, నిజామాబాద్ వైద్య కళాశాలకు ఫార్మాకాలజీలో 3 పీజీ సీట్లకు అనుమతిచ్చింది. నీట్ పీజీలో వచ్చిన ర్యాంకు ఆధారంగా సీట్లను కేటాయిస్తారు. మూడేండ్ల కాలవ్యవధి గల ఈ కోర్సులో 2018-19 విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి వస్తాయి. కాగా, నిజామాబాద్ కళాశాలకు తొలిసారిగా పీజీ సీట్లను కేటాయించగా, రాష్ట్రంలో ఒక ప్రభుత్వ వైద్య కళాశాలకు ఆస్పత్రి పాలనా విభాగంలో పీజీ సీట్లు రావడం ఇదే తొలిసారి.

సాధారణంగా డాక్టర్లకు పాలనపై పట్టు ఉండదు. ఈ క్రమంలో పరిపాలనా విభాగం బలహీనంగా ఉండటంతో ఆస్పత్రుల్లో దారుణమైన పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రస్తుతం అన్ని ఆస్పత్రుల్లోని సూపరింటెండెంట్లంతా డాక్టర్లే. తాజాగా ఆస్పత్రి పాలనలో పీజీ సీట్లు రావడంతో ఏటా ముగ్గురు విద్యార్థులకు అవకాశం లభిస్తుంది. ఇక ఫార్మాకాలజీ పీజీలో ఏ జబ్బుకు ఎంత మందు సిఫారసు చేయాలి? రసాయన సూత్రం కాంబినేషన్, రోగాలు.. వాటి ప్రభావం గురించి ఉంటుంది. ప్రధానంగా ఫార్మా కంపెనీలు ఫార్మాకాలజీ చేసిన విద్యార్థులకు అత్యధిక ప్రాధాన్యమిస్తాయి.

స్పోర్ట్స్‌కోటాలో మరోసీటు గోల్‌మాల్

- సీనియర్ విభాగంలో ఆడితే 'జూనియర్'కు పాయింట్లు • మెడికల్ సీట్ల వ్యవహారంలో మరో అక్రమం • అధికారుల నిర్లక్ష్యానికి సీటు కోల్పోయిన దళిత విద్యార్థిని • ఎండీకి ఫిర్యాదు చేస్తే..అధికారులను తిట్లతో సరిపుచ్చిన వైనం



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

క్రీడాకోటలో మెడికల్ సీట్ల వ్యవహారం, అవినీతి భాగోతం రోజుకొకటి వెలుగులోకి వస్తున్నది. ఇంటర్నేషనల్ క్రీడాకారులను పక్కన పెట్టి, కేవలం పోటీల్లో పాల్గొన్నందుకు ఏకంగా పతకం వచ్చినట్టు ప్రాధాన్యత పాయింట్లు ఇచ్చిన ఘటన మరువకముందే, అలాంటి వ్యవహారమే తాజాగా మరొకటి బయటపడింది. అయితే ఇక్కడ సీనియర్ విభాగంలో ఆడిన దళిత విద్యార్థినికి జూనియర్‌లో ఆడినట్టు ప్రాధాన్యత పాయింట్లు ఇచ్చేశారు. దీంతో ఆ విద్యార్థిని వైద్య విద్యలో సీటు కోల్పోవాల్సి వచ్చింది. సర్టిఫికేట్ల పరిశీలన అధికారుల అక్రమాలన్నీ..తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ (సాట్స్) ఉన్నతాధికారుల కనుసన్నుల్లోనే జరుగుతున్నాయనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ మండల కేంద్రానికి చెందిన బి ఇవాన్‌జెలీన్ విలువిద్య క్రీడాకారిణి. ప్రత్యేకంగా కోచ్ లేకుండానే కేవలం తన తండ్రి అంబేద్కర్‌కుమార్ శిక్షణలో రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధించి మంచి గుర్తింపు తెచ్చుకున్నది. జాతీయస్థాయిలో ఏడుసార్లు విలువిద్య పోటీల్లో పాల్గొన్నది. విజయవాడలో జరిగిన జాతీయస్థాయి అండర్-14 విభాగంలో కాంస్యపతకం కూడా సాధించింది. ఈక్రమంలోనే వైద్యవిద్య చదవాలనే లక్ష్యంతో 2017-18 నీట్‌పరీక్ష రాసి జాతీయస్థాయిలో 3,50,318 ర్యాంకు వచ్చింది. అయితే క్రీడావిభాగంలో దరఖాస్తు చేసుకున్న ఇవాన్‌జెలీన్‌కు మెడికల్ సీటు రాలేదు. దీనికి స్పోర్ట్స్ సర్టిఫికెట్ల పరిశీలన సందర్భంగా తక్కువ ప్రాధాన్యత పాయింట్లు వేశారని తెలుసుకున్న ఆ విద్యార్థిని, తన తండ్రి సహాయంతో సాట్స్ అధికారులకు ఫిర్యాదు చేసింది. అయినా ఫలితం లేకుండా పోయింది. మూడు లక్షలా 92వేలకు పైగా నీట్ ర్యాంకు పొందిన ఓ విద్యార్థినికి ఆదిలాబాద్ రిమ్స్‌లో సీటు కేటాయించారు. ప్రాధాన్యత రీత్యా ఇద్దరికీ ఒకేస్థాయి ప్రాధాన్యత పాయింట్లు ఉన్న నేపథ్యంలో నీట్ ర్యాంకును పరిగణలోకి తీసుకోవాల్సి ఉంది. కానీ ఆ పనిమాత్రం చేయలేదని తెలుస్తోంది.

27ఐ పాయింట్లకు 72ఐ పాయింట్లు..!

విలువిద్యలో సీనియర్ విభాగంలో ఆడిన బొంత ఇవాన్‌జెలీన్‌కు ప్రాధాన్యత పాయింట్లు 27ఐ వేయాల్సి ఉంది. కానీ నేషనల్ స్కూల్ గేమ్స్ విభాగంలో ఆడినట్టు 72ఐ పాయింట్లు వేశారు. వాస్తవానికి 2016 ఏప్రిల్ 8నుంచి11 వరకు జార్ఖండ్ రాష్ట్రంలోని కార్ష్వాన్‌లో ఈ క్రీడాకారిణి పాల్గొనట్టు సర్టిఫికెట్లు సైతం ఉన్నాయి. ఈ పోటీలకు ఎంపికైన విద్యార్థుల వివరాలను అదే ఏడాది ఏప్రిల్ 7న తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ ప్రతినిధులు సాట్స్ ఆఫీస్‌కు పంపారు. కానీ సాట్స్ అధికారులు మాత్రం తమకు ఆర్చరీ కార్యాలయం నుంచి ఎలాంటి వివరాలూ అందలేదని ఆ విద్యార్థినికి చెప్పడం గమనార్హం. ఇదే విషయాన్ని ఆర్చరీ అసోసియేషన్‌కు ఫిర్యాదు చేస్తే..సాట్స్ ఆఫీస్‌లో ఈ వివరాలు ఇచ్చినట్టు ఇన్‌వార్డ్ సెక్షన్ ముద్రతో కూడిన వివరాలు వారికి అందించారు. ఈ వివరాలను తీసుకుని, సాట్స్ ఎండీకి ఆ విద్యార్థిని తండ్రి ఫిర్యాదు చేశారు. ఈ పొరపాటును గుర్తించిన ఆయన, సర్టిఫికెట్ల పరిశీలనలోని ఇద్దరు సీనియర్ అధికారులను పిలిచి, ఆయన ముందే చీవాట్లు పెట్టినట్టు తెలిసింది. అయినా ఇప్పటికీ ఆ విద్యార్థినికి మాత్రం న్యాయం జరగలేదు. ఈ తతంగాన్ని రాష్ట్ర మంత్రులు పద్మారావు, ఇంద్రకరణ్‌రెడ్డి తో పాటు సాట్స్ చైర్మెన్ వెంకటేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేకుండా పోయిందని క్రీడాకారిణి తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. నిజంగానే జాతీయస్థాయిలో పాల్గొనకుండా దొంగ సర్టిఫికెట్లు తాము పెడితే... విచారించి అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని బాధితులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలనీ, ఈ ఘటనకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని బాధిత విద్యార్థిని డిమాండ్ చేస్తోంది. ఇప్పటికే ఓ విద్యార్థిని జాతీయస్థాయి పోటీలో పాల్గొంటే, ఏకంగా పతకం వచ్చిన సర్టిపై చేసిన అంశంలో పనిఒత్తిడితోనే ఈ తప్పిదం జరిగిందని సర్టిఫికెట్ల పరిశీలనాధికారులు ఒప్పుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఎలాంటి వివరణ ఇస్తారో వేచి చూడాల్సిందే.

సెట్‌చేసుకోమని ముందే ఫోన్..!

సర్టిఫికేట్ల పరిశీలన సందర్భంగా సాట్స్ అధికారి(పరిశీలనాధికారి) క్రీడాకారిణి నెంబర్‌కు ఫోన్ చేసినట్టు తెలిసింది. ఈ క్రమంలో ఫోన్ లిఫ్ట్ చేసిన క్రీడాకారిణి తల్లితో హైదరాబాద్‌కు వచ్చి మెడికల్ సీటు విషయాన్ని సెట్ చేసుకోవాలని ఆ అధికారి సూచించినట్టు సమాచారం. అయితే డబ్బులతో సీటు సెట్ చేసుకోవాలంటున్నట్టు అర్థం చేసుకోలేదనీ విద్యార్థిని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేపటినుంచి టీఆర్టీ హాల్‌టికెట్లు

- టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అభ్యర్థులకు అందుబాటు
- 8,792 పోస్టులకు 2.77 లక్షల మంది దరఖాస్తు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ)కు దరఖాస్తు చేసిన అభ్యర్థుల హాల్‌టికెట్లు సోమవారం నుంచి డౌన్‌లోడ్ చేసుకునే వీలుంది. ఈనెల 24 నుంచి టీఆర్టీ రాతపరీక్షలు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. మార్చి 4వ తేదీ వరకు టీఆర్టీ రాతపరీక్షలు జరగనున్నాయి. 16 విడతల్లో టీఆర్టీ రాతపరీక్షలు జరుగుతున్నాయి. ఇందులో 13 విడతలు కంప్యూటర్ బేస్డ్ రాతపరీక్ష (సీబీఆర్‌టీ) పద్ధతిలో నిర్వహిస్తారు. మిగిలిన మూడు రాతపరీక్షలు ఆఫ్‌లైన్‌లో జరుగుతున్నాయి. ఈ రాతపరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఏర్పాట్లు చేస్తున్నది. పాత పది జిల్లాల ప్రాతిపదికన 8,792 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి 2017, అక్టోబర్ 21న టీఆర్టీ నోటిఫికేషన్ విడుదలైంది. 8,792 పోస్టులకు రాష్ట్రవ్యాప్తంగా 2,77,574 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ) 1,941 పోస్టులకు 1,45,158 మంది అభ్యర్థులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ) 416 పోస్టులకు 16,871 మంది, స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) 9 పోస్టులకు 2,177 మంది, భాషా పండితులు (ఎల్‌పీ) 1,011 పోస్టులకు 24,219 మంది, సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) 5,415 పోస్టులకు 89,149 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. అభ్యర్థుల్లో కొంతమంది 31 జిల్లాల సమాచారాన్ని 10 జిల్లాలుగా సవరణ చేయలేదు. వారికి ప్రత్యేక అవకాశం కల్పించింది. టీఆర్టీ రాతపరీక్షల నిర్వహణ సందర్భంగా టీఎస్‌పీఎస్సీ ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసింది. రాతపరీక్షలు పూర్తయ్యే వరకు ఈ హెల్ప్‌డెస్క్ పనిచేయనుంది.

టీఆర్టీ పోస్టులు, అభ్యర్థులు వివరాలు

కేటగిరీ	పోస్టులు	అభ్యర్థులు
స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ)	1,941	1,45,158
సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)	5,415	89,149
భాషాపండితులు (ఎల్‌పీ)	1,011	24,219
వ్యాయామ విద్య ఉపాధ్యాయులు (పీఈటీ)	416	16,871
స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎస్‌ఏపీఈ)	09	2,177
మొత్తం	8,792	2,77,574

కొత్త రాష్ట్రంలో నాణ్యమైన విద్య, వైద్యం


- ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో నాణ్యమైన విద్య, వైద్యం అందించేందుకు ప్రభు త్వం కృషి చేస్తున్నదని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. త్వరలోనే రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి ఆరోగ్య పరీక్షలు చేసి, ఆరోగ్య కార్డులు అందిం చాలని సీఎం కేసీఆర్ నిర్ణయిం చారని తెలిపారు. హైదరాబాద్ లోని ఒక హెూటల్‌లో 'ఏషియన్ కాంగ్రెస్ ఆఫ్ ఓరల్ ఇంప్లాంటలాజిస్ట్స్' ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవానికి ఉప ముఖ్య మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.

కేసీఆర్ హెల్త్ కిట్స్ వల్ల ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్, తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహిం చే ఈ ఎగ్జిబిషన్ వల్ల దంత సంరక్షణపై అవగాహన పెరుగుతుందని చెప్పారు. అయితే, ప్రజల్లో దంత సంరక్షణపై అవగాహన కల్పించే కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాల్సి ఉందని అన్నారు. విద్యాశాఖ పరంగా విద్యార్థులకు ఆరోగ్య కార్డులు ఇచ్చే సందర్భంలో దంత పరీక్షలకు సంబంధించి స్వచ్ఛందంగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ తెలంగాణ చాప్టర్ వారి సేవలు అందించాలన్నారు. సమావేశంలో కాన్ఫరెన్స్ చైర్మెన్ డాక్టర్ కరుణాకర్, ఇతర డాక్టర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.







జస్ట్ ఫాలో ద రూల్స్

క్రియేటివిటీతో యూత్‌కి విడదీయని అనుబంధం. సెటైర్లు, పంచులు, విమర్శలు... కాన్సెప్ట్ ఏదైనా కామెడీకి అవి కేరాఫ్ అడ్రసే కదా.. ఒక సారి 'హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్' (HTP) పేజీ చూస్తే ఈ తరహా పోస్టులే కనిపిస్తాయి. హ్యూమరస్‌గా చేసే పోస్టులు అన్నీ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రూల్స్ పాటించాలని వాతలు పెడతాయి, నవ్విస్తాయి, ఆసక్తి రేపుతాయి, ఆలోచింప జేస్తాయి. వాహనదారులను ఆలోచింపజేసేందుకు వినూత్నంగా వీళ్లు చేస్తున్న ప్రయత్నం సక్సెస్ అవుతుందనడానికి సామాజిక మాధ్యమాల్లో ఇటీవల చక్కర్లు కొడుతున్న HTP పోస్టులే నిదర్శనం.



'She : Tell me those 3 magical words ?
Admin H : Follow the rules'

వాలంటైన్స్ డే రోజు యూత్ అంతా జోష్‌లో ఉంటే హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ ఫేస్‌బుక్ పేజీలో కనబడిన పోస్టు ఇది. "వేర్ ఎవర్ యూ గో ఫాలో ద రూల్స్" అంటూ వ్యంగాస్త్రాలను ఉపయోగిస్తూ పెట్టిన ఈ పోస్టు నెటిజన్లను భలే ఆకట్టుకుంది.

'Don't be an ANGRY BIRD. Wait for your signal'

ఇదీ అడ్మిన్లు పెట్టిన పోస్టే. చాలా ముఖ్యమైనా అంశాన్ని ఎంత సీరియస్‌గా, సున్నితంగా చెప్పారో చూడండి. వాహనదారులను నొప్పించకుండా వాళ్లకు అవగాహన కల్పించటం కోసం అడ్మిన్లు పెట్టే ఇలాంటి పోస్టులు కోకొల్లలు.

హూ ఈజ్ ద అడ్మిన్స్...


'Admin SK', 'Admin H' పేజీలో పోస్టింగ్స్ చేయటంలో, సోషల్ మీడియా ద్వారా వాహనదారులు రూల్స్ పాటించాలని అవగాహన కల్పించటంలో వీరు ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఇంత క్రేజ్ పెరగడానికి కారణమైన వాళ్లిద్దరు ఎవరూ ? అడ్మిన్ ఎస్‌కే, అడ్మిన్ హెచ్ అంటే ఏంటి ? అనే డౌట్లు వస్తున్నాయా?.. " షేక్ హిదాయతుల్లా", "హరినాథ్ రెడ్డి" అడ్మిన్ల పేర్లు. ఆసక్తి రేపే పోస్టింగ్‌లు చేయటం హరినాథ్ రెడ్డి పని, పేజీలో బ్యాక్ ఎండ్ వర్క్ హిదాయతుల్లా చూసుకుంటాడు. మొత్తనికైతే ఇద్దరూ కలిసి వాహనదారులకు నవ్వులు పంచుతూ బాధ్యతలను గుర్తు చేస్తున్నారు.

హరినాథ్ రెడ్డి 27 ఏండ్ల ఉద్యోగి. పుట్టి పెరిగింది హైదరాబాద్‌లోని మూసాపేట్‌లోనే. ఎంబీఏ పూర్తి చేసి ట్రాఫిక్ విభాగంలో ఉద్యోగం సాధించాడు. 2010 నుంచి హెచ్‌టీపీ పేజీకీ అడ్మిన్‌గా ఉన్నాడు. ఇటీవల ఆ పేజీకి విశేషమైన ఆదరణ రావటంతో ఒక్క సారిగా 'అడ్మిన్ హెచ్' పేరుతో నెటిజన్లకు పరిచయమయ్యాడు. పేజీ ఇంత పాపులర్ అవడం ఎలా సాధ్యమైందో అతని మాటల్లోనే...

"ఎన్నో ఏండ్లుగా ఈ పేజీని నడుపుతున్నాం. ఎప్పుడూ ఒకే రకమైన పోస్టింగ్స్, ట్రాఫిక్ ఇండికేషన్స్ ఇచ్చే వాళ్లం. లాస్ట్ ఇయర్ డిసెంబర్‌లో ఒక సెటైరికల్ పోస్ట్ పెట్టాను. రెస్పాన్స్ చూస్తే ఆశ్చర్యం వేసింది. ఇకపై ఇలానే కామెడీ యాంగిల్లో పోస్టింగ్ చేస్తూ నెటిజన్ల దగ్గరవ్వాలనుకున్నాం.. పై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకున్నాం. అప్పటి నుంచి ఫన్ జనరేట్ అవుతూ, అవగాహన కల్గించే పోస్టింగ్స్ రాయటంలో ఫోకస్ పెట్టాం. చాలా రెస్పాన్స్ వచ్చింది. ఏదైనా ఇతరులు అర్థం చేస్కోవాలంటే కొత్తదనం, క్రియేటివిటీ, ఫన్ ఉండాలి అప్పుడే అది ఇతరులకు చేరుతుంది. ఈ మొత్తం ప్రకియలో చాలా బాధ్యతాయుతంగా ఉండాలి, ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా పోస్టులు రాయాలి. అందుకు నా పరిధులను నేను మించబోను'. అని అంటున్నాడు అడ్మిన్ హెచ్.

నెటిజన్లతో ఇన్‌టారాక్షన్

పేజీ ఎక్కువ ఆధరణ పొందాలంటే నెటిజన్లతో ఇన్‌టారాక్షన్ తప్పని సరి అంటున్నారు అడ్మిన్స్. పేజీలో వచ్చే కామెంట్లకు రిప్లై ఇవ్వడం, నెటిజన్లతో మాట్లాడటం నిరంతరం జరుగుతోంది. ఒక్కో సారి యూజర్లు ఇచ్చే సూచనలను, సలహాలను అడ్మిన్స్ పాటిస్తున్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులనూ అడ్మిన్లు స్వీకరించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఫిర్యాదులను తీసుకోవటమే కాదు వాళ్లకు ఫీడ్ బ్యాక్ ఇస్తున్నామని చెప్పారు అడ్మిన్స్. పేజీకి కంప్లేంట్ వచ్చినప్పుడు రెస్పాండ్ అవకపోయినా, ఫీడ్ బ్యాక్ ఇవ్వకపోయినా ప్రజలకు విశ్వసనీయతను కోల్పోతారని అడ్మిన్ హెచ్ తెలిపారు.



మన వాళ్లది దేశంలోనే టాప్ 2లో

ఇండియన్ సిటీ ట్రాఫిక్ పోలీస్ వారు నిర్వహించే ఫేస్‌బుక్ పేజీల్లో హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ పోలీస్ పేజీ టాప్ 2 లో ఉంది. 5 లక్షల లైక్స్‌తో బెంగళూర్ ట్రాఫిక్ పోలీస్ పేజీ మొదటి ప్లేస్, మూడు లక్షల లైక్స్‌తో రెండో స్థానంలో హైదరాబాద్ సిటీ, 2 లక్షలా 57 వేల లైక్స్‌తో ఢిల్లీ ట్రాఫిక్ పోలీస్ పేజీ మూడో స్థానంలో ఉంది. తర్వాత కోల్‌కత్త, పూనే, చెన్నయ్, ముంబాయి సిటీ ట్రాఫిక్ పోలీసుల ఫేస్‌బుక్ పేజీలు ఉన్నాయి.

వినోద్ మామిడాల

ఆనందంగా ఉంది



మాది హైదరాబాద్. గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. 2008లో ట్రాఫిక్ డిపార్ట్ మెంట్‌లో జాబ్‌లో చేరాను. కొద్ది కాలం తర్వాత ఫేస్‌బుక్ పేజీ బాధ్యతలు తీసుకున్నాను. ఇంత రెస్పాన్స్ వస్తుందని అనుకోలేదు. సెటైరికల్ పోస్టులు పెట్టి ప్రజలకు అవగాహన కల్పించటం నచ్చింది. వారి నుంచి వచ్చే స్పందన చూస్తే ఆనందంగా ఉంది. ఈ పేజీని భవిష్యత్‌లో మరింత డెవలప్ చేస్తాం. హరినాథ్, నేను కలిసి ఆ కృషి చేస్తున్నాం. కేవలం ఫేస్‌బుక్ యే కాకుండా ఇతర సోషల్ మీడియా టూల్స్‌ని కూడా ఉపయోగించుకోవాల్సి ఉంది. భవిష్యత్‌లో మరింత ముందుకు వెళ్తాం. పై అధికారుల కోపరేషన్ ఉంది. మేము చేసే పని పట్ల వారూ ఆనందంగా ఉన్నారు.

షేక్ హిదాయతుల్లా (అడ్మిన్ ఎస్‌కే)

మాటిస్తున్నా నేస్తం...



నీకు మాటిస్తున్నా నేస్తం.
ప్రాణమున్నంత వరకు నీకు తోడుంటానని ....
నీ కష్టాల్లో కడ వరకూ అండగా ఉంటానని
నిను ప్రాణమోలే చూసుకుంటానని
నా శ్వాస ఆగే వరకూ
నువ్వే నా ఊపిరి అని
నీ అడుగులో అడుగునవుతానని
నువ్వేసే ప్రతి అడుగులో నేను కలిసి ఉంటానని
మాటిస్తున్న నేస్తం..
నువ్వు లేని నన్ను ఊహించలేనని

రామదాసు, ఖమ్మం- 9553497526

ఓ బేబి...



ప్రాణమున్న పికాసో చిత్రానివి నువ్వు...
అలాగే చూస్తూ ఉండిపోవాలనిపిస్తోంది
థ్రిల్ ఇచ్చే పాప్ మ్యూజిక్ మాటలు
నీవి.....
అలాగే వింటూ ఉండాలనిపిస్తోంది...
కైపెక్కించే బార్బీ డాల్ కన్నులు నీవి
అందుకే వాటిలో
చిక్కుకోవాలనిపిస్తోంది.....

- వినో

మజాక్

డాక్టర్‌కే పంచ్



డాక్టర్ : మీ ప్రాబ్లం తగ్గాలంటే. బయట తినకండి
పేషెంట్ : ఓకే అండి ! బయట కొనుక్కున్నా ఇంటికి తెచ్చుకునే తింటాను.

స్టూడెంట్ తెలివి



టీచర్ : రాము.. పది పెంపుడు జంతువుల పేర్లు చెప్పు
రాము : ఐదు కుక్కలు, ఐదు పిల్లులు టీచర్

స్మార్ట్ గర్ల్



అమ్మాయి : ఈ సారి ఎగ్జామ్ ఫెయిల్ అయితే మా నాన్న నాకు పెళ్లి చేస్తా అన్నాడు
అబ్బాయి : మరి ఎలా ప్రిపేర్ అవుతున్నావు ?
అమ్మాయి : అన్నీ పనులూ అయిపోయాయి. రిషెప్సన్‌కి బట్టలు కొనుక్కోవాలి అంతే...

మీరూ రాయొచ్చు

హాయ్ ఫ్రెండ్స్. ఈ పేజీకి మీరేదైనా రాయాలనుకుంటున్నారా.. అయితే ఆలస్యం దేనికి? కలం పట్టండి. ముఖ్యమైన ఈవెంట్స్, సక్సెస్ స్టోరీలు, సమాజ శ్రేయస్సు కోసం చేపడుతున్న కార్యక్రమాలు.. ఇలా యూత్‌కు సంబంధించి సమాచారం ఏదైనా సరే మాకు పంపండి.

మా అడ్రస్ : జోష్ పేజీ, నవ తెలంగాణ తెలుగు దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కల్యాణ మండపం వీధి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500020. సెల్: 07660066469

e-mail : josh@navatelangana.com

ప్రేమ మొగ్గలు

నీహ దయసవ్వడిని రోజూ వింటేనే కదా
నా మనోసరస్సు స్వరగంగప్రవాహమయ్యేది
ప్రేమంటే ఇద్దరి మనసుల ఏకతాస్వరం


నీ పేరును తారకమంత్రంలా జపిస్తేనే కదా
నా మదిలో ప్రేమగీతాలు పురుడుపోసుకొనేది
ప్రేమంటే గుండెను తాకే వాసంతసమీరం

నువ్వు ఆకాశంలో జాబిల్లిలా మెరిస్తేనే కదా
నేను కలువపువ్వునై వికసించి నవ్వేది
ప్రేమంటే దూరాలను కలిపే స్నేహహస్తం

నీ స్వచ్ఛమైన చిరునవ్వుల కోసమే కదా
నేను చకోరిపక్షినై నిత్యం ఎదురుచూసేది
ప్రేమంటే కళ్ళకు తెలియని మౌనభాష

నీ ఆత్మీయ పలకరింపుల కోసమే కదా
నా మనస్సు నిరంతరం తపస్సు చేసేది
ప్రేమంటే మాటలకు అందని మూగభాష

- డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్
9032844017



మోనాలిసా



పెదాలపై..
నవ్వుల పూలను పూయిస్తూ
నన్నో గండుతుమ్మెదను చేసి
విపరీతంగా చుట్టు తిప్పుకుంటావు.

శిశిరపు ఆకుల్లా
ఆలోచనలన్నీ నువ్వే రాల్చేసి
వట్టి మోడులా నిలబెడతావు.
కాసేపటికే గాఢంగా అల్లుకొని
అర్థంకాని 'మోనాలిసా'వై
వలపు చిగురులు తొడిగిపోతావు.

సుదీర్ఘ ప్రయాణంలో
దారి వెంబడి బెల్లంపూవులా
మరులు గొల్పుతూ
సుతిమెత్తగా వెంట సంచరిస్తావు.

నిశ్శబ్ద నిశానిశీథిలో
జలపాత సంగీత రసధ్వనుల్లా
కాలియందెల సవ్వళ్ళు చేస్తూ
ఎదమందిరంలో చొరబడతావు.

సముద్ర తీరంలో
పాలనురుగులా తళతళ మెరుస్తూ
పూటపూటకో చీరకట్టి
ఇంద్రధనుస్సులా ముందే సంచరిస్తూ
రోజూ మతిపోగొడుతుంటావు.

నన్ను గండుతుమ్మెదను చేసి..
నీ చుట్టు అదేపనిగా తిప్పుకుందీ
వట్టి మోడులా నిలబెట్టి..
నన్ను శిశిర రుతువుగా మార్చిందీ
నాలో నువ్వు చిగురించడానికే కదా !

- అశోక్ అవారి, 9000576581

మర్యాద మరవొద్దు సుమీ!

ఒంటరిగా ఉన్నప్పుడు మన ప్రవర్తన ఎలాగైనా ఉండొచ్చు కానీ నలుగురిలో కలిసినప్పుడు ' సామాజిక ప్రవర్తన అవసరం. నలుగురితో కలిసి తిరిగినప్పుడు మన గౌరవాన్ని కోల్పోవొద్దు అంటే ఎదుటి వ్యక్తిని మర్యాదగా పలకరించాలి. ఇలాంటి సోషల్ బిహేవర్ లేకపోతే నలుగరిలో నవ్వుల పాలవుతాం. ఇతర నుంచి మనం మర్యాద కోరుకోవాలనుకోవటం సహజం. ఎదుటి వాళ్లు కూడా ఇలానే ఆలోచిస్తారని మనం గుర్తించాలి. మీకు తెలుసా .. జీవితంలో ఖర్చులేకుండా ఇతరులకు మనం ఇవ్వగలిగేది ఒక్క మర్యాద మాత్రమే. మనం ఇతరులకు మర్యాద ఇవ్వటం ద్వారా మనకు ఇతరుల నుంచి ప్రేమాభిమానాలు లభిస్తాయి. జీవితంలో అవి ఎంతో ఉపయోగకరంగా మారుతాయి. గౌరవం అనేది ఒక వ్యక్తి ముఖ్యమైనదిగా భావించే విషయంలో చూపే సానుకూల భావన లేదా చర్య. ఎదుటి వ్యక్తి ముందు మనం మర్యాదగా మాట్లాడకపోయినా, సామాజిక ప్రవర్తన లేకపోయినా మన వ్యక్తిత్వం మీద వారు అంచనాకు వచ్చే అవకాశముంది. కొందరు వ్యక్తులు ఇతరులకు సహాయపడటం ద్వారా లేదా ముఖ్యమైన సామాజిక పాత్రలను పోషించటం ద్వారా గౌరవాన్ని సంపాదించవచ్చు. ఎవరైనా మీకు సాయం చేస్తే కృతజ్ఞతా భావం కల్గి ఉండాలి. ఇది మీరు సాయం పొందిన వ్యక్తికి మీరిచ్చే మర్యాద. సాయం తీసుకుని అయిపోయింది కదా అని వెళ్లిపోవటం సరికాదు. షేక్‌హ్యాండ్ ఇవ్వటం, చిన్న నవ్వు నవ్వటం, థ్యాంక్స్ చెప్పటం వంటి చర్యలు మర్యాదకు, గౌరవానికి భౌతిక సంజ్ఞలు.

సాధారణంగా మనకు అప్పుడప్పుడు కోపం వస్తుంది. ఆ కోపం వచ్చిన సమయంలో మనం పెద్దా చిన్నా అని చూడకుండా ఏదైనా అనేయడానికి సిద్ధపడతాం. అదే సమయంలో మనకు మర్యాద అనేది జ్ఞాపకం వస్తుంది. అందువల్ల మనం ఎంత కోపంగా ఉన్నా సరే.. పెద్దవాళ్ల మీద మనకు ఎంత కోపం వచ్చినా సరే కోపాన్ని కంట్రోల్ చేసుకుని మర్యాద ఇస్తుంటాం. ఆ విషయాన్ని మరచిపోయినట్టయితే మన వ్యక్తిత్వానికి లోటు ఏర్పడినట్లే. పెద్దవాళ్లకు మర్యాద ఇవ్వటం అనేది సంస్కారం అనిపించుకుంటుంది. గౌరవ సంస్కారాలు ప్రతి మనిషికీ అవసరమే కదా! మనం ఇతరులకు మర్యాద ఇస్తే వాళ్లు మనకు మర్యాద ఇస్తారు. మనం ఇతరులను తక్కువగా చులకనగా చూస్తే మనల్ని ఇతరులు కూడా అలాగే చూస్తారు. గౌరవ మర్యాదలు అనేవి ఇచ్చి పుచ్చుకోవటం లోనే ఉంటాయి. నిజానికి మర్యాద అనేది నిత్య జీవితంలో ఎల్లప్పుడూ అవసరమే. ఎందుకంటే మనం చేసే పనిలో మనం మాట్లాడే మాటలో మన చేతల్లో ఎప్పుడూ మర్యాద కనిపించాలి. మనం చేసే ప్రతి పనిలోనూ మర్యాద కనిపించాలి. అప్పుడే మనం



ఎదుటివారి దృష్టికి మంచి వారిగా కనిపిస్తాం. మర్యాద అనే కళను అలవర్చుకుంటే ఖర్చులేకుండానే ఇతరుల ఆదరాభిమానాలు సొంతం చేసుకోవచ్చు. సో. "వీలయితే రెస్పెక్టిద్దాం డూడ్.. పోయేదేముంది మహా అయితే తిరిగి రెస్పెక్ట్ ఇస్తారు".



కోహ్లిసేన ప్రతిష్టాత్మక సఫారీ పర్యటన తుది అంకానికి చేరుకున్నది. టెస్టుల్లో దక్షిణాఫ్రికా మెరువగా, వన్డేల్లో మనోళ్లు ఏకచత్రాధిపత్యం చెలాయించారు. ఇప్పుడు పోరు పొట్టి క్రికెట్‌కు మారింది. టీ20 సిరీస్ విజయంతో దక్షిణాఫ్రికా నుంచి సగర్వంగా తిరిగి రావాలనే సంకల్పంతో ఉంది. పరుగుల దాహంతో ఉరకలేస్తోన్న 'బ్యాటింగ్ గ్రేట్' కోహ్లి సారథ్యంలో జోరుమీదున్న టీమ్ ఇండియా.. పొట్టి పోరులో ఆకాశమే హద్దుగా ఆడేందుకు రంగం సిద్ధం చేసుకున్నది. అభిమానులూ ధనాధన్ దంచుడుకి సిద్ధమైపోండి! దక్షిణాఫ్రికాతో తొలి టీ20 పోరు నేడు.

ఎం.ఎస్ ధోని

ధనాధన్ మెరుపులే!

- జోరుమీదున్న టీమ్ ఇండియా
- సఫారీల ఆశలు అంతంత మాత్రమే
- దక్షిణాఫ్రికాతో తొలి టీ20 పోరు నేడు
- సాయంత్రం 6 నుంచి సోనీటెన్‌లో..

నవతెలంగాణ-జొహానెస్‌బర్గ్

2019 ప్రపంచకప్ దిశగా ఆశలు పెంచుకున్న సఫారీలను వన్డేల్లో కోహ్లిసేన ఎవ్వరూ ఊహించనంత చిత్తుగా ఓడించింది. సొంతగడ్డపై సఫారీలు ఇటీవల ఇంతటి దారుణ పరాభవాన్ని చవిచూడటం ఇదే తొలిసారి. ఏబీ డివిలియర్స్ వంటి ఆధునిక క్రికెట్ దిగ్గజం జట్టులో ఉన్నా.. మణికట్టు స్పిన్‌తో టీమ్ ఇండియా అదరగొట్టింది. ఇప్పుడు సీన్ టీ20 ఫార్మాట్‌కు మారింది. కానీ సఫారీ శిబిరంలో గెలుస్తామనే ఆకాంక్ష కనిపించటం లేదు, కోహ్లిసేనలో గెలుపు కాంక్ష ఏమాత్రం తగ్గలేదు. ధనాధన్ పోరులో సఫారీల నుంచి మెరుగైన ప్రదర్శన ఆశించటంలో తప్పు లేదు కానీ, అన్ని విభాగాల్లో భీకర ఫామ్‌లో దూసుకెళ్తోన్న కోహ్లిసేన జోరుకు బ్రేక్‌లు వేయగల సత్తా ప్రత్యర్థిలో ఏ కోశాన కనిపించటం లేదు. మూడు మ్యాచుల టీ20 సిరీస్‌లో దుమ్మురేపేందుకు టీమ్ ఇండియా వాండరర్స్ వేదికగా 'వార్'కు సై అంటోంది. మరి, పొట్టి పోరులోనైనా దక్షిణాఫ్రికా కనీస పోటీ ఇవ్వగలదా?!

మహికి సవాల్! : వన్డేల్లో బ్యాటింగ్‌కు పెద్దగా అవకాశం చిక్కని కారణంగా ఎం.ఎస్ ధోని పది వేల పరుగుల మైలురాయి కోసం ఇంకొంత కాలం వేచిచూడాల్సి వస్తోంది. 50 ఓవర్ల ఫార్మాట్‌లో కొన్ని మంచి ప్రదర్శనలతో జట్టులో స్థానానికి న్యాయం చేస్తోన్న ధోని.. టీ20ల్లోనూ అలాంటిదే పునరావృతం చేయాల్సిన అవసరం ఏర్పడింది. గతంలో మాదిరి మహి స్ట్రయిక్‌రేట్ గొప్పగా లేదు, ఆరంభంలో దూకుడు లేదు. ముగింపులోనూ మునుపటి స్థాయి వీరోచితం లోపించింది. ఇలాంటి పరిస్థితుల్లో బ్యాట్‌తో మహి విలువైన ఇన్నింగ్స్ విమర్శలకు చెక్‌తో పాటు అతడి ఆత్మవిశ్వాసమూ పెంపొందుతుంది. ఇక మళ్లీ జట్టులోకి వచ్చిన సురేశ్ రైనా అచ్చొచ్చిన ఫార్మాట్‌లో తనెంటో నిరూపించుకోవాలి. 2019 ప్రపంచకప్‌పై కన్నేసిన రైనా.. ఆ దిశగా తొలి అడుగు ఈ సిరీస్‌లోనే వేయాలని అనుకుంటున్నాడు. అయితే, తుది జట్టులో మనీశ్ పాండేతో రైనాకు తీవ్ర పోటీ నెలకొన్నది. ఇక టాప్ ఆర్డర్‌లో తడబడిన రోహిత్ శర్మ భారీ సెంచరీతో ఫామ్‌లోకి రాగా.. విరాట్ కోహ్లి, శిఖర్ ధావన్‌లు పరుగుల వరద పారిస్తున్నారు. దీంతో టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ భీకర ఫామ్‌లో ఉన్నారు. మిడిల్ ఆర్డర్‌లో మహితో పాటు అయ్యర్, పాండ్యలు సత్తా చాటితే భారత్‌కు ఎదురుండదు. బంతితో మణికట్టు మాయగాళ్లు కుల్దీప్, చాహల్‌లు కీలకం కానున్నారు. బుమ్రా, భువిలు ప్రత్యర్థికి సవాల్ విసరగలరు.

అయోమయం : డుప్లెసిస్ లేని వేళ డుమిని నాయకత్వ పగ్గాలు అందుకున్నాడు. కెప్టెన్సీలో డుమిని రికార్డు మెరుగ్గానే ఉన్నా.. కోహ్లిసేన జోరు ముందు అతడి వ్యూహం ఏపాటిదో అని పెదవి విరిచే వారున్నారు!. ఏబీ డివిలియర్స్ జట్టులో ఉన్నా.. స్థాయికి తగ్గ ఇన్నింగ్స్ ఇంకా ఆడాల్సి ఉన్నది. వన్డేల్లో పక్కనకూర్చోన్న బెహార్డిన్ పొట్టి పోరులో విజృంభించాలని తహతహలాడుతున్నాడు. కనీసం ముగ్గురు ఆటగాళ్లకు సఫారీలు ఈ మ్యాచ్‌తో అరంగేట్ర అవకాశం ఇవ్వనున్నది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సీనియర్లకు విశ్రాంతి లభించగా.. సత్తా చాటేందుకు కుర్రాళ్లు సిద్ధమవుతున్నారు.

తుది జట్లు (అంచనా) :

భారత్ : రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, విరాట్ కోహ్లి, శ్రేయాష్ అయ్యర్, సురేశ్ రైనా, ఎం.ఎస్ ధోని, హార్దిక్ పాండ్య, భువనేశ్వర్ కుమార్, కుల్దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా, యుజ్వేంద్ర చాహల్.

దక్షిణాఫ్రికా : రీజా హెండ్రిక్స్, జొన్ జొన్ స్మట్స్, ఏబీ డివిలియర్స్, జెపి డుమిని, ఫర్హాన్ బెహార్డిన్, హెన్రిచ్ క్లాసెన్, క్రిస్ మోరీస్, పెహల్యూక్‌వయో, జూనియర్ డలా, డానె పీటర్సన్, అరోన్ ఫింగిసో.

పిచ్, వాతావరణం : తాజా పర్యటనలో కోహ్లిసేన ఇక్కడ ఓ టెస్టు, ఓ వన్డే ఆడింది. టెస్టులో నెగ్గినా, వర్షం అంతరాయం కల్గించిన గులాబీ పోరులో తలొగ్గింది. ఇప్పుడు ధనాధన్‌కు ఇక్కడికొచ్చింది. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇక మధ్యాహ్నం వేళ చిరు జల్లులతో కూడిన వర్షం కురిసే ప్రమాదం పొంచి ఉన్నది.

పతాక శీర్షికలు మా పని కాదు!



మైదానంలో ప్రత్యర్థులపై విరుచుకుపడుతూ పరుగుల దాహం తీర్చుకుంటున్న టీమ్ ఇండియా సారథి విరాట్ కోహ్లి.. ప్రెస్ కాన్ఫరెన్స్‌లోనూ ఏమాత్రం దూకుడు తగ్గించటం లేదు. దక్షిణాఫ్రికా చేతిలో టెస్టు సిరీస్ ఓటమి తర్వాత అన్ని వైపుల నుంచి విమర్శలు ఎదుర్కొన్న కోహ్లి.. వన్డే విజయంతో వారికి దీటుగానే బదులిచ్చాడు. పనిలో పనిగా మీడియాపై పంచ్ పడేశాడు. దక్షిణాఫ్రికాపై 5-1 విజయం విదేశాల్లో భారత్‌కు దక్కిన అతిపెద్దదని భావించవచ్చా? అని ఓ విలేకరి అడిగాడు. ఇందుకు కోహ్లి మరో విధంగా బదులిచ్చాడు. ' పతాక శీర్షికలు తయారు చేయటం, ట్యాగ్‌లైన్స్ పెట్టడం మా పని కాదు. క్రికెట్ ఆడటం మా పని, మేం అదే పరిపూర్ణంగా చేశాం' అని కోహ్లి పేర్కొన్నాడు.

6/2

పొట్టి క్రికెట్‌లో దక్షిణాఫ్రికాపై భారత్ గెలుపోటముల రికార్డు 6-2. వన్డేలు, టెస్టుల్లో సఫారీలు కాస్త పైచేయి సాధించగా.. టీ20ల్లో మనదే పూర్తి ఆధిపత్యం.

43

టీ20ల్లో 2000 పరుగులు పూర్తి చేసేందుకు విరాట్ కోహ్లి మరో 43 రన్స్ దూరంలోనే ఉన్నాడు. భారత్ తరఫున ఈ ఘనత సాధించిన తొలి క్రికెటర్‌గా నిలిచే అరుదైన అవకాశం కోహ్లి ముందున్నది.

సిరీస్ కొడతారా?

- దక్షిణాఫ్రికాతో అమ్మాయిల మూడో టీ20 నేడు
- సిరీస్ విజయంపై కన్నేసిన భారత్




జొహానెస్‌బర్గ్ : వన్డే సిరీస్‌లో క్లీన్‌స్వీప్ విజయాన్ని తృటిలో చేజార్చుకున్నా.. టీ20ల్లో మన అమ్మాయిలు అదిరే ప్రదర్శన చేశారు. తొలి రెండు మ్యాచుల్లో దక్షిణాఫ్రికా అమ్మాయిలను చిత్తు చేసి సిరీస్ విజయానికి చేరువయ్యారు. రెండు మ్యాచుల్లోనూ ఆకట్టుకునే ప్రదర్శన చేసిన మిథాలీరాజ్ మూడో టీ20లో కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉంది. ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌లో నేడు మూడో మ్యాచ్. కోహ్లిసేనతో డుమిని గ్యాంగ్ పొట్టి పోరుకు ముందు అదే మైదానంలో మధ్యాహ్నం 1.15 గంటలకు అమ్మాయిలు తలపడనున్నారు. మెన్స్ జట్టు మాదిరిగానే తిరుగులేని ప్రదర్శనతో దూసుకెళ్తోన్న మిథాలీసేన వాండరర్స్ విజయంతో సిరీస్ సొంతం చేసుకోవాలని చూస్తోంది.

మిథాలీ జోరు : ప్రపంచకప్ తర్వాత విరామం వచ్చినా.. మిథాలీరాజ్ ఆటలో మాత్రం ఎటువంటి మార్పు రాలేదు!. వరుస అర్ధ సెంచరీలతో రెచ్చిపోతున్న మహిళల క్రికెట్ దిగ్గజం.. వరుసగా రెండు అర్ధ సెంచరీలు కొట్టింది. రెండో టీ20లో అజేయంగా 76 పరుగులు చేసిన మిథాలీ నేటి మ్యాచ్‌లోనూ విజృంభించేందుకు సిద్ధంగా ఉన్నది. యువ ఓపెనర్ స్మృతి మంధాన భీకర ఫామ్ కొనసాగిస్తోంది. కానీ పొట్టి ఫార్మాట్ నాయకురాలు హర్మన్‌ప్రీత్ కౌర్ తనదైన ఇన్నింగ్స్ బాకీ పడింది. స్వల్ప స్కోర్లకే వెనుదిరిగుతోన్న కౌర్ ఇక్కడ భారీ ఇన్నింగ్స్‌పై కన్నేసింది. దక్షిణాఫ్రికా జట్టులో కెప్టెన్ నికెర్క్ మినహా ఎవ్వరూ నిలకడగా ఆడటం లేదు. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో సఫారీ అమ్మాయిలకు మనోళ్లు ఎటువంటి అవకాశం ఇవ్వటం లేదు. దీంతో నేటి మ్యాచ్‌లోనూ ఆతిథ్య జట్టు అవకాశాలు నామమాత్రమే. ఇక మడిమ గాయానికి గురై సిరీస్‌కు దూరమైన సీనియర్ పేసర్ జులన్ గోస్వామి స్థానంలో సెలక్టర్లు మరో క్రికెటర్‌ను జట్టులోకి ఎంపిక చేశారు. రుమెలి దార్ తదుపరి రెండు మ్యాచులకు గాను జట్టుతో చేరనున్నది.

బాంబ్రికి నిరాశ

చెన్నై : భారత టెన్నిస్ ఆటగాడు యూకీ బాంబ్రికి నిరాశే ఎదురైంది. మెరుపు విజయాలతో ఫైనల్లోకి ప్రవేశించినా.. టైటిల్ పోరులో బాంబ్రి తళుక్కుమనలేదు. 5-7, 6-3, 5-7తో ఫైనల్లో జోర్డాన్ థాంప్సన్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడిపోయిన బాంబ్రి చెన్నై ఓపెన్ రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. చెరో సెట్ విజయంతో సమవుజ్జీలుగా నిలిచిన తరుణంలో నిర్ణయాత్మక మూడో సెట్‌లో జోర్డాన్ మెరిశాడు. బాంబ్రిని వెనక్కి నెట్టి 7-5తో సెట్‌తో పాటు ట్రోఫీని సొంతం చేసుకున్నాడు.

వయసు 36, ర్యాంక్ నం.1



దుబాయ్ : టెన్నిస్ దిగ్గజం, 20 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత రోజర్ ఫెడరర్ మరో అరుదైన రికార్డు సొంతం చేసుకున్నాడు. లేటు వయసులో ఏటీపీ ప్రపంచ నం.1గా నిలిచిన ఆటగాడిగా నిలిచాడు. రొటెర్‌డామ్ క్వార్టర్‌ఫైనల్లో రాబిన్ హాసెపై 4-6, 6-1, 6-1తో విజయం సాధించిన ఫెడరర్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం దక్కించుకున్నాడు. దీంతో 33 ఏండ్ల 131 రోజుల వయసులో వరల్డ్ నం.1గా నిలిచిన అండ్రీ ఆగస్సీ (2003) రికార్డును ఫెడరర్ తిరగరాశాడు. ఫెడరర్ ప్రస్తుత వయసు 36 ఏండ్ల 195 రోజులు. గత 13 మాసాల్లో మూడు గ్రాండ్‌స్లామ్ విజయాలు సాధించిన ఫెడరర్ చాన్నాండ్ల తర్వాత తిరిగి అగ్రస్థానానికి చేరుకున్నాడు. ప్రపంచ నం.1గా నిలువటం ప్రత్యేక

త్వరలో క్రీడా యూనివర్సిటీ

- తెలంగాణ క్రీడాశాఖ మంత్రి పద్మారావు
- 350 మంది క్రీడాకారులకు సన్మానం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో క్రీడా యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం జరుగుతుందని రాష్ట్ర క్రీడల మంత్రి పద్మారావుగౌడ్ అన్నారు. ఎల్బీస్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో పునర్‌నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఆదివారం ఎల్బీస్టేడియంలో తెలంగాణ రాష్ట్రం నుండి 2017-18 సంవత్సరానికి గానూ జాతీయస్థాయిలో ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించిన 350మంది సబ్‌జూనియర్, జూనియర్ మరియు సీనియర్ క్రీడాకారులను పద్మారావు, సాట్స్ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. పద్మారావు మాట్లాడుతూ... రాష్ట్రంలోని క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా నూతన క్రీడాపాలసీని రూపొందించి, ముఖ్యమంత్రి ఆమోదానికి సిద్ధంగా ఉందని అన్నారు. సాట్స్ ఎండీ దినకర్‌బాబు, నీటి పారుదల మండలి చైర్మెన్ వి.ప్రకాష్, బెవరజేస్ కార్పొరేషన్ చైర్మెన్ దేవీప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ అయాచితం శ్రీధర్, ఫిల్మ్ డెవలప్‌మెంట్ సంస్థ చైర్మెన్ సి.రామ్మోహన్ రావు, కార్పొరేటర్లు సామ స్వప్న, మమత గుప్తా, ఒలింపిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు రంగారావు, ప్రేమ్‌రాజ్ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల ముగింపు

గచ్చిబౌలిలో మూడు రోజులుగా జరుగుతున్న సీఎంకప్ తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీలు శనివారం ముగిశాయి. విజేతలకు మంత్రి పద్మారావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులు రక్తదానం చేశారు.

విదేశాల్లో ఆ ఇద్దరే కీలకం



బెంగళూర్ : విదేశీ గడ్డపై భారత విజయాల్లో మణికట్టు స్పిన్నర్లు కుల్దీప్, చాహల్‌లు కీలకమని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ అభిప్రాయపడ్డాడు. ' బ్యాటింగ్ విషయంలో ఎన్ని పరుగులు చేశారనే విషయంపై ఎంతో చర్చ చేస్తాం. కానీ మిడిల్ ఓవర్లలో కుల్దీప్, చాహల్ మాయ సైతం విజయాల్ని తెచ్చిపెడుతోంది. వీరిద్దరూ కలిసి అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నారు. ప్రపంచ క్రికెట్ వీరికి విరుగుడు ఇంకా కనుగొనలేదు. వీరిపై పరుగులు చేసేందుకు ప్రత్యర్థులు సరైన మార్గాలను అన్వేషిస్తున్నారు. వీరికి వికెట్ కోల్పోకుండా ఎలా ఆడాలనీ ఆలోచిస్తున్నారు. ప్రత్యర్థులు ఆ పని చేసేలోపే భారత్ వీలైనన్ని ఎక్కువ మ్యాచులు గెలుపొందాలి' అని సచిన్ పేర్కొన్నాడు. ' ది హిందూ' నిర్వహించిన ఆలోచన కార్యశాలలో పాల్గొన్న సచిన్ ఈ సందర్భంగా మాట్లాడాడు.



జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన క్రీడాకారులను సన్మానించిన మంత్రి పద్మారావు గౌడ్, సాట్స్ చైర్మెన్ వెంకటేశ్వర్ రెడ్డి, ఎండి దినకర్ బాబు, తదితరులు

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-00020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.